అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 26-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 177 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



పార్లమెంట్‌లో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణం చేస్తున్న రాహుల్ గాంధీ.. మార్షల్‌తో కరచాలనం

ప్రతిపక్ష నేతగా రాహుల్

ప్రొటెం స్పీకర్‌కు సోనియా లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ అంశంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం తలెత్తి సభాపతి ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకొచ్చారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆయన్ను లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఎంపిక చేసినప్పటికీ.. రాహుల్ తన నిర్ణయాన్ని పెండింగ్‌లో ఉంచారు.

18వ లోక్‌సభకు సంబంధించి బుధవారం స్పీకర్ ఎన్నిక జరుగుతున్న తరుణంలో.. ప్రతిపక్ష కూటమినంతా ఏకతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ప్రతిపక్ష నేత బాధ్యతలను రాహుల్ స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి జరిగిన ప్రతిపక్ష పార్టీల భేటీలో నాయకుల ...5లో

నేడు లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక

- 50 ఏండ్లలో తొలిసారి పోటీ
- పార్లమెంట్ చరిత్రలో మూడోసారి 3లో..

హస్తినలో సీఎం బిజీబిజీ

కేంద్రఆరోగ్యశాఖమంత్రి నడ్డాతో రేవంత్ భేటీ

- ఎన్‌హెచ్‌ఎం కింద రూ.324 కోట్ల విడుదలకు వినతి
- 4 గంటల పాటు పార్లమెంట్‌లోనే ముఖ్యమంత్రి
- అగ్రనేతలతో కలిసి ప్రమాణస్వీకారాన్ని వీక్షించిన సీఎం

నామినేటెడ్ పోస్టులు, మంత్రివర్గ విస్తరణ, పార్టీలో చేరికలపై అగ్రనేతలతో చర్చ





కేంద్రమంత్రి జేపీ నడ్డాకు వినతి పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇతరపార్టీల మహిళా ఎంపీలతో...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ పర్యటనలో ఉన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి రెండో రోజు బిజీబిజీగా గడిపారు. తొలిరోజు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిశారు. రెండో రోజు కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల్ని వెంటనే విడుదల చేయాలని రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలగకుండా చూడాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం మాజీ ఎంపీ జితేందర్ రెడ్డితో కలిసి పార్లమెంట్‌లో ...15లో

చెప్పేందుకే నీతులు!

ప్రతిపక్షాలకు ప్రధాని సుద్దులు

- తన వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం
- ప్రభుత్వ విధానాలకు ప్రజలు మద్దతిచ్చారని బుకాయింపు
- కిందపడ్డా తనదే పైచేయి అంటున్న మోడీ

చింత చచ్చినా పులుపు చావలేదని సామెత. దశాబ్దకాలం పాటు అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా మోడీ పాలన సాగిందో..మూడోసారీ అదే తీరు కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారాల్లో టార్గెట్ చేసిన అంశాలనే వల్లెవేస్తూ, ప్రధానమైన అంశాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నీట్ ,నెట్ యూజీసీ లీకులు, రైలు ప్రమాదాలు, జమ్మూకాశ్మీర్ లో ఉగ్రదాడులతో పాటు హాట్ టాపిక్‌గా మారిన కీలకమైన అంశాలను చాపచుట్టడం ఎలా అన్నదానిపైనే మోడీ సర్కార్ దృష్టిపెట్టిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వీటిపై కనీస స్పందన కనబర్చని ప్రధాని ప్రతిపక్షాలకు నీతులు వల్లించడం చర్చనీయాంశంగా మారింది.



న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్షాలకు సుద్దులు చెప్పారు. ప్రజలు బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారన్నారు. వారు శ్రద్ధ, ఆసక్తితో జరిగే చర్చలను ఆశిస్తున్నారే తప్ప నినాదాలు, అవాంతరాలను కాదని అంటూ, ఇప్పటికైనా ప్రతిపక్షాలు తమ తీరును ...5లో

పాలక పక్షం ఏం చేయాలి?

భారతావని ఇప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటోంది. ఇది మోడీ ఆ సమస్యల పరిష్కారం గురించి ఆలోచించాల్సిన సమయమే తప్పించి మూడోసారి గెలిచినందుకు సంబరపడాల్సిన సందర్భం కాదు. గత పదేండ్ల కాలంలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. దేశంలో ఎక్కడో ఒక చోట ప్రతిరోజూ పేపర్ లీకేజీల వార్తలు విన్పిస్తూనే ఉన్నాయి. మౌలిక లక్ష్యాలను కూడా నెరవేర్చడంలో మోడీ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కాంగ్రెస్, ఆర్జేడీయే కారణమని నిందించేందుకు బీజేపీ ప్రయత్నించడం శోచనీయం. మధ్యప్రదేశ్‌లో వెలుగు చూసిన వ్యాపం కుంభకోణంతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లెక్కలేనన్ని పేపర్ లీకేజీలు జరుగుతున్న విషయాన్ని ఆ పార్టీ విస్మరిస్తోంది. ప్రభుత్వం ఇకనైనా సంక్షోభ తీవ్రతను గుర్తించి చట్టసభలో దానిపై కూలంకషంగా చర్చించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించడం ద్వారా ఈసీపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాల్సి ఉంది. పాలక పక్షానికి చెందిన నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పదేపదే ఉల్లంఘించినప్పటికీ ప్రధాన ఎన్నికల కమిషనర్ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయారు. పైగా ప్రతిపక్ష నేతలు, విమర్శకులనే బెదిరించారు. ఆయనను అభిశంసించాల్సిన అవసరం కూడా ఉంది. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతిపక్షాలకు సుద్దులు చెబుతున్న ప్రధాని ముందుగా వారికి కొన్ని బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది.

పదేండ్లూ.. అప్రకటిత ఎమర్జెన్సే..

మోడీ తన ప్రసంగంలో ఎమర్జెన్సీని ప్రస్తావించడం గురివింద గింజ సామెతను గుర్తుకు తెస్తోంది. అత్యవసర పరిస్థితి ప్రజాస్వామ్యానికి మచ్చ వంటిదని ఆయన చెప్పారు. యువతరం ఈ చీకటి అధ్యాయాన్ని ఎన్నటికీ మరచిపోదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ తీసుకుంటుందని తెలిపారు. ఎమర్జెన్సీ నిజంగానే సంస్థాగత, వ్యక్తిగత స్వేచ్ఛను హరించింది. అది చీకటి అధ్యాయమే. కానీ ఇదే రకమైన ఆరోపణను మోడీ కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టబద్ధమైన నిబంధనలేవీ అమలు చేయకుండానే ఆయన అన్ని రకాల స్వేచ్ఛలను హరించారు. గత పదేండ్ల పాలనలో కేంద్ర దర్యాప్తు సంస్థలను, పోలీసులను దుర్వినియోగం చేశారని, విమర్శకులు, హక్కుల కార్యకర్తలను అరెస్టు చేశారని, మీడియాను భయపెట్టారని మోడీపై ఆరోపణలు వచ్చాయి. ఎమర్జెన్సీని విధించకుండానే రాజకీయ కక్షసాధింపు చర్యలకు ఎలా పాల్పడవచ్చో ప్రజలు చూశారు. మహారాష్ట్రలో పార్టీలను నిట్టనిలువునా చీల్చారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగినంత మెజారిటీ రాకపోవడానికి ఆ రాష్ట్రంలో తగిలిన ఎదురుదెబ్బలే ప్రధాన కారణం. అయినా ప్రజాతీర్పు నుంచి గుణపాఠం నేర్చుకునేందుకు మోడీ సిద్ధంగా లేరు.

రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ

పదేండ్ల నుంచి నిలిపేసిన పథకాలపై ఆరా

- జీడీపీ అధికంగా వచ్చే రంగాలపై దృష్టి సారించాలి : వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్టు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి తుమ్మలతో కలిసి వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. రైతు భరోసాకు సంబంధించి రైతుల అభిప్రాయమెలా ఉంది? ఏ విధంగా ముందుకు పోతే మంచిదనే విషయాలను వారి ద్వారానే తెలుసుకోవాలనే ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయనున్నట్టు పేర్కొన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాలకు ఏటా చేస్తున్న ఖర్చు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రాబోయే రోజుల్లో పెరుగనున్న బడ్జెట్‌పై ...5లో

అటూ ఇటూ కాక..

మండలి కోసం ఆరాటం..

- ఎమ్మెల్సీలను లాక్కునేందుకు కాంగ్రెస్.. కాపాడుకునేందుకు బీఆర్ఎస్...
- వ్యూహ ప్రతి వ్యూహాల్లో అధికార, ప్రధాన ప్రతిపక్షాలు
- 'ఆకర్షణ' బాధ్యతలను ఓ సీనియర్‌కు అప్పగించిన సీఎం రేవంత్
- బీఆర్ఎస్ మండలి పక్షాన్నే కాంగ్రెస్‌లో కలుపుకునే వ్యూహం
- అడ్డుకునేందుకు కేసీఆర్ సమాలోచనలు
- ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో చర్చోపచర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఆర్నెల్లు గడిచింది..లోక్‌సభ ఎలక్షన్ల ఫలితాలు వెలువడి నెల కావస్తోంది. అయినా రాష్ట్రంలో రాజకీయ వేడి తగ్గలేదు. ఒకవైపు శాసనసభలో తన బలాన్ని పెంచుకునేందుకు అధికార కాంగ్రెస్ శరవేగంగా పావులు కదుపుతూ ఒక్కో ఎమ్మెల్యేను చేర్చుకుంటుండగా, మరోవైపు చేజారిపోతున్న శాసనసభ్యులను కాపాడుకునేందుకు ప్రధాన ప్రతిపక్షం తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ ఎపిసోడ్లు ఇలా కొనసాగుతుండగా... ఇప్పుడు ఆ రెండు పార్టీల దృష్టి 'పెద్దల సభ' అయిన శాసనమండలిపై పడింది. అక్కడ సంఖ్యాబలం రీత్యా 28 మంది సభ్యులున్న బీఆర్ఎస్ పెద్ద పార్టీగా ఉంది. ఇటీవల గెలిచిన సభ్యుడితో ...15లో



మాట్లాడుతున్న కేసీఆర్

మాజీ సీఎం కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

- దానిపై హైకోర్టులో పిటీషన్
- 27లోపు వివరణ ఇమ్మన్న జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ 15లో..

ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా

జులై 4 నుంచి తొలివిడత ప్రారంభం

- 6 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 15 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- 19న సీట్ల కేటాయింపు
- 26 నుంచి రెండో విడత కౌన్సెలింగ్
- ఆగస్టు 8 నుంచి తుదివిడత కౌన్సెలింగ్
- 18 వరకు ప్రవేశాల ప్రక్రియ పూర్తి
- మూడు విడతల్లో ఎప్‌సెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్
- సవరణ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా పడింది. వచ్చేనెల నాలుగు నుంచి ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల నాలుగు నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు మూడు విడతల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ...15లో

అలక వీడని జీవన్‌రెడ్డి

గాంధీభవన్ వద్ద ధర్నా చేస్తానని ప్రకటన

- భారీగా పెంచిన పోలీసు బందోబస్తు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు బుజ్జగింపులు
- కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీ ఫోన్
- మంత్రి పదవి లేదా ఆర్టీసీ చైర్మెన్ పదవంటూ లీకులు
- ఎమ్మెల్సీగా ఏడాది కాలానికే మంత్రి పదవా? అంటూ నేతల్లో గుసగుసలు
- రాజీనామా చేస్తా... పార్టీలో కొనసాగుతా : జీవన్‌రెడ్డి



జీవన్‌రెడ్డిని బుజ్జగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు...

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు చెప్పకుండా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకున్నారనే ఆవేదనతో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అలకబూనారు. రెండు రోజులుగా ఆయన అలక వీడలేదు. హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో ఉన్న ఆయన నివాసానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెళ్లి చర్చలు ...5లో

పత్తి మళ్లీ విత్తాల్సిందే...

వర్షాభావంతో మొలకెత్తని గింజలు

- 60 మి.మీ నమోదైతేనే విత్తనాలు నాటాలి..
- అనేక చోట్ల 20శాతానికి పైగా లోటు వర్షపాతం
- సరిపడా తేమలేక భూమిలోనే దెబ్బతిన్న గింజలు
- ఆర్థిక భారంతో అవస్థలు.. వానకోసం రైతు నిరీక్షణ
- రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

దూది పూలసాగు దు:ఖం తెప్పిస్తోంది. ఏటేటా పంట సాగు విస్తీర్ణం పెరుగుతున్నా.. ధరల్లో పదేండ్లుగా పెద్ద వ్యత్యాసం ఉండటం లేదు. అయినా రాష్ట్రంలో భూములు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు వరి తర్వాత అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. ఆర్నెళ్ల పంటకాలంలో ప్రతియేటా ఏదో ఒక దశలో ప్రకృతి వైపరీత్యాలతో పత్తి రైతులు నష్టపోతున్నారు. అతివృష్టి లేదంటే అనావృష్టి పత్తి రైతులను దెబ్బతీస్తోంది. ఈసారి వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. రోహిణి కార్తె ముందు నుంచే చెదురుమదురు వానలు కురుస్తుండటంతో జూన్ ఆరంభం నుంచి రైతులు విత్తనాలు నాటడం మొదలుపెట్టారు. 60 మి.మీ వర్షపాతం నమోదైతేనే పత్తి విత్తనాలు నాటాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నా.. చాలా మంది రైతులు "వర్షాలు కురవకపోతాయా.." అన్న ధీమాతో అరకొర తేమకే విత్తనాలు వేశారు. రాష్ట్రంలో అధిక ప్రాంతాల్లో 20శాతంకు పైగా లోటు వర్షాలు కురవడంతో సరైన పదును లేక గింజలు మొలకెత్తలేదు. బావులు, బోర్లున్న రైతులు తడులివ్వగా.. వర్షాధారంగా సాగు చేస్తే మాత్రం మరోసారి విత్తక తప్పని స్థితి నెలకొంది.

మళ్లీ విత్తాల్సిందే..

తెలంగాణలో వరి తర్వాత అధిక విస్తీర్ణంలో ...15లో

బెట్ట కాలంతో గింజలు దెబ్బతిన్నాయి



మూడున్నర ఎకరాలు పత్తి విత్తనాలు పెట్టాను. ఎకరానికి రూ.11వేలకు పైగా ఖర్చు వచ్చింది. వర్షాలు లేకపోవడంతో గింజలు మొలకెత్తలేదు. రోజూ మబ్బులు పడుతుంటే ఆశగా చూస్తున్నాం. కానీ బట్టతడుపు వాన కూడా రావట్లేదు. బెట్ట కాలంతో గింజలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మళ్లీ ప్యాకెట్లు తెచ్చి విత్తనాలు వేయక తప్పదు. వానలు లేకపోవడంతో మూడున్నర ఎకరాల పేరు మీద రూ.28వేలకు పైగా నష్టపోవాల్సి వస్తుంది. కనీసం పంటకు మంచి రేటైనా పడితే కొంత ఆర్థికభారం తప్పుతుంది.

- యంద్రపల్లి రవికుమార్, రైతు, వల్లాపురం, ముదిగొండ

టెక్నాలజీతో రవాణా బెస్ట్ పాలసీపై అధ్యయనం

- అధికారుల ఆధ్వర్యంలో స్టడీ టూర్
- పొరుగు రాష్ట్రాల్లోని టాక్సేషన్ అమలుకు చర్యలు : రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాలో అధునాతన టెక్నాలజీ ఉపయోగించుకొని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న బెస్ట్ పాలసీలపై రవాణా శాఖ ముఖ్య అధికారుల ఆధ్వర్యంలో స్టడీ టూర్ కొనసాగుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ, కర్నాటక, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై మొత్తం నాలుగు బృందాలుగా అధికారులు పర్యటిస్తున్నారన్నారు. ఒక డీటీసీ, ఆర్టీవో, ఎంవీఐలతో ఒక బృందంగా ఏర్పడి ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. రవాణా శాఖ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో వాడుతున్న సాంకేతిక టెక్నాలజీ, ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్, వెహికిల్ టారిఫ్, ట్రాకింగ్, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ టెస్టింగ్, లైసెన్స్‌ల జారీ, సీఎన్జీ, ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ, రోడ్డు భద్రతపై అవగాహన తదితర వాటిపై అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు. రవాణా శాఖ అధికారులు అధ్యయనం చేసిన పాలసీలపై ప్రభుత్వం అధ్యయనం చేసి అందులో బెస్ట్ పాలసీని తెలంగాణలో అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. వీటితో పాటు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన పన్నుల వ్యవస్థ ఉందని, ఆదాయ మార్గాలను పెంచుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ఉపయోగిస్తున్న మార్గాలు, అక్కడ అమలవుతున్న వాటిలో మంచి టాక్సేషన్ ఇక్కడ అమలయ్యేలా చూస్తామని తెలిపారు.

రామగుండంలో 800 సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రం ఏర్పాటు

- సింగరేణి ఆధ్వర్యంలో నిర్మాణం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండంలో ప్రస్తుతం ఉన్న 62.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాన్ని నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సింగరేణి ఈ విద్యుత్కేంద్రాన్ని నిర్మిస్తుందన్నారు. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు ఈ నిర్మాణం తోడ్పడుతుందని వివరించారు. సుదీర్ఘకాలంగా ఈ డిమాండ్ పెండింగ్‌లో ఉందనీ, ఈ హామీని అమల్లోకి తేవాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, రాజ్‌ఠాగూర్‌సింగ్, ఆది శ్రీనివాస్, విజయ రమణారావు డిప్యూటీ సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికాయన సానుకూలంగా స్పందించారు. నిజాం కాలంలో నిర్మించిన చారిత్రాత్మకమైన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌ను పిట్ హెడ్ ప్లాంట్‌గా ఆధునికంగా తిరిగి నిర్మిస్తామన్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

కంటోన్మెంట్ బోర్డుల రద్దు

మున్సిపాల్టీల్లో విలీన ప్రక్రియ వేగవంతం చేయండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి ఏ గిరిధర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కంటోన్మెంట్‌ల పరిధిలోని సివిల్ ప్రాంతాలను మున్సిపాల్టీల్లో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఏ గిరిధర్ అధికారుల్ని ఆదేశించారు. మంగళవారంనాడాయన వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. బ్రిటిష్ పాలన నుంచి నేటి వరకు భారతదేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదనీ, దానిలో భాగంగా కంటోన్మెంట్ ఏరియాల్లోని సివిల్ ప్రాంతాలను మున్సిపాల్టీల్లో విలీనం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలనే కేంద్రప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమ్మతిని తెలిపిందని ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. సివిల్ ఏరియాల తొలగింపు విధివిధానాలను ఖరారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వంతో ఇంకా పంచుకోలేదని అన్నారు. ఈ అంశంపై కేంద్రంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వివరణ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

దేశానికే మోడల్‌గా పీఎంశ్రీ స్కూళ్లు

- ఒక్కో పాఠశాల అభివృద్ధికి రూ.కోటి
- రాష్ట్రంలో 794 సర్కారు బడులు ఎంపిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద దేశవ్యాప్తంగా 14,500 ప్రభుత్వ పాఠశాలలను దేశానికే మోడల్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో తెలంగాణ నుంచి 794 పాఠశాలలు ఎంపికయ్యాయి. పీఎం శ్రీ కింద ఎంపికైన ఒక్కో పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి కేటాయించి ఖర్చు చేయనుంది. ఆ నిధులను ఐదేండ్లలో విడుదల చేస్తుంది. 2021-22 యూడైస్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొదటి దశలో 543, రెండో దశలో 251 పాఠశాలలు కలిపి మొత్తం 794 సర్కారు బడులు పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యారు. ఆ పాఠశాలల్లో క్రీడా సామాగ్రి, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు, మౌలిక వసతులను ఈ పథకం కింద కల్పిస్తారు.

ఆ పాఠశాలల అభివృద్ధికి అయ్యే ఖర్చులో మెజార్టీ నిధులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఇటీవల నిర్వహించిన పీఎం శ్రీ సన్నాహక సమావేశంలో తెలంగాణకు రూ.300 కోట్లు కేటాయించాలని విద్యాశాఖ అధికారులు ప్రతిపాదించారు. షూటింగ్, ఆర్చరీ వంటి క్రీడల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 28న ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు (పీఏబీ) సమావేశం జరగనుంది. అందులో రాష్ట్రంలోని పీఎం శ్రీ స్కూళ్ల అభివృద్ధికి ఎన్ని నిధులు మంజూరవుతాయో స్పష్టత రానుంది.

రామమందిరంలో నీరు కారుతోంది

- భారీ వర్షాలే కారణమంటున్న ప్రధాన అర్చకుడు
- అవినీతి వల్లనే అంటున్న ప్రతిపక్షం



అయోధ్య : అయోధ్యలోని రామమందిరం సీలింగ్ నుండి నీరు కారుతోంది. ప్రజలను దర్శనాలకు అనుమతించిన తర్వాత తొలిసారిగా కురిసిన భారీ వర్షంతో లీకేజీ మొదలైందని ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ చెప్పారు. అయోధ్య మందిరాన్ని రూ.1,800 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తి కాకుండానే జనవరి 22న ప్రధాని నరేంద్ర మోడీ దీనిని అట్టహాసంగా ప్రారంభించారు. అర్చకుడు రాముడి విగ్రహం ముందు కూర్చొని పూజలు చేస్తారు. పైకప్పు నుండి లీకైన నీరు ఇప్పుడు నేరుగా ఆ పూజారి పైనే పడుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఇంజినీర్లు ఈ మందిరాన్ని నిర్మిస్తున్నారని, ఇలా సీలింగ్ నుండి నీరు కారడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని దాస్ తెలిపారు. 'ఈ దేవాలయాన్ని జనవరి 22న ప్రారంభించారు. వర్షం పడితే పైకప్పు లీక్ అవుతుందని ఎవరికీ తెలియదు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దేవాలయం పైకప్పు నుండి నీరు కారడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది ఎలా జరిగింది?' అని ఆయన అన్నారు. మందిర నిర్మాణంలో నిర్లక్ష్యం చోటుచేసుకున్నదని, మందిర ప్రాంగణం నుండి వర్షపు నీరు బయటికి పోవడానికి డ్రైనేజీ వ్యవస్థ ఏదీ లేదని ఆయన ఆరోపించారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన ఆలయ అధికారులను కోరారు.

లీక్ అవుతున్న ప్రదేశం పైన ఎలాంటి ఆచ్ఛాదన లేదని, వర్షపు నీరు సీలింగ్‌పై నేరుగా పడుతుందని, అందుకే లీకేజీ జరిగిందని శ్రీరామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్‌పర్సన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. ఇలా జరుగుతుందని ఊహించామని, ఎందుకంటే గురు మండపానికి ఆచ్ఛాదన కల్పించలేదని తెలిపారు. డిజైన్ లేదా నిర్మాణంలో లోపాలు జరిగాయన్న ఆరోపణను ఆయన తోసిపుచ్చారు. ఎలాంటి ఆచ్ఛాదన లేని మండపాల నుండి వర్షపు నీరు పడవచ్చునని అన్నారు. మండపాలపై చర్చ జరిగిందని, నగర నిర్మాణ నిబంధనల ప్రకారం వాటిని కప్పి ఉంచకూడదని వివరించారు.

ఇదిలావుండగా నగరంలో నిర్మించిన కొత్త రోడ్లన్నీ భారీ వర్షం కారణంగా జలమయమయ్యాయి. అయోధ్యలో మందిర నిర్మాణంలో, సౌకర్యాల కల్పనలో అధికార బీజేపీ అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాయ్ ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తొందరగా మందిర నిర్మాణం జరపాలన్న ఉద్దేశంతో నాసిరకం సామగ్రిని వినియోగించారని ఆయన విమర్శించారు.

ప్రతి ఐదుగురిలో ముగ్గురే

ఇంటర్ విద్యకు బాలికలు దూరం

- లింగ వివక్ష, యుక్త వయస్సు, విద్యా సౌకర్యాలలేమే కారణమా
- చైల్డ్ రైట్స్ అండ్ యూ (క్రై) సంస్థ



న్యూఢిల్లీ : దేశంలో ప్రతి ఐదుగురు బాలికల్లో ముగ్గురు మాత్రమే ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. మిగిలిన ఇద్దరూ పదో తరగతితోనే చదువు మానేస్తున్నారు. లింగ వివక్ష, యుక్త వయస్సు రాకుండానే వివాహాలు జరగడం, విద్యా సౌకర్యాలు సరిగా లేకపోవడం దీనికి కారణంగా భావిస్తున్నారు. బాలికలు చదువును అర్ధాంతరంగా ఆపేస్తుండడంపై చైల్డ్ రైట్స్ అండ్ యూ (క్రై) అనే సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. వివిధ రాష్ట్రాల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు ఈ సంస్థ సోమవారం నుండి వారం రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టింది. 'పూరీ పఢాయి దేశ్ కీ భలాయ్' పేరిట నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం బాలికల విద్యపై ప్రజల్లో అవగాహన కల్పిస్తుంది. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిలో విద్యార్థినుల నమోదును పెంచేందుకు కృషి చేస్తుంది.

విద్యాభ్యాసాన్ని పూర్తి చేసేందుకు బాలికలు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సామాజిక-ఆర్థిక సవాళ్లు, సాంస్కృతిక నిబంధనలు, దూర ప్రాంత ప్రయాణాలు, భద్రతాపరమైన సమస్యలు వంటివి వారిని చదువులకు దూరం చేస్తున్నాయి. ఫలితంగా డ్రాపవుట్ రేట్లు పెరుగుతున్నాయి. చదువులకు స్వస్తి చెప్పే బాలికలు బాల కార్మికులుగా మారిపోతున్నారు. యుక్త వయసు రాకుండానే వివాహాలు జరుగుతున్నాయి. టీనేజీలోనే గర్భవతులు అవుతున్నారు. అవమానాలు, వేధింపులు, చివరికి అక్రమ రవాణాకు కూడా గురవుతున్నారు. బాలికలకు ఇంటర్ విద్యను అందించాలంటే ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వాలని, ప్రోత్సాహకాలు అందించాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని క్రై సంస్థ సీఈఓ పూజా మర్వాహా సూచించారు. అయితే ముందుగా బాలికల విద్యపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని ఆమె నొక్కి చెప్పారు.

రాజ్యాంగ ప్రతులతో
ప్రతిపక్ష ఎంపీల ప్రమాణం



మాతృభాషలో ప్రమాణానికే ప్రాధాన్యతనిచ్చిన ఎంపీలు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ రెండో రోజైన మంగళవారం ప్రతిపక్ష ఇండియా ఫోరం సభ్యులు రాజ్యాంగ ప్రతులను చేబూని ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ ప్రారంభమయిన వెంటనే ప్రొటెం స్పీకర్ భర్తహరి మెహతాబ్ ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్య మధ్యలో ప్యానెల్ సభ్యులు రాధామోహన్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, కనిమొళి వంటి సీనియర్ నేతలు ప్రమాణ స్వీకారం చేశారు.అయితే రాహుల్ డిఫరెంట్‌గా ఎర్రటి రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణం చేశారు. స్పీకర్ ఛైర్ పక్కనే ఉన్న మార్షల్‌తో సైతం కరచాలనం చేయటంతో అంతా ఆశ్చర్యపోయారు. లోక్‌సభలో రాహుల్ డిఫరెంట్ స్టైల్ ఇప్పుడే కాదు. గతంలో కూడా ప్రధాని మోడీని ఆలింగం చేసుకుని హల్‌చల్ చేశారు. ఇపుడు స్పీకర్ మార్షల్‌ను కరచాలనం చేయటంతో సభ్యులు బల్లలు చరిచారు.

సీపీఐ(ఎం) సభ్యులూ..

సీపీఐ(ఎం) సభ్యులు రాజ్యాంగ ప్రతులను పట్టుకొని ప్రమాణ స్వీకారం చేశారు. కేరళలోని అలత్తూరు నుంచి గెలుపొందిన సీపీఐ(ఎం) ఎంపీ కె.రాధాకృష్ణన్ మళయాలంలోనూ, రాజస్థాన్‌లోని సికర్ నుంచి గెలుపొందిన ఎంపీ అమ్రారామ్ హిందీలోనూ, తమిళనాడులోని మధురై నుంచి గెలుపొందిన ఎస్.వెంకటేషన్, దిండిగుల్ నుంచి గెలుపొందిన ఆర్.సచ్చితానందం తమిళంలో ప్రమాణ స్వీకారం చేశారు. తిరుప్పూర్ నుంచి గెలుపొందిన సీపీఐ ఎంపీ కె.సుబ్బరాయన్ తమిళంలో ప్రమాణ స్వీకారం చేశారు. బీహార్‌లోని కరకట్ నుంచి ఎన్నికైన సీపీఐ(ఎంఎల్) ఎంపీలు రాజా రామ్ సింగ్, అర్రా నుంచి ఎన్నికైన సీపీఐ(ఎంఎల్) సుదామ ప్రసాద్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.

తమిళ ఎంపీ తెలుగులో...

ఎంపీలు తమ తమ మాతృభాషల్లో ప్రమాణం చేశారు. అయితే, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ఎంపీ మాత్రం తన మాతృభాష తమిళ్‌లో కాకుండా తెలుగులో ప్రమాణం చేసి ఆశ్చర్యపరిచారు. తమిళనాడులోని కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ కె. గోపినాథ్, మంగళవారం లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, చివరిలో మాత్రం 'జై తమిళనాడు' అంటూ తమిళంలో నినదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.





తెలంగాణ ఎంపీలు తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో ...

తెలంగాణకు చెందిన 17 మంది సభ్యుల్లో కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరు సోమవారం ప్రమాణ స్వీకారం చేయగా, మంగళవారం 15 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అందులో తెలుగులో ఎనిమిది మంది, ఇంగ్లీష్‌లో ఐదుగురు, హిందీలో ఒకరు, ఉర్దూలో ఒకరు చేశారు. తెలుగులో కాంగ్రెస్ ఎంపీలు సురేష్ కుమార్ షెట్కార్ (జహీరాబాద్), మల్లురవి (నాగర్‌కర్నూల్), కె. రఘువీర్ (నల్గొండ), చలమల కిరణ్ కుమార్ రెడ్డి (భువనగిరి), కడియం కావ్య (వరంగల్), బలరామ్ నాయక్ (మహబూబాబాద్), బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్ (మల్కాజ్‌గిరి), డీకే అరుణ (మహబుబ్‌నగర్) ప్రమాణ స్వీకారం చేశారు. ఇంగ్లీష్‌లో కాంగ్రెస్ ఎంపీలు గడ్డం వంశీకృష్ణ (పెద్దపల్లి), రామసహాయం రెడ్డి (ఖమ్మం), బీజేపీ ఎంపీలు ధర్మపురి అరవింద్ (నిజమాబాద్), ఎం.రఘునందన్ రావు (మెదక్), కొండా విశ్వేశ్వరరెడ్డి (చేవెళ్ల) ప్రమాణ స్వీకారం చేశారు. హిందీలో బీజేపీ ఎంపీ గొడం నగేష్ (అదిలాబాద్) ప్రమాణ స్వీకారం చేయగా, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ (హైదరాబాద్) ఉర్దూలో ప్రమాణ స్వీకారం చేశారు.

బెయిల్ అంశాలను అనవసరంగా
వాయిదా వేయొద్దు : సుప్రీం వ్యాఖ్య

జులై 9న ఆప్ నేత సత్యేందర్ జైన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ



న్యూఢిల్లీ : బెయిల్ విషయాలను అనవసరంగా వాయిదా వేయవద్దని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. మనీ లాండరింగ్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఆప్ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణలోనైనా ఢిల్లీ హైకోర్టు నిర్ణయం తీసుకోగలదని ఆశిస్తున్నట్టు పేర్కొంది. తన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఆరు వారాల పాటు వాయిదా వేస్తూ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ జైన్ పిటిషన్ వేశారు. దానిపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ భట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ పై వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు జైన్ బెయిల్ పిటిషన్‌పై జులై 9న విచారణ చేపట్టాలని నిర్ణయించింది.

అంతకుముందు జైన్ తరపు వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ, నిందితుడి డీఫాల్ట్ బెయిల్ హక్కును హరించేందుకు దర్యాప్తు సంస్థ అసంపూర్తిగా వున్న ఛార్జిషీట్‌ను దాఖలు చేసిందా అనే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. ఇదే విషయం సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పరిశీలనలో వుందని, దానికి జైన్ బెయిల్ పిటిషన్‌ను జత చేసి విచారించాల్సిందిగా వెకేషన్ బెంచ్‌ను కోరారు. తమది ద్విసభ్య ధర్మాసనం అయినందున తాము దాన్ని విచారించలేమని జస్టిస్ మిశ్రా చెప్పారు. హైకోర్టు ముందు ఆ విషయాన్ని పరిష్కరిస్తే తర్వాత తాము చేపడతామని బెంచ్ పేర్కొంది. వాస్తవిక కోణాన్ని పరిగణనలోకి తీసుకుని హైకోర్టు ఈ కేసును విచారించాలని పేర్కొంది. మనీ లాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్‌ను ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.



క్షీణించిన ఢిల్లీ మంత్రి ఆరోగ్యం

ఆస్పత్రికి తరలింపు

- ఐదు రోజులుగా నీటి కోసం నిరాహార దీక్ష

న్యూఢిల్లీ : వేసవి కాలం మధ్య నుంచి ఢిల్లీ తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటోంది. హర్యానా రాష్ట్రం ఢిల్లీకి సరఫరా చేయాల్సిన నీటి కంటే తక్కువగా సప్లై చేయడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రాష్ట్రానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఢిల్లీ జలవనరుల శాఖా మంత్రి అతిషి ఈ నెల 21న నిరాహార దీక్షకు పూనుకున్నారు. మంగళవారం ఉదయానికి ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. షుగర్ లెవల్స్ పడిపోవడంతో హుటాహుటిన ఆమెను లోక్ నాయక్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. తన నిరసన ప్రారంభించినప్పటి నుంచి హర్యానా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఢిల్లీకి నీటి సరఫరాను తగ్గించిందని ఆమె ఆరోపించారు. కాగా, హర్యానా నుంచి జాతీయ రాజధానికి సరైన నీటిని అందించాలని ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాస్తానని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు.

చంద్రయానంలో చైనా ప్రపంచ రికార్డు !

మట్టి, రాళ్ళ నమూనాలు తీసుకుని భూమికి చాంగే-6

బీజింగ్ : చంద్రయానంలో చైనా ప్రపంచ రికార్డు సృష్టించింది. చాంగే -6 చంద్రుని ఆవల ఉపరితలంపై నుండి రాళ్లు, మట్టి నమూనాలను తీసుకుని భూమిపైకి వచ్చింది. ఈ నౌక మంగళవారం మధ్యాహ్నం ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియన్ ప్రాంతంలో దిగినట్లు అధికారులు తెలిపారు. మే 3న నింగిలోకి వెళ్లిన చాంగే -6 53 రోజుల అనంతరం నమూనాలు తీసుకుని నేడు భూమికి చేరింది. ఈ నౌక చంద్రుని ఉపరితలంపై డ్రిల్ చేసి మట్టిని, రాళ్లను సేకరించింది. 25 లక్షల ఏండ్ల నాటి అగ్ని పర్వత శిలలు, ఇతర పదార్థాలు ఈ నమూనాల్లో ఉండవచ్చని చైనా శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. దీంతో చంద్రుని రెండు వైపుల ఉన్న భౌగోళిక వైవిధ్యాలకు సంబంధించి పలు ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయని భావిస్తున్నారు. గతంలో అమెరికా, సోవియట్ రష్యాలు చంద్రుడి కనిపించే భాగం వైపు నుంచి నమూనాలను సేకరించాయి. ఇటీవలి సంవత్సరాలలో చైనా చంద్రునిపై అనేక విజయవంతమైన మిషన్‌లను ప్రారంభించింది. గతంలో చాంగ్ -5 రోదసీ నౌకతో చంద్రుని ఇవతలి వైపు నమూనాలను సేకరించింది. కాగా, ప్రస్తుతం చంద్రుని ఆవలివైపు నమూనాలు సేకరించిన మొదటి దేశంగా చైనా నిలిచింది. భూమి నుంచి కనిపించే చంద్రుని భాగాన్ని నియర్ సైడ్ అని, కనిపించని ఆవలి వైపు భాగాన్ని ఫార్ సైడ్ అని పేర్కొంటారు.

భూమికి కనిపించే ప్రదేశమంతా చదునుగా వున్నట్టు కనిపించినప్పటికీ, చంద్రునికి ఆవలివైపు మొత్తంగా పర్వతాలు, బిలాలతో నిండి వుంటుంది. ఇలా చంద్రునికి రెండు వైపులా వున్న ఈ వైవిధ్యానికి ఏ భౌగోళిక కార్యాచరణ బాధ్యత వహిస్తుందన్న ప్రధాన ప్రశ్నకు ఇప్పుడు సేకరించిన నమూనాలు సమాధానమిచ్చే అవకాశం ఉందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జియాలజిస్ట్ జోంగ్యు యుయె తెలిపారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ భాగస్వామ్యంతో సోమవారం ప్రచురించిన అధ్యయనంలో ఈ విషయాలు పేర్కొన్నారు. గతంలో చంద్రునిపై ఉల్క ఢీ కొట్టిన జాడలకు సంబంధించిన నమూనాలను కూడా ఈ నౌక తీసుకురావచ్చని భావిస్తున్నారు.

వాడు సామాన్యుడు కాదు !

24 సంవత్సరాల్లో అనేక ప్రశ్నాపత్రాలు లీక్ చేశాడు

- జైలు.. బెయిల్.. వ్యాపారం.. ఇదంతా రొటీన్ అంటూ వ్యాఖ్య
- 'ఇండియా టుడే' స్టింగ్ ఆపరేషన్‌లో బయటపడిన బిజేందర్ బాగోతం

న్యూఢిల్లీ : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కుంభకోణంపై 'ఇండియా టుడే' పత్రికకు చెందిన ప్రత్యేక బృందం జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో అనేక విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ఈ నెట్‌వర్క్‌లో కీలక సభ్యుడైన బిజేందర్ గుప్తా గడచిన 24 సంవత్సరాల కాలంలో అనేక ప్రశ్నాపత్రాలు లీక్ చేశాడు. ఇప్పటికి రెండు సార్లు అరెస్ట్ అయినప్పటికీ పోలీసుల నుండి తప్పించుకున్నాడు. నీట్-యూజీ పేపర్ లీక్ అవుతుందని మార్చిలోనే అతను చెప్పినట్లుగా ఓ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. 2023లో ఒడిషా స్టాఫ్ సెలక్షన్ కమిటీ (ఓఎస్ఎస్‌సీ), మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షా పత్రాల లీకేజీలో గుప్తా ప్రమేయం ఉంది. గత ఇరవై నాలుగు సంవత్సరాలుగా తాను ఈ లీకేజీల వ్యాపారంలోనే ఉన్నానని అతను చెప్పాడు. నీట్-యూజీ పేపరును 700 మందికి అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది రూ.200-300 కోట్ల రాకెట్ అని తెలిపాడు. ఇండియా టుడే పత్రిక జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో బిజేందర్ గుప్తా అనేక విషయాలు బయటపెట్టాడు. రవాణా సమయంలో ప్రశ్నాపత్రాల బాక్సులను ఎలా తెరుస్తారో, బ్లాక్‌లిస్టులో ఉన్న కంపెనీలకు ఏ విధంగా టెండర్లు దక్కుతాయో వివరించాడు. కుంభకోణంలో కీలక నిందితుడిగా ఉండి ప్రస్తుతం పరారీలో ఉన్న సంజీవ్ ముఖియా, ఇటీవలే అరెస్టయిన విశాల్ చౌరాసియాలు తనకు తెలుసునని చెప్పాడు. 'జైలు...ఆనక బెయిలు... ఆ తర్వాత మళ్లీ వ్యాపారం...ఇవన్నీ రొటీన్‌గా జరిగేవే' అని స్టింగ్ ఆపరేషన్‌లో గుప్తా వ్యాఖ్యానించాడు. నీ వీడియో వైరల్ అయిన తర్వాత ఎవరైనా ఫోన్ చేశారా అని ప్రశ్నించగా తన నెంబరు ఎవరికీ తెలియదని చెప్పాడు. 'ఏదైనా పొరబాటు జరిగితే పెద్ద గొడవ అవుతుంది. నీట్ పరీక్షలో ఇదే జరిగింది. ఆర్థిక వ్యవహారాల విభాగం సరైన దిశలోనే దర్యాప్తు చేస్తోంది. ఎన్టీఏ దీనిని అర్థం చేసుకోలేదు' అని అన్నాడు. ప్రశ్నాపత్రాలు ఉన్న బాక్సులను రవాణా సమయంలో ఎలా తెరిచేదీ వివరించాడు. బ్లాక్‌లిస్టులో ఉన్న కంపెనీలకు కూడా టెండర్లు లభిస్తాయని చెప్పాడు. ప్రశ్నాపత్రాలను వివిధ పరీక్షా కేంద్రాలకు తరలించేటప్పుడు ఆ బాక్సులను తెరుస్తామని తెలిపాడు. 'పేపర్ లీకేజీకి అనేక పద్ధతులు అనుసరిస్తాం. ఉదాహరణకు ప్రభుత్వంలో కీలక వ్యక్తులతోనూ, ప్రశ్నాపత్రాలు ముద్రించే ప్రెస్‌లతోనూ సంబంధాలు పెట్టుకుంటాం' అని గుప్తా చెప్పుకొచ్చాడు. 'పేపర్ లీకేజీలో ఎలా విజయం సాధించావు అని అడిగితే 'మీరు దేశంలోనే అతి పెద్ద పేపర్ లీక్ మాఫియా బేడీ రామ్ గురించి విన్నారా? నేను అసిస్టెంట్‌గా ఉన్నప్పుడు జునాపూర్‌లో జరిగింది. ఓ అభ్యర్థికి ఉద్యోగం రావడంలో సాయపడ్డాం. ఈ సందర్భంగా జైలుకు కూడా వెళ్లాం' అని తెలిపాడు. బేడీ రామ్ ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని జునాపూర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. నీట్-యూజీ పేపర్ లీకేజీపై ప్రస్తుతం సీబీఐ విచారణ జరుపుతోంది. సంజీవ్ ముఖియా పరారీలోనే ఉన్నాడు. గతంలో సంజీవ్ పది సంవత్సరాల పాటు పేపర్ లీకేజీలలో భాగస్వామిగా ఉన్నాడని, చెవిలో బ్లూటూత్ సెట్‌ను పెట్టుకొని పరీక్ష రాస్తాడని గుప్తా చెప్పాడు. సంజీవ్ ముఖియాకు సుమారు రూ.30 కోట్ల అప్పు ఉందని, కానీ అతను ఇప్పుడు ఈ రాకెట్‌లో లేడని తెలిపాడు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- తమిళనాడు అసెంబ్లీలో తీర్మానానికి సిద్ధమవుతున్న స్టాలిన్ ప్రభుత్వం



న్యూఢిల్లీ : 2014 ఎన్నికల ముందు ప్రతిపక్షాలు, ఇండియా బ్లాక్ లేవనెత్తిన ప్రధాన అంశాలలో కులగణన ఒకటి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తరచూ జాతీయస్థాయిలో కులగణన గురించి డిమాండ్ చేస్తూనే వస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి పని కులగణనేనని కూడా చాలా సార్లు రాహుల్ చెప్పారు. అయితే తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం పీఎంకే నేత జీకే మణి వన్నియార్ కమ్యూనిటీకి విద్యా ఉద్యోగాల్లో అంతర్గత రిజర్వేషన్‌ల గురించి స్టాలిన్‌ను ప్రశ్నించారు. అందుకు ఆయన స్పందిస్తూ దేశవ్యాప్తంగా కులగణన సరిగా లేకుండా అంతర్గతంగా రిజర్వేషన్‌లు అమలు చేయడం సాధ్యం కాదన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కులగణన పూర్తి చేసేలా పీఎంకే నేతను వారి మిత్రపక్షమైన బీజేపీతో మాట్లాడాలని సూచించారు. అనంతరం స్టాలిన్ జాతీయస్థాయిలో కులగణన చేపట్టాలని కోరుతూ ఆ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయనున్నట్టు ప్రస్తావించారు.

నేడు లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక

ఎప్పుడూ ఆ పదవి ఏకగ్రీవమే..

- 50 ఏండ్లలో తొలిసారి పోటీ
- పార్లమెంట్ చరిత్రలో మూడోసారి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ స్పీకర్ పదవికి నేడు ఎన్నిక జరగనుంది. ఎన్డీఏ అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, దాని భాగస్వామ్య పార్టీలకు ప్రతిపక్ష ఇండియా ఫోరం ఊహించని షాక్ ఇచ్చింది. కేరళ నుంచి ఎనిమిది సార్లు ఎంపీగా గెలిచిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా ఫోరం స్పీకర్ అభ్యర్థిగా బరిలోకి దింపింది. మంగళవారం ఎన్డీఏ అభ్యర్థి ఓం బిర్లాతో పాటు, ప్రతిపక్ష ఇండియా ఫోరం అభ్యర్థిగా కె.సురేష్ మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. కాగా 50 ఏండ్ల తర్వాత మళ్లీ లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది.

ఎప్పటిలాగే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం చేసేందుకు ఎన్డీఏ ప్రయత్నించింది. మంగళవారం ఉదయం స్పీకర్ ఎన్నికకు సహరించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ప్రతిపక్ష ఇండియా ఫోరం నేతలను కోరారు. అయితే, స్పీకర్ ఎన్నికకు ప్రతిపక్ష ఇండియా ఫోరం ఓ మెలిక పెట్టింది. డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్షాలకు ఇస్తే, స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరిస్తామని రాహుల్ గాంధీ తెలిపారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు సిద్ధపడలేదు. అందువల్ల ఇండియా ఫోరం సభ్యులతో రాజ్‌నాథ్ సింగ్ జరిపిన చర్చల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ప్రతిపక్ష ఇండియా ఫోరం కూడా స్పీకర్ పదవికి పోటీకి దిగింది. అయితే 2019-24 మధ్య లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేకుండానే మోడీ సర్కార్ లోక్‌సభను నిర్వహించింది.

సభలో ప్రాతినిధ్యం లేని ప్రధాన పార్టీలు

18వ లోక్‌సభలో కొన్ని ప్రధాన పార్టీలు ప్రాతినిధ్యం పొందలేక పోయాయి. అందులో తెలంగాణలోని బీఆర్ఎస్, ఒరిస్సాలోని బీజేడీ, తమిళనాడులోని అన్నాడీఎంకే, ఉత్తరప్రదేశ్‌లోని బీఎస్పీ, హర్యానాలోని జేజేపీ, జమ్మూకాశ్మీర్‌లోని పీడీపీ వంటి పార్టీలకు లోక్‌సభ ప్రాతినిధ్యంలో లేదు.

ఇది మూడోసారి..

స్వతంత్ర భారతదేశంలో 1952లో తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పుడు లోక్‌సభ, రాజ్యసభ ఏర్పాటు అయ్యాయి. అదే ఏడాది తొలిసారి స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. అందులో శంకర్ శాంతారామ్ (55 ఓట్లు)పై మౌలాంకర్ (394 ఓట్లు) విజయం సాధించారు. 1976లో జగన్నాథ్ రావుపై బలిరామ్ భగత్ 344 ఓట్లతో గెలుపొందారు. ఆ తర్వాత ఎప్పుడూ లోక్‌సభ స్పీకర్ పదవి ఏకగ్రీవమే అయింది. మళ్లీ ఇప్పుడు స్పీకర్ పదవికి ఎన్నిక జరుగుతోంది. అంతకు ముందు స్వాతంత్ర్యానికి పూర్వం 1925 ఆగష్టు 24న అప్పటి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించారు. తర్వాత కాలంలో అదే పార్లమెంట్‌కు మారింది. ఆ ఎన్నికల్లో టి.రంగాచారియార్ (56)పై స్వరాజ్య పార్టీ అభ్యర్థి విఠల్‌భాయ్ జె.పటేల్ (58) స్పీకర్‌గా కేవలం రెండు ఓట్లతోనే గెలుపొందారు. 1925-46 మధ్య ఆరుసార్లు స్పీకర్ పదవికి ఎన్నికలు జరిగాయి. చివరిగా 1946లో స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. అప్పుడు కాంగ్రెస్ నేత జీవీ మౌలాంకర్ ఎన్నిక అయ్యారు. ఆ తర్వాత స్వాతంత్ర్యం రావడంతో తాత్కాలిక పార్లమెంట్‌కు కూడా ఆయనే స్పీకర్‌గా కొన్నేండ్లు ఉన్నారు.

కూటముల బలాబలాలు

లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో సభలోని అధికార, ప్రతిపక్షాల బలాబలాలపై చర్చ జరుగుతోంది. 543 మంది సభ్యుల్లో ప్రస్తుతం 542 మంది ఎంపీలు ఉన్నారు. రాహుల్ గాంధీ గెలుపొందిన రెండో స్థానం కేరళలోని వయనాడ్‌కు రాజీనామా చేశారు. దీంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. అయితే 542 మంది ఎంపీల్లో ఎన్డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీల బలం ఉండగా, ఇండియా బ్లాక్‌కు 233 మంది ఎంపీల బలం ఉంది. ఏ కూటమికీ చెందని సభ్యులు 16 మంది ఉన్నారు. అందులో మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఇండిపెండెంట్ ఎంపీ విశాల్ పాటిల్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన మద్దతు కూడా ఇండియా ఫోరంకే ఉంటుంది. బీహార్ నుంచి ఎన్నికైన పప్పు యాదవ్ కూడా ఇండియా ఫోరం అభ్యర్థికి ఓటు వేసే అవకాశం ఉంది. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) చంద్రశేఖర్ ఆజాద్ కూడా ఇండియా ఫోరం అభ్యర్థికే మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు విప్ జారీ చేశాయి. బుధవారం ఉదయం 11 గంటలకే సభ్యులంతా సభకు హాజరుకావాలని సూచించాయి.

సంపాదకీయం

నిరసన సెగలు



పరమపద సోపాన పటంలో అందలమెక్కడానికి కుమ్మరించిన హామీలు ఏరు దాటిన తర్వాత బోడి మల్లయ్య అంటూ తప్పించుకోచూస్తే కార్మికులు పార్టీలను వదుల్తారా? నేడు రాష్ట్రంలో రాజుకుంటున్న దావానాలమదే! స్టెతస్కోప్ పట్టాల్సిన చేతులు ప్లకార్డులు పట్టాయి. రెవెన్యూలో సేవలందించాల్సిన వారు నడి వీధుల్లోకి వచ్చారు. గర్భిణీలకు చేయూతనివ్వాల్సిన చేతుల పిడికిళ్లు బిగిస్తున్నాయి. కొంత కాలంగా రాష్ట్రంలోని వివిధ ఉద్యోగులు ఆందోళన బాట పట్టడం చూస్తూనే ఉన్నాం. జూనియర్ డాక్టర్లు పలు డిమాండ్లతో నిరవధిక సమ్మెకు దిగారు. వీరే కాక రాష్ట్రంలోని ఆశావర్కర్లు, వీఆర్వోలు సైతం తమ సమస్యలు పరిష్కరించమంటూ నెలలుగా సర్కారుకు వినతులు ఇస్తూనే ఉన్నారు.

వాస్తవానికి వీరి సమస్యలు ఈనాటివి కావు. బీఆర్ఎస్ హయాం నుండి పలు సమస్యలతో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. కేసీఆర్ నిరంకుశ పాలనతో విసుగెత్తి కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత వరకు సమస్యలు వింటున్నారు. వినడం కేవలం ఉపశమనం మాత్రమే. దీంతో కడుపు నిండదు కదా! అందుకే కాంగ్రెస్ సర్కారు కొలువు తీరిన తర్వాత తమ సమస్యలు పరిష్కరించమంటూ ఆశావర్కర్లు, వీఆర్వోలు, జూనియర్ డాక్టర్లు దఫదఫాలుగా అధికారులు, మంత్రులు, సచివాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పరిష్కరిస్తాం అంటున్నారే తప్ప అచరణలో ఒక్క అడుగు ముందుకు వేయడం లేదు.

కడుపు నిండనపుడు కండ్లెర్రజేయడం సహజం. అందుకే వరుసగా అందరూ ఆందోళన బాట పడుతున్నారు. సొంత గూడు విషయంలోనూ ఇదే కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సర్కారు స్పందించకపోతే ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకోవడం ఖాయం. ఈ ఉద్యమాల ప్రభావం సాధారణ ప్రజలపై పడక తప్పదు. కనుక కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తమవ్వాల్సిన సమయం ఆసన్నమయింది. రేవంత్ సర్కారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తక్షణమే స్పందించాలి. ఆయా ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

నిర్దేశిత సమయంలో ఉపకారవేతనాల విడుదల, పెండింగ్ స్టైపెండ్, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న స్టైపెండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15శాతం రిజర్వేషన్ వంటివి వీరి కీలకమైన డిమాండ్లు. ఏండ్ల నుండి పేరుకుపోయిన ఈ సమస్యలతో జూనియర్ డాక్టర్లలో అసంతృప్తి పెరిగిపోయింది. గత్యంతరం లేక సమ్మెకు దిగారు. ఈ డిమాండ్లపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ 'జూడా'ల నేతలతో చర్చలు సైతం జరిపారు. అవి ఫలించక పోవడంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. వీరి సమ్మె కేవలం వారి సొంత సమస్యలకే పరిమితం కాదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుదలకు అవసరమైన డిమాండ్లు సైతం ఇందులో ఉన్నాయి. పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక పరీక్షలు చేసే సదుపాయం లేదు. చివరకు సర్జికల్ బ్రాంచ్‌లలో కూడా పరికరాల కొరతతో రోగులకు సరైన వైద్యం అందించలేక పోతున్నారు. ఇక ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మిస్తామని చెబుతున్నారు. కానీ ఇప్పటివరకు దానికి సబంధించిన వివరాలేమీ వెల్లడించక పోవడంతో 'జూడా'లలో దీనిపై నమ్మకం పోయింది. ఇక డీఎంఈకి రూ.400 కోట్లకు పైగా విడుదల చేస్తున్నా అవి తమ అవసరాలకు, సరైన సమయానికి ఉపయోగపడడం లేదంటూ 'జూడా'లు ఆవేదన చెందుతున్నారు.

మరోపక్క ఆశావర్కర్లు ఎప్పటి నుండో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. తమ వేతనం రూ.18వేలకు పెంచుతామంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీని సర్కారుకు గుర్తు చేస్తున్నారు. శిక్షణ పొంది ఏండ్ల నుండి సేవలందిస్తున్న తమకు కొత్తగా పరీక్షలు నిర్వహించాలంటూ ఇటీవల కేంద్రం పంపిన సర్క్యులర్‌ను కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తామనడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. అలాగే వీఆర్వోల వారసులకు ఉద్యోగాలు, ఆయా శాఖల్లో పని చేస్తున్న వారికి ఆప్షన్ ఇచ్చి రెవెన్యూ శాఖలోనే కొనసాగింపు, సొంత జిల్లాలకు బదిలీ వంటి పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యమాలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ప్రతి సభలో వీఆర్వోల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం పదివేలకు పెంచుతామని ఇప్పటి వరకు స్పందించలేదు. వారూ మూడు రోజుల కిందట రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు దిగారు. అంగన్‌వాడీలు బయోమెట్రిక్‌లో వెనక్కు తగ్గాలంటూ వినతులు ఇస్తున్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులు తమకిచ్చిన పర్మినెంట్ హామీని నిలబెట్టుకొమ్మంటున్నారు. ఐకేపీ, వీఓఏలు సైతం తమ సమస్యలపై ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ చెప్పి ఓపిక పట్టమన్నారు. ఇక ఇప్పుడు ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేందుకు ఎలాంటి కోడ్‌లు అడ్డులేవు.

కడుపు నిండనపుడు కండ్లెర్రజేయడం సహజం. అందుకే వరుసగా అందరూ ఆందోళన బాట పడుతున్నారు. సొంత గూడు విషయంలోనూ ఇదే కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సర్కారు స్పందించకపోతే ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకోవడం ఖాయం. ఈ ఉద్యమాల ప్రభావం సాధారణ ప్రజలపై పడక తప్పదు. కనుక కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తమవ్వాల్సిన సమయం ఆసన్నమయింది. రేవంత్ సర్కారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తక్షణమే స్పందించాలి. ఆయా ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

గాలిలో తేలిపోతున్నంత ఆనందంతో వచ్చిపడ్డాడు నా చిన్ననాటి స్నేహితుడు సుబ్బారావు. వాడి కండ్లలో ఆనందం తొణికిసలాడుతున్నది. రావటం రావటంతోనే 'యురేకా' అని అరచి కుర్చీలో కూలబడ్డాడు.

"ఏంటి సుబ్బారావు ఏమి కనిపెట్టావ్, అంత ఆనందంగా వున్నావు" అని అడిగా.

వీడు పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటినుంచి చాలా డీలా పడిపోయాడు. మోడీ మళ్లీ అధికారంలోకి వస్తాడని తెగ ఆశ పడ్డాడు. పాపం, ఓటర్లు, దేవుళ్ళు కలిసి వీడి ఆశలమీద నీళ్లు చల్లారు. ఏదో ఇంకో రెండు పార్టీలతో కలిసి అధికారపీఠం దక్కించుకున్నా, దెబ్బతీసిన ఫలితాల వల్ల వచ్చిన నీరసం, నిరాశ తగ్గలేదు. మోడీకి 400 సీట్లు వస్తాయని వెర్రిగా నమ్మాడు. ప్రేమలాగే భక్తి కూడా గుడ్డిదే మరి. మనవాడేమో మోడీకి, బీజేపీకి వీర భక్తుడు. ఇన్ని రోజుల తరువాత వీడు ఆనందపడటానికి కారణమేమిటో నాకు అంతు చిక్కలేదు.

"యురేకా అంటూ గావుకేక పెట్టావ్. నీ ఆనందానికి కారణమేమిటో సెలవివ్వు మైడియర్ ఆర్కిమెడీస్" అని అడిగా.

"బీజేపీ ఓడిపోవడానికి అసలు సిసలు కారణం ఆర్ఎస్ఎస్ సార్ కనిపెట్టేశాడు. అహంకారం వల్ల మోడీ ఓడిపోయాడట. రాజకీయాల్లో అహంకారం వీడి, సేవకుల్లా ఉంటే ఫలితం మరో విధంగా ఉండేదట. రోగానికి కారణం తెలిసిందిగా, ఇంకా డోఖా లేదు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో మోడీనే బంపర్ మెజారిటీతో గెలుస్తాడు" సుబ్బారావు ఈ మాటలంటూ ఊహల్లో ఎక్కడికో వెళ్లాడు.

"ఇదిగో సుబ్బారావు.. నీ పేరు పిచ్చి పుల్లయ్యగా మార్చుకో"

"అదేంటి,అంత మాట అన్నావ్."

"లేకపోతే ఏంటి సుబ్బారావు , ప్రజలు నాయకుడి అహంకారాన్ని లీటర్లు మీటర్లు కొలిచి, లెక్కతీసి ఓట్లు వేస్తారా?"

"మరి అర్ఎస్ఎస్ ఎందుకన్నట్టో?"

"నిన్ను పిచ్చి పుల్లయ్య చేయడానికి అన్నాడ్లే"

"అయినా, నీకంతా వేళాకోళంగా ఉంటుంది, మేమంటే మరీను."

ఆరెస్సెస్ సుద్దులు

"ఇదిగో సుబ్బారావు, మోడీ ఎన్ని బహిరంగ సభల్లో మాట్లాడాడు, రోడ్ షోలు చేశాడు, ఎంత వంగి వంగి నమస్కారాలు చేశాడు. ఎంత వినయం ప్రదర్శించాడు, లెక్కుందా? ప్రజలు ఎంత అభిమానంతో పూలజల్లు కురిపించారు, ఎన్ని గజమాలలు వేశారు? చూసావు కదా! అయినా చివరికి అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్‌లో కూడా ఓడిపోయింది. రామమందిర్ తనే కదా అట్టహాసంగా ప్రారంభించింది. అయినా భంగం తప్పలేదు, ఎందుకని?"

"ఎందుకని.. ఎందుకని?" తిరిగి అదే ప్రశ్న ఎదురు వేశాడు సుబ్బారావు.

"ఆలోచించు. ఇండియాకూటమి మీద, ముస్లింల మీద ఎంత ద్వేషం వెళ్లగక్కాడు. ఇదంతా ఎందుకు? ఓటర్లను ఆకట్టుకోవడానికే కదా, అయినా ఓడాడు. ఎందుకని? ఆలోచించు."

"ప్రతిసారి ఓడాడు ఓడాడు అనవాక నాయనా? నా మనస్సు చివ్వుమంటుంది. అయినా ఇప్పటికీ కూడా ప్రధాని మోడీనే కదా." ఓటమిని ఒప్పుకోలేని భక్తాగ్రేసరుడు మరి మా సుబ్బారావు.

"303 నుంచి 250కి పడిపోయినా గెలిచాడు అనాలా? భక్తులకు దేవుడు అవసరం ఉందో, లేదో గాని, ఇప్పుడు మాత్రం సాక్షాత్తు భగవంతుడికి భగవంతుడి అవసరం వచ్చిపడింది. టీడీపీ, జెడియూ లేకపోతే మీ భగవంతుడు ప్రధాని అవతారం చాలించాల్సి వచ్చేదే."

" బాబ్బాబు, మోడీని మరీ అంతగా తీసివేయకు, నేను తట్టుకోలేను."

"సుబ్బారావు, ఒక విషయం చెప్పు. ఆర్ఎస్ఎస్ సార్, ఎన్ని సుద్దులు చెప్పాడు. అందులో ఒక్కసారైనా బీజేపీ నిరుద్యోగం పెరగడంగానీ, ధరలు అందుబాటులో లేనంత ఎత్తుకు పెరుగుతున్నాయని గానీ , రైతులకు పంట మద్దతు ధర లేకపోవడం గురించి గానీ, ఫ్యాక్టరీ కార్మికుల జీతాల విషయంగానీ, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల గురించి గానీ పల్లెత్తు మాట అన్నాడా? ఇవికాదూ"

"ఆహా...ఎందుకనలేదు? మణిపూర్‌లో శాంతి కలిగించటం ప్రాధాన్యత చూడాలని అన్నాడు కదా?"

"అందుకనే నిన్ను పేరు మార్చుకోమనేది. ఎన్నికల ప్రచారం కోసం అయినా అక్కడికి వెళ్ళలేదు. ఎందుకని?

ఈయన చెబితే దానికి ప్రాధాన్యత ఇస్తాడా?"

"అయితే ఆర్ఎస్ఎస్ చెప్పినట్టు ఓటమికి అహంకారం కారణం కాదా మిత్రమా?"

ఈ ప్రశ్న విన్న నాకు సుబ్బారావు మొహంలో అమాయ కత్వం కనపడ్డది.

"కచ్చితంగా కాదు సుబ్బారావు, నీలాంటి వాళ్లందరినీ మాయలో పడేయటానికి, మోడీ కాకపోతేనో లేక అహంకా రం లేని ప్రధాని మోడీ అయితేనో 400 సీట్లు వచ్చేవని మీలాంటి భక్తులకు భ్రమలు కల్పించడానికి ఆర్ఎస్ఎస్ సార్ చేసిన మాటల గారడి ఇది. నాయకుల అహంకారాలు, వినయాల మీద ఆధారపడి ప్రజలు ఓట్లు వేయరు. తమ సమస్యల పరిష్కారం కోసం ఓటు వేస్తారు. ఇది దాచిపెట్టడానికే ఆర్ఎస్ఎస్ చేస్తున్న విన్యాస ప్రసంగం ఇది.దీన్ని పట్టుకొని టీవీల వాళ్ళు, పేపర్ వాళు , సోషల్ మీడియా వాళ్లు చూశారా..చూశారా... ఆర్ఎస్ఎస్ మోడీకి మొట్టికాయలు వేసిందని పెద్దగా ప్రచారం చేస్తున్నారు."

"ఇదిగో...ఇదిగో..నన్ను కన్ఫ్యూజ్ చేస్తున్నావ్ మిత్రమా" అన్నాడు నా దోస్తు సుబ్బారావు.

"కన్ఫ్యూ చేయటం లేదు సుబ్బారావు, దాన్ని పోగొడుతున్నాను. ఆర్ఎస్ఎస్ నాయకులను మనం ఒకటి అడుగుదాం. మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్, దానికున్న పిల్ల సంస్థ బీజేపీ. ఎప్పుడూ ఎన్నికల్లో పాల్గొనని ఆర్ఎస్ఎస్, జనసంఘ్ అని, జనతా పార్టీ అని, బీజేపీ అని- వీటిని అడ్డం పెట్టుకొని రాజకీయ అధికారం చెలాయించడం ఎందుకోసం అని అడుగుదాం. ఇటువంటి ప్రశ్నకు ఆర్ఎస్ఎస్ నాయ కులు ఎప్పుడైనా సరైన సమాధానం చెప్పారా? ఆలోచించు మైడియర్ సుబ్బారావు."

"నీ దగ్గరికి వచ్చినందుకు నా ఉత్సాహం అంతా తుస్సు మంది."

"నీరసపడవాక.ఆలోచించు సుబ్బారావు ఆలోచించు. అది మాత్రమే నిన్ను నన్ను దేశాన్ని రక్షించగలదు".

-కర్లపాలెం

అమెరికా రాజకీయ క్రీడలో పావుగా దలైలామా!



ఎం కోటేశ్వరరావు
8331013288

ధర్మశాలలో ప్రవాస జీవితం గడుపుతున్న 88 ఏండ్ల దలైలామా మోకాలి చికిత్సకోసం అమెరికా వెళ్లారు. ఆ సందర్భంగా అక్కడ రాజకీయ నేతలతో చర్చలు జరుపుతారా లేదా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గతవారంలో అమెరికా పార్లమెంటు ప్రజాప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసి హిమచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో దలైలామాను కలిశారు. ఈ సందర్భంగానే ప్రధాని నరేంద్రమోడీ, విదేశాంగ మంత్రి జై శంకర్‌ను కూడా ఆమె నాయకత్వంలో వచ్చిన ఏడుగురు ఎంపీల బృందం భేటీ అయింది. ఇతర పని మీద భారత్ పర్యటనలో భాగంగా ఏదో ఇంతదూరం వచ్చాం కదా మర్యాద పూర్వకంగా అనుకుంటే దలైలామాను కలవటం పెద్ద వార్తే కాదు.రావటమే కాదు,నేను చైనాను విమర్శిస్తే అది దలైలామాకు అంగీకారం కాదని తెలిసినా అంటూ అక్కడే చైనా అధినేత షీ జిన్‌పింగ్ మీద ధ్వజమెత్తింది. అందుకే ఇది పక్కా రాజకీయ, చైనా వ్యతిరేక పర్యటనే అనటంలో ఎలాంటి సందేహంలేదు. దలైలామా వారసత్వం ఎప్పటికీ ఉండిపోతుంది, కానీ చైనా అధ్యక్షపదవిలో ఉన్న మీరు శాశ్వతంగా ఉండరు,ఎవరూ, దేనికీ మిమ్మల్ని గుర్తుంచుకోరు అంటూ నాన్సీ పెలోసి నోరుపారవేసుకుంది. దలైలామాతో చైనా ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని కూడా చెప్పింది.

ఈ పరిణామం మీద మన విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ భారత వైఖరిలో ఎలాంటి మార్పులేదు, స్థిరంగా ఉందని చెప్పారు.మనదేశంలో మతపరమైన,ఆధ్యాత్మిక కార్యకలాపాలు నిర్వహించేందుకు మాత్రమే దలైలామాకు ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. నాన్సీ పెలోసీ చేసిన రాజకీయ వ్యాఖ్యలకు-మన ప్రభుత్వానికి సంబంధం లేదని, వాటి గురించి మీరు అమెరికానే ప్రశ్నించాలని విలేకర్లతో చెప్పారు. ధర్మశాలలో ఉందని చెబుతున్న టిబెట్ ప్రవాస ప్రభుత్వం ఒక వేర్పాటువాద రాజకీయ సంస్థ, చైనా రాజ్యాంగం, చట్టాల ప్రకారం అది చట్టవిరుద్ధం, ఆ సంస్థకు ప్రపంచంలో ఎలాంటి గుర్తింపు లేదు, ఇక దలైలామాతో సంప్రదింపులు, మాటల విషయానికి వస్తే అది చైనా ప్రభుత్వం-పద్నాలుగవ దలైలామాకు సంబంధించిన వ్యవహారం అన్నది ఎప్పటి నుంచో మేము చెబుతున్నాం అని చైనా స్పందించింది. ఈ సందర్భంగా కొన్ని అభిప్రాయాలు, వక్రీకరణలు, భాష్యాలు వెలువడ్డాయి.టిబెటన్ల హక్కుల పేరుతో గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా ఆడుతున్న నాటకం తెలిసిందే. అమెరికా, దానికి తాన తందాన పలికే దేశాలు చెబుతున్నదాని ప్రకారం టిబెట్ ఒక స్వతంత్ర దేశం, కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చాక దాన్ని చైనా ఆక్రమించింది. కనుక టిబెటన్ల హక్కును పరిరక్షించాలి అంటూ వేర్పాటువాదాన్ని సమర్థిస్తున్నది.మనదేశంలో బ్రిటీష్ ప్రభుత్వానికి లోబడిన సామంత రాజరిక సంస్థానాల మాదిరే చైనాలో రాజరిక కాలంలో టిబెట్ కూడా అలాంటిదే.చైనాకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చైనా ప్రభుత్వానికి లోబడిన ఒక స్వయం పాలిత ప్రాంతంగా ఉంది, దాని అధిపతిగా దలైలామా కొనసాగాడు.

చైనా కమ్యూనిస్టు పార్టీ లాంగ్ మార్చ్ లేదా విప్లవపోరాట కాలంలో అధికారంలో ఉన్న చాంగ్‌కై షేక్ ప్రభుత్వం కూలిపోవటం తథ్యమని గ్రహించిన అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదులు ఒక వ్యూహం ప్రకారం నాడు ఫార్మోజా దీవిగా నేడు తైవాన్‌గా పిలుస్తున్న ప్రాంతానికి మిలిటరీ, ఆయుధాలను తరలించి అక్కడే తిష్టవేయించింది. చైనా రాజులు ఆ దీవిని 1895లో జపాన్‌కు ధారాదత్తం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన తరువాత 1945లో దాన్ని తిరిగి చైనా ప్రభుత్వానికి అప్పగించారు. మిగతా ప్రధాన ప్రాంతంలో కమ్యూనిస్టులు కేంద్రీకరించి తరువాత తైవాన్ సంగతి చూద్దాం లెమ్మని భావించారు.తరువాత అనేక కారణాలతో స్వాధీనం చేసుకోలేదు. ఈ లోగా అమెరికా, ఇతర దేశాలు తైవాన్ పాలకులకు భారీ ఎత్తున ఆయుధాలు ఇచ్చి ఒక దేశం మాదిరి తయారు చేశారు. దాన్నే అసలైనా చైనాగా భద్రతా మండలిలో గుర్తించారు. 1970 దశకంలో అనివార్య స్థితిలో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన తీర్మానం ప్రకారం చైనా అంటే తైవాన్‌తో కూడిన ప్రాంతం తప్ప రెండు చైనాలు లేవు. దీనికి అమెరికా కూడా అంగీకరించింది. అయితే శాంతియుతంగా విలీనం జరగాలంటూ కొత్త నాటకం ప్రారంభించింది. బలవంతంగా ఆక్రమించేందుకు చైనా పూనుకుంటే తాము సహించేది లేదని అమెరికా అంటున్నది. తైవాన్ వ్యవహారాలను చూసేందుకు ఏ ఒక్క దేశానికీ భద్రతా మండలి అనుమతి ఇవ్వలేదు. తనకు తానే రక్షకురాలిగా అమెరికా ప్రకటించు కుంది. ఆధునిక ఆయుధాలన్నీ ఇచ్చి ఎదురు దాడులకు కూడా అనుగుణంగా తయారు చేస్తున్నది.

ఇక టిబెట్ విషయానికి వస్తే కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం కూడా ముందుజాగ్రత్తతో వ్యవహించి సామ్రాజ్యవాదుల కుట్రలను వమ్ముచేసింది. మతం, దలైలామా పేరుతో జరిపిన తిరుగుబాటును అణచివేసింది. టిబెట్‌లో తిరుగుబాటు చేసేందుకు పూనుకున్న వేర్పాటు వాదులకు సిఐఏ అనేక చోట్ల రహస్యంగా సాయుధ శిక్షణ, పెద్ద మొత్తంలో నిధులు అందచేసింది. చైనా కమ్యూనిస్టు పార్టీ 1949లో అధికారానికి వచ్చిన తరువాత "ఇంకేముంది మనం చైనాను నష్టపోయాం, మన అదుపునుంచి పోయింది, మనకు కొత్త విరోధి ఉనికిలోకి వచ్చింది" అన్నట్లుగా అమెరికా పాలకవర్గం భావించింది. విప్లవ కాలంలోనే చైనాలో కమ్యూనిస్టు పార్టీని అడ్డుకోవటంలో విఫలం కావటం గురించి అది బెంగపెట్టుకుంది. ఇరాన్‌లో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు1953లో మహమ్మద్ మొసాద్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు చేసిన ఖర్చుతో పోలిస్తే సిఐఏ 1949-51కాలంలో ఇరవై రెట్లు మొత్తాన్ని చైనా కోసం వెచ్చించింది.రహస్య కార్యకలాపాలకు పది రెట్లు సిబ్బందిని పెట్టింది.కార్యస్థానంగా టిబెట్‌ను ఎంచుకుంది. చరిత్రను చూస్తే టిబెట్ ప్రాంతంలో చైనా రాజులకు సామంత రాజ్యంగా ఉంది తప్ప స్వతంత్రదేశం కాదు.1912లో క్వింగ్ రాజరిక వ్యవస్థకూలిపోయిన మరుసటి ఏడాది పదమూడవ దలైలామా తమకు స్వాతంత్ర్యం కావాలని ప్రకటించాడు.చైనా ఆశీస్సులతో నిమిత్తం లేకుండా ఆధ్యాత్మిక, రాజకీయ అధికారాన్ని చెలాయిస్తానని చెప్పుకున్నాడు.దాన్ని చైనా ప్రభుత్వం ఆమోదించలేదు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత టిబెట్‌ను పూర్తిగా చైనాలో విలీనం చేసేందుకు చూస్తున్నట్లు 1941డిసెంబరు 20వ తేదీ డైరీలో నాటి ప్రధానిగా ఉన్న చాంగ్‌కై షేక్ రాశాడు.

కమ్యూనిస్టులు అధికారానికి వచ్చిన తరువాత ముందే చెప్పుకున్నట్లు సిఐఏ రంగంలోకి దిగింది. దీన్ని పసిగట్టిన మావో జెడాంగ్ ముందు జాగ్రత్త చర్యగా 1950లో అక్కడికి 40వేల మంది మిలిటరీని పంపాడు.దీంతో పాటు చైనాతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకున్నాడు. అదే ఏడాది అక్టోబరు 6-24వ తేదీల మధ్య తూర్పు టిబెట్‌లో తిరుగుబాటుకు తెరతీసిన వేర్పాటువాదులను చామడో పోరులో మిలిటరీ అణచివేసింది, మూడు వేల మందిని బందీలుగా పట్టుకుంది. టిబెట్ పౌరుల మీద ఎలాంటి దాడులు జరపలేదు. ప్రస్తుతం మనదేశంలో ఉన్న 14వ దలైలామా టెంజిన్ జియాస్టో ఆ పరిణామం తరువాత తాను క్రమశిక్షణతో మెలుగుతానని ప్రకటించాడు. కాశ్మీరు, హైదరాబాదు సంస్థానాలను మనదేశంలో విలీనం చేసినట్లుగానే టిబెట్ సంస్థానాన్ని చైనా 1951 మే నెలలో విలీనం చేసింది. టిబెట్ రాజకీయం చైనాలో కమ్యూనిస్టులు అధికారానికి రావటానికంటే ముందే మొదలైంది.మన దేశం తొలిసారిగా ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం టిబెట్‌తోనే మొదలైంది.చైనా మిలిటరీ చర్య గర్హనీయమని, అది చైనా ప్రయోజనాలకు, శాంతికి కూడా దోహదం చేయదని నాటి నెహ్రూ ప్రభుత్వం ప్రకటించింది. దీనికి వెంటనే అమెరికా, బ్రిటన్ తదితర ఆ గుంపు దేశాలు కూడా మద్దతు ఇచ్చాయి.



లాసా నుంచి పారిపోయిన దలైలామా నాటి భారత ప్రభుత్వ సహకారంతో నేటి అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతం ద్వారా మనదేశానికి 1959 మార్చి 31న వచ్చాడు. ధర్మశాలలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలతో కాందిశీకుల పేరుతో ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. తరువాత తాను వైదొలిగి ఇతరులకు అప్పగించాడు. ఈ ప్రభుత్వాన్ని మనదేశం గుర్తించనప్పటికీ నాటి నుంచి నేటి వరకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నది. అమెరికా విదేశాంగశాఖ 1998లో వెల్లడించిన పత్రాలలో ఉన్న సమాచారం మేరకు దలైలామా 1970దశకం మధ్య వరకు ఏటా లక్షా 80వేల డాలర్లను అమెరికా సిఐఏ నుంచి పొందినట్లు ఉంది. ఇప్పటికీ అమెరికా మద్దతు కొనసాగుతోంది. నాన్సీ పెలోసీ గుంపు పర్యటన అదే.

దలైలామాకు 1940 దశకంలోనే సిఐఏతో సంబంధాలు, నిధుల అందచేత ఉన్నట్లు తరువాత వెల్లడైంది. అమెరికాలోని కొలరాడోలో టిబెట్ తిరుగుబాటుదార్లకు శిక్షణ ఇచ్చింది. వారిని అక్కడికి విమానాల్లో తరలించి తరువాత తిరిగి టిబెట్‌కు చేర్చింది. ఆయుధాలను ఇచ్చింది. అలాంటి వారి నాయకత్వంలో 1956లో తూర్పు టిబెట్‌లో రెండు చోట్ల తిరుగుబాటును ప్రకటించారు. దలైలామా అన్న గయాలో తొండప్ 1951లో అమెరికా వెళ్లాడు. అక్కడే ఉండి ఎప్పటికప్పుడు చైనా, టిబెట్‌లో పరిస్థితుల గురించి అక్కడ ఎందరు సైనికులు ఉన్నదీ మొదలైన సమాచారాన్ని అందచేసేవాడు. దానికి ప్రతిగా చైనాకు వ్యతిరేకంగా తమకు సాయం చేయాలని కోరాడు. అందుకోసం భారత్, నేపాల్‌లో అమెరికా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జపాన్‌లోని ఒకినావా, మైక్రోనేసియా ప్రాంతంలోని పసిఫిక్ దీవుల్లో అమెరికా ఆధీనంలో ఉన్న గువామ్‌లో టిబెటన్లకు శిక్షణ ఇచ్చారు. ఢిల్లీలో సిఐఏ-మనదేశ సంస్థ కలసి ఒక కేంద్రాన్ని కూడా నడిపినట్లు తరువాత వెల్లడైంది. ఆపరేషన్ ఎస్‌టి సర్కస్ పేరుతో ఒక పథకాన్ని రూపొందించి 1959లో దలైలామా సోదరుడి నాయకత్వంలో గెరిల్లా తిరుగుబాటు ప్రారంభించారు. అయితే దాన్ని చైనా మిలిటరీ రెండు వారాల్లోనే అణచివేసింది. లాసా నుంచి పారిపోయిన దలైలామా నాటి భారత ప్రభుత్వ సహకారంతో నేటి అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతం ద్వారా మనదేశానికి 1959 మార్చి 31న వచ్చాడు. ధర్మశాలలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలతో కాందిశీకుల పేరుతో ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. తరువాత తాను వైదొలిగి ఇతరులకు అప్పగించాడు. ఈ ప్రభుత్వాన్ని మనదేశం గుర్తించనప్పటికీ నాటి నుంచి నేటి వరకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నది. అమెరికా విదేశాంగశాఖ 1998లో వెల్లడించిన పత్రాలలో ఉన్న సమాచారం మేరకు దలైలామా 1970దశకం మధ్య వరకు ఏటా లక్షా 80వేల డాలర్లను అమెరికా సిఐఏ నుంచి పొందినట్లు ఉంది. ఇప్పటికీ అమెరికా మద్దతు కొనసాగుతోంది. నాన్సీ పెలోసీ గుంపు పర్యటన అదే.

దలైలామాతో చర్చలు జరపాలని చైనాను డిమాండ్ చేసే హక్కు అమెరికాకు లేదు. తాను చేసిన చట్టాలు, లేదా అవగాహన ప్రకారం బిన్‌లాడెన్ లాంటి కొంత మందిని ఉగ్రవాదులుగా ప్రకటించింది. అలాంటి వారితో ఎవరైనా చర్చలు జరపాలని కోరితే అంగీకరిస్తుందా? చైనా దృష్టిలో తిరుగుబాటు చేసిన దలైలామా వేర్పాటువాది. అలాంటి వారితో చర్చలు జరిపేది లేదని గతంలోనే ప్రకటించింది.దలైలామా ఒక్క మతనాయకుడే కాదు, ప్రవాసంలో ఉన్న రాజకీయవాది కూడా అని తాజాగా స్పష్టం చేసింది. అతగాడి వైఖరిలో మార్పు లేదు. ఇప్పుడు దలైలామాకు వృద్ధాప్యం వచ్చింది. తదుపరి వారసుడు ఎవరన్నది తేలాల్సి ఉంది. తన వారసుడు భారత్‌లో ఉన్నట్లు దలైలామా చెబుతున్నారు. కొత్త దలైలామాను తాము ఆమోదించాల్సిందేనని చైనా అంటున్నది.జూన్ పన్నెండున అమెరికా పార్లమెంటు టిబెట్-చైనా వివాద బిల్లును ఆమోదించింది. అధ్యక్షుడు ఆమోదిస్తే చట్టం అవుతుంది. అది ఉభయ దేశాల సంబంధాల మీద ప్రభావం చూపుతుంది గనుక అలాంటి పనికి పూనుకోవద్దని చైనా హితవు పలికింది. పురాతన కాలం నుంచి చైనాలో టిబెట్ భాగం కాదని దానిలో పేర్కొన్నారు. అసలు అలాంటి చట్టం చేసే అధికారం అమెరికా పార్లమెంటుకు ఎవరిచ్చారు. దలైలామా గురించి ప్రపంచంలో ఆసక్తి తగ్గిపోతున్న తరుణంలో అమెరికా ఈ పనిచేసింది. ■

విద్యావ్యవస్థ పతనంలో సంఘ్ పాత్ర



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

వాజ్‌పేయి ప్రభుత్వంలో సంఘ్ ప్రముఖుడు మురళీ మనోహర్ జోషి విద్యాశాఖ మంత్రి. అశాస్త్రీయ అంశాలను బోధనాంశాలుగా విద్యాలయాల్లో అమలు చేశారు. విద్యార్థులపై ఛాందసాలను రుద్దారు. మానవులుగా మారవలసిన మనుషులను పశు పక్ష్యాదుల స్థాయికి దిగజార్చారు. రోమ్ విశ్వవిద్యాలయ మతాంశాల మాజీ ఆచార్యుడు జియోవని జెంటైల్ ఇటలీ ఫాసిస్టు నియంత ముసోలినీ విద్యాశాఖ మంత్రి. జెంటైల్ సంస్కరణలతో ఈయన అమలు చేసిన విద్యా విధానంలో విద్యాలయాల్లో అగ్ర వర్ణాల వారే బోధించాలి. యూదులు, స్త్రీలు, వికలాంగులు విద్యకు అనర్హులు. ఉన్నత వర్గాలకు ప్రభు విద్యను, మధ్యములకు మత విద్యను, యూదులకు బానిస విద్యను బోధించాలి. మోడీ 'జాతీయ విద్యా విధానం-2020'లో ఇటువంటి అంశాలతో పాటుగా విద్యను ధార్మిక సంస్థలకు అప్పగిస్తారు. సరస్వతీ మందిరాలు, దీనానాథ్ బాత్రా భారతీయ విద్యామండలి, ప్రజ్ఞా భారతి మొదలగు సంఘ్ అనుబంధ సంస్థలే వీరి ధార్మిక సంస్థలు. విద్య, పరిశోధన, శిక్షణల భారతీయ మండలి (ఎన్.సి.ఇ.ఆర్.టి.) ఇటీవల బడుల పాఠ్యాంశాలను సంఘీకరించింది.

అన్ని వృత్తుల్లో కాషాయ సైన్య తయారీకిగాను విద్య పోటీ పరీక్షల నిర్వాహక కాషాయాధిపతులు పోటీ పరీక్షల్లో అవినీతికి పాల్పడ్డారు. విమర్శలు వచ్చినా తమ అనుకూల అక్రమాల పోటీ పరీక్షలను సమర్థించుకుంటారు. ఆశించిన లాభం దక్కదనుకున్న పరీక్షలను కుంటి సాకులతో రద్దు చేస్తారు. నేటి నీట్, నెట్‌ల కుంభకోణాలకు మధ్యప్రదేశ్ 2013 'వ్యాపమ్' ప్రవేశ పరీక్ష కుంభకోణం మూలం. ఇది వైద్య, ఇంజినీరింగ్ వృత్తి విద్యలకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రవేశ పరీక్ష. నేటి కేంద్ర మంత్రి నాటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆయన భార్య, సోదరులు 'వ్యాపమ్' కుంభకోణంలో కూరుకుపోయారు. తమ తాత్వికులను డాక్టర్లు, ఇంజినీర్లు, శాసనాధికారులు, ఉపాధ్యాయులుగా నియమించారు. వీరి అసమర్థత వల్ల రోగులు చనిపోయారు. భవనాలు, వంతెనలు కూలాయి. లక్షల అష్టావక్రులు తయారయ్యారు.

మోడీ ప్రభుత్వం 2017లో జాతీయ పరీక్షల సంస్థ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్.టి.ఎ.)ను స్థాపించింది.

ఒక దేశం-ఒక పరీక్ష మోడీ లక్ష్యం. ఎన్.టి.ఎ, వైద్య విద్యలో ప్రవేశానికి నీట్ (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)ను, విశ్వ విద్యాలయ ఉపాధ్యాయ నియామ కాలకు విశ్వవిద్యాలయాల నిధుల సంస్థ(యుజిసి)-జాతీయ అర్హత పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్-నెట్)ను, దేశవ్యాపిత ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశానికి సంయుక్త ప్రవేశ పరీక్ష (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-జెఇఇ)ని, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిశోధన, ఇతర స్నాతకోత్తర విద్యలో ప్రవేశానికి నిర్వహించే కేంద్ర/ఉమ్మడి విశ్వవిద్యా లయాల ప్రవేశ పరీక్ష (సెంట్రల్/ కామన్ యూనివర్శిటి ఎంట్రెన్స్ టెస్ట్ -సియుఇటి)ని నిర్వహిస్తుంది. ఎన్.టి.ఎ ఈ పరీక్షల నిర్వహణను సమాచార సాంకేతిక సంస్థలకు అప్పజెప్తుంది. అజాగ్రత్తలు, అభద్రతలు, తస్కరణలకు వీలుగా ఒకరికి బదులు మరొకరు పని చేసే విధంగా ఆ సంస్థల పని తీరు ఉంది. వాటి కంప్యూటర్లలోని సమాచారం ఆపరేటర్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా ఇతరులకు అందే అవకాశం ఉంది. ఆ సంస్థలే ప్రలోభాలకు లొంగవచ్చు. ప్రభుత్వాలే ఆ సంస్థలను ఆ పనికి పురమాయిస్తే!? ప్రమాదం ఊహకందదు. 2024 సంవత్సరానికి నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల ప్రశ్నా పత్రాలు బయటకు పొక్కాయి. దీనిపై వివరణ ఇమ్మని కేంద్ర ప్రభుత్వం, ఎన్.టి.ఎ.లకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. విద్యార్థులతో, వారి హక్కులతో ఆడుకోవద్దని కేంద్రానికి చివాట్లు పెట్టింది.



యుజిసి నెట్ 2024 పరీక్షలో వైదికవాద పౌరాణిక అంశాలపై ప్రశ్నలున్నాయి. పునర్నిర్మించిన అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ ఎప్పుడు జరిగింది? (ప్రాణ ప్రతిష్ఠ రామ మందిరానికి కాదు, బాలరామునికి అన్న జ్ఞానం ప్రశ్నా పత్ర రచయితకు లేదు). హిందూతత్వ ప్రస్థాన త్రయిలోని అంశాలేవి? తలలు తెగిన తర్వాత కూడా కురు క్షేత్ర యుద్ధాన్ని చూడ్డానికి బతికిఉన్న మహాభారత యుద్ధయోధులెవరు? రామచరిత మానస్‌లో ఏ కాండలో హనుమాన్ దర్శనమిస్తాడు? బహుళ జవాబుల ఎంపిక ప్రశ్నల్లో ఇవి కొన్ని. ఉపాధ్యాయుల వైదికీకరణ వీటి ఉద్దేశం. వీటికి తోడు పోటీ పరీక్షల్లో అవినీతి (ప్రశ్నాపత్రాల అమ్మకం) విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుంది. అవినీతితో పరీక్షలో ఉత్తీర్ణులైనవారు కర్ణ ద్రోణాదులను చంపిన వీరుల్లా గర్వంతో పొంగిపోతారు. భారత కాషాయీకరణలో, నిరంకుశ పాలనలో శకుని, శల్య పాత్రలు పోషిస్తారు.

ప్రభుత్వం నెట్‌ను మరుసటి రోజే రద్దు చేసింది. నీట్‌ను రద్దు చేయలేదు. విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో అసలు దోషులు తప్పించుకుంటారు. కాని, మూలకారకులైన విద్యా సంస్థల కాషాయ కసాయిలను, వారిని నియమించిన నరమేధులను శిక్షించాలి.

మోడీ ప్రభుత్వం విద్య, పరిశోధన రంగాలకు నిధులను తగ్గించింది. విద్యాసేవలను ప్రయివేటీకరించింది. ప్రభుత్వ కళాశాలల్లో 55,648 సీట్లు, ప్రయివేటు కళాశాలల్లో 50,685 సీట్లు మొత్తం 1,06,333 సీట్ల కోసం 2024 నీట్‌కు 24 లక్షలకు పైగా హాజరయ్యారు. ఎంపిక చేసిన కొన్ని నగరాల కళాశాలల్లో 83 బోధనాంశాల అధ్యాపక పదవుల కోసం 9 లక్షల మంది 2024 నెట్ రాశారు. వైద్య విద్య సీట్లు, ఉపాధ్యాయ పోస్టులు చాలా తక్కువ. ఈ కొరత కూడా అవినీతికి కారణం. ఒక్క ప్రశ్నా పత్రం రూ.30-రూ.32 లక్షలు పలికింది.కేంద్రం, రాష్ట్రాల్లో బీజేపీ పాలించే డబుల్ ఇంజిన్‌కు అవకాశం ఇమ్మని, అద్భుతాలు సృష్టిస్తానని మోడీ మోత మోగిస్తుంటారు.

డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లోనే అవినీతి, అక్రమాలు ఎక్కువ జరిగాయి. పోటీ పరీక్షల అవకతవకలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల రాష్ట్రాలలోనే జరిగాయి. వాటిలో గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, బీహార్‌లలో మరీ ఎక్కువ. ఉత్తర ప్రదేశ్‌లో ఇటీవలి పోలీసు నియామకాల్లో కూడా కుంభకోణం జరిగింది. ఇవీ మోడీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల అద్భుతాలు.

యుజిసి నెట్ 2024 పరీక్షలో వైదికవాద పౌరాణిక అంశాలపై ప్రశ్నలున్నాయి. పునర్నిర్మించిన అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ ఎప్పుడు జరిగింది? (ప్రాణ ప్రతిష్ఠ రామ మందిరానికి కాదు, బాలరామునికి అన్న జ్ఞానం ప్రశ్నా పత్ర రచయితకు లేదు). హిందూతత్వ ప్రస్థాన త్రయిలోని అంశాలేవి? తలలు తెగిన తర్వాత కూడా కురు క్షేత్ర యుద్ధాన్ని చూడ్డానికి బతికిఉన్న మహాభారత యుద్ధయోధులెవరు? రామచరిత మానస్‌లో ఏ కాండలో హనుమాన్ దర్శనమిస్తాడు? బహుళ జవాబుల ఎంపిక ప్రశ్నల్లో ఇవి కొన్ని. ఉపాధ్యాయుల వైదికీకరణ వీటి ఉద్దేశం. వీటికి తోడు పోటీ పరీక్షల్లో అవినీతి (ప్రశ్నాపత్రాల అమ్మకం) విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుంది. అవినీతితో పరీక్షలో ఉత్తీర్ణులైన వారు కర్ణ ద్రోణాదులను చంపిన వీరుల్లా గర్వంతో పొంగిపోతారు. భారత కాషాయీకరణలో, నిరంకుశ పాలనలో శకుని, శల్య పాత్రలు పోషిస్తారు.

'నీట్' అవినీతి కారణంగా నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. మోడీ అవినీతిని అంతం చేస్తానన్నారు. కోట్ల రూపాయల ఖర్చుతో పరీక్షపై చర్చలు జరిపారు. కాని ఈ పోటీ పరీక్షల గందరగోళంపై నోరు విప్పలేదు. పార్లమెంటు లోపల, బయట కాషాయ విద్యా విధానాలను వివరించి, ఎదిరించి, నిరోధించాలి. కాషాయాన్ని అధిగమించే తాత్వికతను అలవర్చుకోడమేగాక..ఎన్నికల్లో భావజాల పాదార్థిక ప్రలోభాలకు, ప్రయోజనాలకు లొంగకుండా ఓట్లు వేసి సామాన్య ప్రజా పక్షపాత పాలకులను ఎన్నుకోవాలి.

సెల్: 9490204545 ■

చెప్పేందుకే నీతులు!

(మొదటిపేజీ తరువాయి)

మార్చుకుంటాయని, ప్రజాస్వామ్యపు హుందాతనాన్ని కాపాడాలని కోరుకుంటున్నానని తెలిపారు. గత పదేండ్లుగా తాము ప్రతిపక్షంలో కూర్చోవడంపై ప్రతిపక్షం అసంతృప్తికి గురికాకూడదని, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తన ప్రభుత్వాన్ని అనుమతించాలని కోరారు. దేశంలోని ఇరవై ఐదు కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశానని ప్రధాని పునరుద్ఘాటించారు.

ఎన్నికలకు ముందు '400 పార్' అంటూ ఊదరగొట్టి కేవలం 240 స్థానాలకే పరిమితమైనప్పటికీ తాను సాధించింది ఘన విజయమని మోడీ చెప్పుకున్నారు. ఎన్నికల ప్రక్రియ అద్భుతంగా సాగిందని కితాబు ఇచ్చారు కానీ ఎన్నికల కమిషన్ ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కిన విషయాన్ని దాటవేశారు. తన ఉద్దేశాలకు, విధానాలకు ప్రజలు మద్దతు పలికారని చెప్పుకొచ్చారు.

మోడీ విధానాలకు ప్రజలు మద్దతిచ్చారా?

ఎన్నికల రణక్షేత్రంలో మోడీ తన వద్ద ఉన్న ప్రతి అస్త్రాన్నీ ప్రయోగించారు. తన రాజకీయాలు, పరిపాలనపై ప్రజలు విముఖంగా ఉన్నారని ఆయనకు తెలుసు. కానీ దానిని కప్పిపుచ్చడానికి విశ్వప్రయత్నం చేశారు. రాజకీయ సమీకరణ కోసం అయోధ్య రామమందిర నిర్మాణాన్ని వాడుకున్నారు. అయినప్పటికీ ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ చావుదెబ్బలు తిన్నది. ఆయన విధానాలనే ప్రజలు అంగీకరించి ఉంటే ఎన్నికల ప్రచారంలో అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలు కీలకం అయి ఉండేవి కావు. ఆయన ఉద్దేశాలు, విధానాలకే ప్రజలు బ్రహ్మరథం పట్టి ఉంటే రాజ్యాంగానికి ఎదురైన పెను ముప్పుపై అట్టడుగు వర్గాల ప్రజలు ఆందోళన చెంది ఉండేవారు కారు. రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదంపై ప్రతిపక్షాలు చేసిన ప్రచారం ఊరూవాడా పాకిందని, అదే తమ కొంపముంచిందని బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలు బాహాటంగానే చెప్పుకున్నారు.

ప్రతిపక్షానికే ప్రజల బాసట

ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చాలా స్పష్టంగా ఉంది. ప్రజలు మోడీ అహాన్ని దెబ్బతీశారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. నినాదాలు చేయడం కాదని, బాధ్యతగా వ్యవహరించాలని మోడీ చేసిన హితబోధ వాస్తవానికి ప్రతిపక్షాలకు కాదు. అది ఆయనకు, ఆయన పార్టీకే వర్తిస్తుంది. ఎందుకంటే ప్రతిపక్షాలు చట్టసభల్లో నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజలకు జరుగుతున్న అన్యాయాల గురించే మాట్లాడాయి తప్ప నినాదాలు చేసి సభా సమయాన్ని వృథా చేయలేదు. వాస్తవానికి ఓటర్లు ప్రతిపక్షాలకే సత్తువ కల్పించారు.

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను సభలో ప్రస్తావించేందుకు తగిన బలాన్ని అందించారు. పాలకుల అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను ప్రతిఘటించేందుకు కావాల్సిన శక్తిని ఇచ్చారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు అవసరమైన 400 స్థానాలు ఎన్డీఏకు దక్కకుండా చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఓటర్లు ప్రతిపక్షాలకు ఊతమిచ్చారు. పాలక పక్షాన్ని కుదించారు.

ప్రతిపక్షాల బాధ్యత ఇదే

ఓటింగ్ ప్రక్రియపై వ్యక్తమవుతున్న అనుమానాలను నివృత్తి చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించాలని, ప్రవర్తనా నియమావళి ప్రాధాన్యతను గుర్తించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సి ఉంది. అగ్నిపథ్ పథకం రద్దు, ఎంఎస్‌పీకి చట్టబద్ధత, భారత్-చైనా సరిహద్దులో యధాతథ స్థితిని కాపాడడం, ఎన్నికల బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ, అదానీ వ్యవహారాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు, దేశవ్యాప్త కులగణన, పెట్రోలియం ఉత్పత్తుల ధరల తగ్గింపు వంటి అంశాలపై కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది.

రైతు భరోసాపై

ప్రజాభిప్రాయ సేకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సమీక్షించారు. గత ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో నిలిపేసిన వ్యవసాయ పథకాల వివరాలు, . అందుకు గల కారణాలను అయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు. రాబోయే సీజన్లో పిలవాల్సిన టెండర్లపై చర్చించారు.

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదిక చూస్తే వ్యవసాయ కళాశాలలున్న జిల్లాలేవి? లేని జిల్లాలేవి? సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిస్థితి ఏలా ఉంది? తదితర అంశాలపై ఆరా తీశారు. రాష్ట్ర ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చే రంగాలేవి? ప్రభుత్వం ఏఏ రంగాలపై ఎంత ఖర్చు చేస్తున్నది తదితర వివరాలను అధికారులు వివరించారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాలకు వాటా కింద కేంద్రం వెచ్చిస్తున్న మొత్తం, తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో వచ్చిన మార్పులపైనా ఆరా తీసారు. సిరిసిల్ల కో-ఆపరేటివ్ సొసైటీ, టెక్స్ టైల్ వ్యాపారస్తులు ప్రభుత్వం నుంచి ఏ పద్ధతిలో ప్రయోజనం పొందుతున్న వివరాలను అధికారులు భట్టికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో. వ్యవసాయాభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేతగా రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయం మేరకు తన నిర్ణయాన్ని వెలిబుచ్చారు. ఈమేరకు ప్రొటెం స్పీకర్‌కు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) నేత సోనియా గాంధీ లేఖ ద్వారా సమాచారం పంపారు. దీంతో గత పదేండ్ల కాలంలో తొలిసారిగా లోక్‌సభలో ప్రతిపక్షనేత ఉన్నట్లయింది.

అలక వీడని జీవన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

జరిపారు. అదే సమయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ ఢిల్లీ నుంచి ఫోన్ చేసి ఆయనకు నచ్చజెప్పినట్టు తెలిసింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన తర్వాత మాట్లాడుకుందాం...అప్పటివరకు రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరి ంచుకోవాలని కోరినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో జీవన్‌రెడ్డికి మంత్రి పదవి, లేదా ఆర్టీసీ చైర్మెన్ పదవి ఇస్తారనే లీకులు వస్తున్నాయి. ఈ లీకులపై పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ జిల్లాలో 13 సీట్లకుగానూ పది మంది ఎమ్మెల్యేలు గెలిచిన చోట మరో మంత్రికి ఎలా అవకాశం ఇస్తారనే వాదనలు వినిపిసు ్న్నాయి.జీవన్‌రెడ్డి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులో భాగమైన ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మంత్రి పదవి ఇచ్చినా అక్కడి నుంచి అగ్గి రాజుకుంటుందని ఎమ్మెల్యేలు హెచ్చరిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి మంత్రులుగా సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్ వెంకటస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. ఖాళీ బెర్తులు ఆరు మాత్రమే ఉన్నాయి. అందులో ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామంటే ఎలా అంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అయినా ఎమ్మెల్సీగా ఆయనకు ఇంకా (మార్చి 2019-మార్చి 2025) ఏడాది కాలమే ఉంది. ఏడాది సమయం ఉన్న ఎమ్మెల్సీకి మంత్రి పదవి ఇస్తామంటే, ఐదేండ్లపాటు ఎమ్మెల్యేలుగా కొనసాగనున్న తమ పరిస్థితి ఏంటని? పార్టీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. పార్టీ ఆయనకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు జగిత్యాల నుంచి టికెట్ ఇచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి ఎంపీ టికెట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. వరుసగా ఎమ్మెల్యే, ఎంపీగా ఆయన ఓటమిపాలయ్యారు. అంతేకాకుండా ఎంపీగా గెలిస్తే తాను రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పార్టీకి పెద్దదిక్కుగా ఉండి యువతను ప్రోత్సహిస్తూ...పార్టీకి వెన్నంటి ఉండకుండా జీవనరెడ్డి మంత్రి పదవి కోసం... అలకబూనారనే అభిప్రాయం సైతం జోరుగా ప్రచారమ వుతున్నాయి. అంతేకాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడాన్ని నిరసిస్తూ గాంధీభవన్ వద్ద ధర్నా చేస్తానని ఆయన ప్రకటించడంతో పార్టీ ఆయనపై గుర్రుగా ఉంది.ఈ నేపథ్యంలో అక్కడ భారీ పోలీసు బందోబస్తును పెంచింది. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, తెల్లాం వెంకట్రావు హస్తం గూటికి చేరుకున్నారు. కానీ వారి నియోజకవర్గాల్లో ఎలాంటి వ్యతిరేకతా రాలేదనీ, సంజయ్‌కుమార్ చేరడం వల్ల జీవన్‌రెడ్డి కలిగే నష్టమేంటో చెప్పాలంటూ పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌ను వీడను...ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసా :

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

తాను పార్టీ మారబోతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడబోనని స్పష్టం చేశారు. అయితే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ప్రజల్లోకి వెళతానన్నారు. 'చేరికల విషయంలో మనస్థాపం చెందాను. నేను ఇప్పుడు ఎమ్మెల్సీగా ఉన్నాను. ఎమ్మెల్సీగా అసెంబ్లీకి వెళ్లే హక్కు నాకు ఉంది. నా కార్యకర్తలు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటాను' అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బేగంపేట్‌లోని ఆయన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఆయన పై విధంగా స్పందించారు.



జీవన్ రెడ్డి మా అందరికీ మార్గదర్శకులు:

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో చర్చల అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ జీవన్‌రెడ్డి తమకు మార్గదర్శకులన్నారు. ఆయన అనుభవాన్ని ప్రభుత్వం నడపడం కోసం తప్పనిసరిగా వినియోగించుకుంటామని తెలిపారు. పదేండ్ల ప్రతిపక్షంలో ఆయన కాంగ్రెస్ జెండాను భుజాన మోస్తూ... పార్టీ భావజాలాన్ని చట్టసభల్లో వినిపించిన నేత అని కొనియాడారు. పార్టీ ఆయనకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీ ఆయన్ను వదులుకోవడానికి సిద్ధంగా లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలి

- ప్రజలకు పిలుపునిచ్చిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజలు తమ పిల్లలను చేర్పించి వాటి బలోపేతానికి తోడ్పాటును అందించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన పిలుపునిచ్చారు. ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్(ఐఎస్‌యూ) ఆధ్వర్యంలో "మనందరి మాటే బడిబాట-ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేద్దాం" అని ముద్రించిన పోస్టర్‌ను ఆమె మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షులు పాపని నాగరాజు మాట్లాడుతూ ప్రజలు -టీచర్లు- అధికారులు -పాలకులు సమన్వయంతో ముందుకెళ్తే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరుగుతుందనీ, ప్రయివేటు పాఠశాలల విస్తరణకు అడ్డుకట్ట వేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షులు పి.వెంకటేశ్ గౌడ్, హైదరబాద్ నగర అధ్యక్షులు సన్నీ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఏఈఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా

- టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ శాఖల పరిధిలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ) ఎలక్ట్రికల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితా వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వెల్లడించింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 163 పోస్టుల భర్తీ కోసం 2022, సెప్టెంబర్ మూడో తేదీన ఏఈఈ నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిలువరిద్దాం

- వికలాంగుల శాఖ డైరెక్టర్ బి శైలజ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా విచ్చలవిడిగా సాగుతున్న నేపథ్యంలో వాటి నివారణకోసం కృషి చేయాల్సిన అవసరముందని వికలాంగుల శాఖ డైరెక్టర్ బి శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, లింగమార్పిడి వ్యక్తుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ శిల్పకళా వేదికలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

పోలవరం పునరావాసంపై 15 రోజుల్లో నివేదిక

- ఏపీ సీఎస్‌కు జాతీయ ఎస్‌టి కమిషన్ నోటీసులు

అమరావతి : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ ఎస్‌టి కమిషన్ నోటీసులు జారీ చేసింది. తమ ఎదుట హాజరై నిర్వాసితుల పునరావాస చర్యలను వివరించాలని ఆదేశించింది. బాధితులకు పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించి జాతీయ ఎస్‌టి కమిషన్‌కు విశాఖపట్నానికి చెందిన రమేష్‌చంద్ర వర్మ అనే న్యాయవాది గతంలో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలవరం ముంపు ప్రాంతాల్లో కమిషన్ పర్యటించి బాధితులకు నష్టపరిహారం, పునరావాసం ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడంతో రమేష్‌చంద్ర వర్మ మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు జాతీయ ఎస్‌టి కమిషన్ తాజాగా నోటీసులు జారీ చేసింది.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కళాయాత్ర

లోగోను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలుకొలుపుదాం' కళాయాత్ర లోగోను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి నిర్వహించే ఈ కళాయాత్ర ద్వారా డ్రగ్స్ పట్ల ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించనున్నారు. 2024 జులై 1 నుండి 31 వరకు ఎగ్జిబిషన్లు, ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు కళాయాత్రలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయగా, ఆ సంఘానికి చైర్మెన్‌గా మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు.హైదరాబాద్ నగరంలో గతంలో యువకులు సరదా కోసం సిగరెట్ తాగి అలవాటు పడే వారు. ప్రస్తుతం డ్రగ్స్‌ను స్టయిల్ కోసం, గొప్పల కోసం తీసుకుంటూ బానిసలుగా మారుతున్నారు.

దీంతో విలువైన జీవితాలు, వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రభుత్వం డ్రగ్స్‌ను కట్టడి చేస్తున్నా డ్రగ్స్ మాఫియా పిల్లలు తినే చాక్లెట్లలో డ్రగ్స్ కలిపి వ్యాపారం చేసేంతగా బరితెగిస్తోంది. యువత జీవితాలను, దేశ భవిష్యత్తును చీకటిలోకి నెట్టేస్తున్నది. అందుకే డ్రగ్స్ నిర్మూలనపై సమాజాన్ని మేలుకొలపడం అత్యవసరం. కళాయాత్ర పేరుతో ప్రజానాట్యమండలి హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కాలేజీల్లో ఎగ్జిబిషన్లు, కళారూపాల ద్వారా అవగాహన కల్పించనున్నట్టు కళాకారులు, నాయకులు తెలిపారు. ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్‌గా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సినీ గేయ రచయిత అశోక్ తేజ, సినిమా హీరో డాక్టర్ మాదాల రవి, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డాక్టర్ నీలిమ, డాక్టర్ జి..యస్. రావు. ప్రముఖ దంత వైద్యులు సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి (భారత్ ఇన్‌స్టిట్యూషన్స్), పట్నం సంస్థ కార్యదర్శి డిజి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న, కోశాధికారి డి మహారాజ్ ఉన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి. మల్లేష్, ఈ.రఘు, సోమేశ్, పి.కళ్యాణ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ఎప్పటికి పూర్తవుతుంది?

- రాష్ట్రాన్ని కోరిన హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

హుజూరాబాద్ నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద చెక్కుల పంపిణీ ఎప్పటి వరకు పూర్తవుతుందని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఎంపికైన లబ్దిదారులకు చెక్కుల పంపిణీ విషయంలో కావాలనే జాప్యం చేస్తున్నారంటూ ఆ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం జస్టిస్ సూరేపల్లి నంద విచారించారు. లబ్దిదారులకు చెక్కులు సిద్ధమైనా పంపిణీ చేయడానికి రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని పిటిషనర్ లాయర్ చెప్పారు. ఈనెల 27లోగా చెక్కులను బ్యాంకుల్లో జమ చేయకపోతే అవి చెల్లవని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే చెక్కుల పంపిణీని నిలిపివేసిందన్నారు. చెక్కుల అందజేతలో జాప్యంపై వివరాలు తెలుసుకుని చెప్పాలంటూ న్యాయమూర్తి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.



స్పెక్ట్రం వేలం ప్రారంభం

- కనీస ధర రూ.96,000 కోట్లు



న్యూఢిల్లీ : కనీస ధర రూ.96,000 కోట్ల విలువ చేసే స్పెక్ట్రం కోసం మంగళవారం వేలం ప్రారంభమైంది. ఈ 10వ విడత స్పెక్ట్రం వేలంలో ఎనిమిది బ్యాండ్‌లను విక్రయానికి పెట్టారు. 5జి మొబైల్ సేవల కోసం స్పెక్ట్రం పొందేందుకు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా పోటీ పడుతున్నాయి. 2010 నుంచి స్పెక్ట్రం బిడ్డింగ్ ప్రక్రియ జరుగుతుండగా.. చివరి సారిగా 2022 ఆగస్టులో 5జి సేవల కోసం వేలం జరిగింది. ఈ దఫా రూ.96,371 కోట్ల కనీస ధర వద్ద 800, 900, 1,800, 2,100, 2,300, 2,500, 3,300 మెగాహెర్ట్జ్ సహా 26 గిగాహెడ్జెస్ బ్యాండ్‌ల స్పెక్ట్రంను టెలికం మంత్రిత్వ శాఖ వేలానికి పెట్టింది.

స్పెక్ట్రం వేలం కోసం రిలయన్స్ జియో రూ.3,000 కోట్లను డిపాజిట్ చేసింది. భారతీ ఎయిర్‌టెల్ రూ.1,050 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.300 కోట్లు చొప్పున డిపాజిట్ చేశాయి. మొత్తం స్పెక్ట్రమ్ విలువలో 37.36 శాతానికి రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ 13.07 శాతానికి, వొడాఫోన్ ఐడియా 3.73 శాతానికి బిడ్ వేసే అవకాశం ఉందని టెలికం రంగ నిపుణుడు పరాగ్ కర్ అంచనా వేశారు. 5జి సేవలకు 3300 మెగాహెడ్జెస్, 26 మెగాహెడ్జెస్ బ్యాండ్స్ 5జి సేవలకు ఉపయోగించడానికి వీలుంది. వొడాఫోన్ ఐడియా 26 గిగాహెడ్జెస్ బాండ్‌కు ఆసక్తి చూపుతుందని సమాచారం. 2022లో జరిగిన వేలంలో రూ.1.5 లక్షల కోట్ల స్పెక్ట్రం విక్రయించబడింది. కొనుగోలు చేసిన స్పెక్ట్రం 20 ఏళ్ల పాటు వాడుకోవడానికి గడువు ఉంటుంది.

బిజినెస్



రూ.1.30 లక్ష కోట్ల పెట్టుబడులు : అదానీ గ్రూపు

అహ్మదాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.1.30 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూపు ప్రకటించింది. తమ మూలధన వ్యయాలను రూ.70 వేల కోట్ల నుంచి రూ.1.30 లక్షల కోట్లకు పెంచనున్నట్లు అదానీ గ్రూపు సిఎఫ్ఒ జుగేషిందర్ సింగ్ తెలిపారు. ఇందులో భాగంగానే అదానీ గ్రీన్ ఎనర్జీ 6 గిగావాట్ల సామర్థ్యాన్ని అదనంగా పెంచుకోవడానికి రూ.34 వేల కోట్లను వ్యయం చేయనున్నామన్నారు.

దారేదీ..?



వంతెనలు లేక.. వాగులు దాటలేక..!

- అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణాలు
- అత్యవసరంలో వాగులు దాటుతూ కొట్టుకుపోతున్న జనం
- పట్టించుకోని అధికారులు.. పూర్తి చేయని కాంట్రాక్టర్లు
- వర్షాకాలంలో రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

» ఇది సిరికొండ మండల కేంద్రం నుంచి ఇంద్రవెల్లికి వెళ్లే దారిలో చిక్‌మాన్‌వాగుపై నిర్మిస్తున్న వంతెన. రూ.10.46కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో ప్రారంభించిన ఈ వంతెన పనులు 2023 ఫిబ్రవరిలో పూర్తికావాల్సి ఉంది. కానీ గడువు దాటినా అసంపూర్తిగానే మిగిలింది. ఎప్పటిలోగా పూర్తవుతుందో కూడా అధికారులు చెప్పలేని పరిస్థితి. ఫలితంగా వర్షాకాలంలో చిక్‌మాన్ వాగును దాటలేక ఇరువైపుల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

» కెరమెరి మండలం లఖంపూర్ వద్ద వాగుపై చేపడుతున్న వంతెన నిర్మాణం ఇది. 2016లో పనులు ప్రారంభించారు. ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో అటువైపు కరంజివాడ, బొరిలాల్‌గూడ, అందుగూడ, కోట, జనక్‌పూర్, గోర్యగూడ తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగును దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలున్నాయి.

» నార్నూర్ మండలం ఎంపల్లి వాగుపై వంతెన నిర్మాణం కోసం రూ.57లక్షలు మంజూరయ్యాయి. కానీ అటవీ అనుమతులు రావడం ఆలస్యం కావడంతో బ్రిడ్జితో పాటు రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభం కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా గ్రామ సమీపంలోని లంబాడితండా, కొలాంగూడ, గోండ్‌గూడ గ్రామాల ప్రజలు వాగుదాటడానికి అవస్థలు పడుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో సమస్య ఉత్పన్నమవుతున్నా పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



» గాదిగూడ మండలం ఖడ్కి గ్రామ సమీపంలోని వాగుపై ఉన్న లోలెవల్ వంతెన ఇది. ప్రతి ఏటా చిన్నపాటి వర్షానికి కూడా పై నుంచి వచ్చే వరదతో వాగు పొంగి పొర్లుతుంది. ఫలితంగా అటువైపున ఉన్న గాదిగూడ, ఝరి, దాబా, లోకారి తదితర గ్రామాల ప్రజలు నార్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు రాలేకపోతున్నారు. ఇక్కడ వంతెన నిర్మించాలని జెడ్పీటీసీలు ఇటీవల జెడ్పీ సమావేశంలోనూ ప్రస్తావించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే కొండలు, కోనలు.. వాటి మధ్య సెలయేళ్ల..వాగులు, వంకలతో ముడిపడి ఉంటుంది. వీటికి అటు, ఇటు వైపున ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే మధ్యలో ఈ వాగులు అడ్డంకి ఉన్నాయి. వర్షాకాలం వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కొన్ని గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు నిర్మించినా వాటిపై నుంచి వరద ప్రవాహం ఉండటంతో వాహనాలు నిలిచిపోతుంటాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు సులువుగా మారేందుకు గత ప్రభుత్వం పలు చోట్ల కల్వర్టులు, వంతెనలు మంజూరు చేసింది. కొన్ని నిర్మాణం పూర్తికాగా.. మరికొన్ని అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా ఏండ్లు గడుస్తున్నా వంతెనల నిర్మాణాలకు మోక్షం కలగడం లేదు. ఫలితంగా అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆందోళన చెందుతుంటారు. గత ప్రభుత్వం పలు చోట్ల బ్రిడ్జిలు మంజూరు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం కారణంగా జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండటం కారణంగా నిర్మాణాలు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు..!

అనేక చోట్ల ఆయా గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు అక్కడక్కడ వాగులపై కల్వర్టులు, లోలెవల్ వంతెనలు నిర్మించారు. వర్షాకాలంలో వీటిపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహించడంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో అనేక మంది వాహనదారులు ఇతర ప్రత్యామ్నాయ దారుల గుండా ప్రయాణించడం.. లేదంటే తిరిగి వెనక్కి వచ్చేసి వాగుల ప్రవాహం తగ్గిపోయిన తర్వాత వెళ్లడం వంటివి ఇక్కడ సాధారణమవుతున్నాయి. అధికంగా వరదలు సంభవించిన సమయంలో ఆ తాకిడికి కొట్టుకుపోవడం.. తాత్కాలికంగా మరో దారి ఏర్పాటు చేయడం వంటివి ప్రతి ఏటా నిత్య కృత్యం అయ్యాయి. అత్యవసరంగా ఆస్పత్రికి.. ఇతర అవసరాలకు వెళ్లాల్సిన జనాలు.. మరో దారిలేక వాగులు దాటుతూ కొట్టుకుపోతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో అనేక చోట్ల వంతెనలు లేకపోవడం కారణంగా ఆయా గ్రామాల్లో ఉన్న గర్భిణీల కోసం ముందస్తుగానే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బర్త్ వెయిటింగ్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ, వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వాలు, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకొస్తున్నా ఫలితం లేకుండా పోతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం కొత్త ప్రభుత్వమైనా అసంపూర్తిగా ఉన్న వంతెనలతో పాటు కొత్త వాటిని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని జనం కోరుతున్నారు.

పట్టుబడిన 806 గ్రాముల బంగారం

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన



నవతెలంగాణ-శంషాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం పెద్ద ఎత్తున బంగారం పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అబుదాబీ నుంచి ఒక ప్రయాణికుడు మంగళవారం తెల్లవా రుజామున ఎయిం్‌పోర్టుకు వచ్చాడు. అనుమానంతో కస్టమ్స్ అధికారులు అతనితో పాటు అతని లగేజ్‌ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆయన వద్ద 806 గ్రాముల బంగారం పట్టుబడింది. దీని విలువ రూ.58.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వెంటనే బంగారాన్ని స్వాధీనం చేసు కోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం అందించాలి

- అఘాయిత్యానికి పాల్పడ్డ దోషులను శిక్షించాలి : టీజీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చెంచు మహిళ కాట్రాజ్ ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాం నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాట్రాజ్ ఈశ్వరమ్మను సంఘం నేతలు ఎం.ధర్మానాయక్, వి.రామ్ కుమార్, ఎ. కృష్ణానాయక్ పరామర్శించారు. కొల్లాపూర్ నియోజక వర్గం మూలచింతలపల్లిలో నివాసముంటున్న ఈశ్వరమ్మపై కొందరు అఘాయిత్యానికి ఒడిగట్టి, అత్యంత దారుణంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన బండి వెంకటేశం. బండి శివ, సలేశ్వరంను కఠినంగా శిక్షించాలనీ, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి అసమర్థ సీఎం

- ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలనపై పట్టు సాధించలేని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారనీ, అధికారుల బదిలీలు, సస్పెన్షన్ల పేరుతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు, కుతంత్రాలు, ఫిరాయింపులు తప్ప ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కనుసన్నల్లోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి పోతున్నారనీ, తమ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, కుంభకోణాల నుంచి కాపాడుకునేందుకే ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వాన్ని ఆయన నడిపిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజాపాలన, శాంతిభద్రతలను గాలికొదిలేశారని విమర్శించారు. ఎమర్జెన్సీతో రాజ్యాంగానికి తూట్లు పొడిచింది కాంగ్రెస్ అనీ, ఆ పార్టీ నేతలు బీజేపీపై తప్పుడు ప్రచారం చేయడం సరిగాదని సూచించారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మారుస్తున్నదంటూ పదేపదే దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై చిన్నారెడ్డికి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో మొత్తం 687 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 225, గృహనిర్మాణ శాఖకు 59, పౌరసరఫరాల శాఖకు 82, హోంశాఖకు 47, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 40, ఇతర శాఖలకు సంబంధించి 234 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి

- కొంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో ఘటన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అనుమానాస్పదంగా ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాల కే ఫోర్ క్యాంపస్‌లో మల్లికార్జున అనే బాలుడు 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. అయితే మంగళవారం ఉదయం అతను ఎంతకీ నిద్ర లేవలేదు. దాంతో సిబ్బంది బాలున్ని సమీ పంలో ఉన్న ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు అక్కడకు చేరుకుని బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మల్లికార్జున సూసైడ్ చేసుకున్నాడని.. అయితే స్కూల్ సిబ్బంది మాత్రం నామమాత్రపు మృతిగా చిత్రీకరిస్తున్నారని బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

మల్లికార్జున మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఫీజులు తీసుకునే విషయంలో ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు భద్రత కల్పించే విషయంలో లేదని, ఇలాంటి యజ మాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇసుక మాఫియా అరాచకం..

- కానిస్టేబుల్ ప్రాణాలు తీసేందుకు యత్నం
- తీవ్ర గాయాలు.. హైదరాబాద్ ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ - ముస్తాబాద్

ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మొన్న వేములవాడలో మైనింగ్ ఏడీపై దాడిచేసిన సంఘటన మరువకముందే నేడు ఓ ఇసుక బకాసురుడు కానిస్టే బుల్ ప్రాణాలను తీయాలని చూశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామపూర్ గ్రామంలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కానిస్టేబుల్ సత్యనారాయణ పట్టుకున్నాడు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు అతను డ్రైవర్ ప్రక్కనే కూర్చున్నాడు. డ్రైవర్ ట్రాక్టర్‌ను అతి వేగంతో నడిపి ఇసుక ట్రాక్టర్‌పై నుంచి కిందకు దూకేశాడు. అతి వేగంతో ఉన్న ట్రాక్టర్ చెరువులో బోల్తా పడటంతో కానిస్టేబుల్ సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ని కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

మార్క్సిజమే మానవాళికి విముక్తి మార్గం

విశ్రాంత జీవితం ప్రజా ఉద్యమాలకు అంకితం చేయాలి

- ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న
- కులరహిత సమాజం కోసం పోరాడిన సామాజిక ఉపాధ్యాయులు పరశురాములు
- ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యమాల కోసం అవిశ్రాంత సేవలు : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి



నవతెలంగాణ మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మార్క్సిజమే మానవాళికి విముక్తి మార్గమని, ఆ మార్గం కోసం పుచ్చలపల్లి సుందరయ్య ఈ ప్రాంత మహోపాధ్యాయులు డి. వెంకట్ రెడ్డి, యాదగిరి చారి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని ఎమ్మెల్సీ, ప్రజా కవి గోరటి వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం పులిజాల పరశురాములు ఉద్యోగ విరమణ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లిలో జరిగిన సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. మార్క్సిజం వల్లే తామంతా చైతన్యవంతంగా తయారయ్యామని తెలిపారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ, ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన తర్వాత అటు యూటీఎఫ్, సామాజిక సంఘమైన కేవీపీఎస్‌లో అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత భావి జీవితం ప్రజా ఉద్యమాలకు అంకితం చేయాలని సూచించారు. మార్క్సిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేసిన భూపోరాటాలతో పోతారెడ్డిపల్లిలో 40 ఎకరాలు పేదలకు పంచారని గుర్తుచేశారు. తన ఆలోచనా విధానం ఎటువైపు ఉన్నా వామపక్ష భావజాలం బలోపేతం కావాలన్నదే తన ప్రధాన ధ్యేయమని అన్నారు. యూటీఎఫ్ బలోపేతానికి సెమినార్లు నిర్వహించి ఉపాధ్యాయ లోకానికి చైతన్య స్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, చావ రవి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ దాకా సామాజిక, ఆర్థిక పోరాటాలు చేసిన సామాజిక ఉపాధ్యాయులు పులిజాల పరశురాములు అని తెలిపారు. వంగూరు మండలం పోతారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న లింగయ్య ఎల్లమ్మల చిన్న కుమారుడు పరుశురాములు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే సామాజిక రుగ్మతలపై తనదైన శైలిలో పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలో హాస్టల్ సమస్యలు, ఫీజుల పెంపుపై విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వ విధానాలపై పోరాడారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేస్తే ప్రజల నుంచి స్పందన ఎలా ఉంటుందో పరశురాములు సన్మాన సభను చూస్తే మనకు తెలుస్తుందన్నారు. తమ మార్క్సిస్టు ఉపాధ్యాయులు యాదగిరాచారి, వెంకట్ రెడ్డి స్ఫూర్తితో ఆయన ఈ ప్రాంతంలో ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి కేటాయించే నిధులు తగ్గించి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.5 శాతం మాత్రమే కేటాయించడం చూస్తుంటే విద్యారంగం పట్ల వారికి ఉన్న ప్రేమ ఏ పాటిలో తెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యారంగానికి అత్యల్ప నిధులు కేటాయించడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 30 లక్షల ఖాళీ పోస్టుల్లో 10 లక్షలు ఉపాధ్యాయ పోస్టులే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులు సైతం కృషి చేయాలని అన్నారు.ఉద్యోగ విరమణ చేసిన పరశురాములు ప్రజా ఉద్యమాలకు అంకితం కావాలని సూచించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్, మహబూబ్‌నగర్ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. రాములు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లే గోపాల్, ఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫుడ్ పాయిజన్



- చందానగర్ మహిళా దక్షిత సమితి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్‌లో ఘటన
- 50 మందికి అస్వస్థత ఆరుగురి పరిస్థితి విషమం
- ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నవతెలంగాణ-మియాపూర్, చందానగర్

రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న ఆదివారం హాస్టల్‌లో ఆహారం తిన్న విద్యార్థుల్లో 50 మంది.. వాంతులు, విరోచనాలతో బాధపడ్డారు. వారిని హాస్టల్ యాజమాన్యం వెంటనే సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించింది. 50 మందిలో ప్రస్తుతం ఆరుగురి పరిస్థితి సీరియస్‌గా ఉంది. ఇదే విషయంపై కాలేజీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. తమ దగ్గర ఎవరికీ ఫుడ్ పాయిజన్ కాలేదని తెలిపింది. మంజీరా నీటి సరఫరాలో కల్తీ నీరు సరఫరా కావడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని యాజమాన్యం చెప్పింది. కలుషిత నీటి సరఫరాపై మియాపూర్ ఏరియా వాటర్ వర్క్స్ అధికారి నాగప్రియను వివరణ కోరగా.. మంజీరా నీటి సరఫరాలో నీరు కలుషితం అయితే మియాపూర్ డివిజన్ పరిధిలో అంతటా అవుతుందనీ, కేవలం ఒకే చోట ఎలా జరుగుతుందని ఆమె చెప్పారు. ఇదే అంశంపై ఫుడ్ సేఫ్టీ అధికారులను వివరణ కోరగా.. తమ పరిధిలోకి రాలేదంటూ చేతులు దులుపుకున్నారు. ప్రధానంగా విద్యాశాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం కనబడుతోంది.

కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్

నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్వహిస్తున్న కాలేజీ, హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. సేవ పేరుతో ట్రస్టులు ఏర్పాటు చేసి, ప్రజల నుంచి పెద్దఎత్తున డబ్బులు తీసుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఆర్మీ యువకుని ఆత్మహత్య

- బాలికకు ప్రపోజ్
- విషయం తెలిసి మందలించిన అమ్మాయి తండ్రి
- తీవ్ర మనస్తాపానికి గురై అఘాయిత్యం
- వికారాబాద్ జిల్లా దోమ మండలం కొత్తపల్లిలో ఘటన

నవతెలంగాణ-దోమ

ఆర్మీ జవాన్ ఓ బాలికకు ప్రపోజ్ చేయడం.. విషయం తెలిసి ఆ అమ్మాయి తండ్రి అతన్ని మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంట రాములు, తల్లి మంగమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దవాడయిన చింటూ(21) 2023లో డిగ్రీ పూర్తి చేశాడు. అగ్నిపథ్‌లో భాగంగా ఇండియన్ ఆర్మీకి సెలక్ట్ అయ్యాడు. బెంగుళూర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అతను గుజారాత్‌లో ఉద్యోగానికి వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సెలవుపై ఇంటికి వచ్చాడు. గ్రామంలోని తన స్నేహితులతో కలిసి సోమవారం సాయంత్రం గుండాల గ్రామానికి చెందిన పరిసర ప్రాంతాల్లో షికారుకు వెళ్లాడు. అక్కడ ఓ బాలిక స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో.. తనని ప్రేమిస్తున్నానంటూ ప్రపోజ్ చేశాడు. తన ప్రేమను అంగీకరించాలని కోరాడు. ఆ బాలిక ఇంటికి వెళ్లాక తల్లితండ్రులకు విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి వెంటనే కొత్తపల్లి గ్రామానికి వెళ్లి ఆర్మీ యువకుడి తల్లితండ్రులతో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై తీవ్ర మనస్తాపానికి గురై.. యువకుడు మంగళవారం ఉదయం చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.



(ఫైల్)

ఫిరాయింపుల ప్రోత్సహమేనా.. ప్రజాసమస్యలు పట్టవా?

- సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన రాణి రుద్రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యేలను పార్టీ మారేలా ఫిరాయింపులు ప్రోత్సహించడం తప్ప రాష్ట్రంలోని ప్రజా సమస్యలు పట్టవా? అని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగుల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. ఆరు నెలల నుంచి సీఎం ఆఫీసు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఉపా ధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు, తదితర సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. పదేండ్లుగా ప్రమోషన్లకు నోచుకోని ఎస్జీటీల గురించి ఎందుకు ఆలోచించడం లేదని నిలదీశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులం దరికీ సమన్యాయం చేసేలా కొత్త జీవో లను రద్దు చేసి, పాత జీవోలను పారదర్శకంగా అమలయ్యే విధంగా ఒక కమిటీని నియమించి విధివిధానాలను ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు విద్యాశాఖ మంత్రిని ఎందుకు నియమిం చలేదని నిలదీశారు.

ఓఎం సంస్థపై ఈడీ దాడులు

- కోట్లాది రూపాయలు దారిమళ్లినట్టు అనుమానం..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

విదేశాల నుంచి కోట్లాది రూపాయల నిధులను సమీకరించి పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలపై హైదరాబాద్‌లోని ఆపరేషన్ మొబిలైజేషన్ గ్రూప్ ఆఫ్ చారిటీస్(ఓఎమ్) సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఆ సంస్థకు సంబంధించిన 11 కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు చేశారు. అమెరికా, కెనడా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, డెన్మార్క్, జర్మనీ, ఫిన్లాండ్, ఐర్లాండ్, మలేషియా, నార్వే, బ్రెజిల్, చెక్ రిపబ్లిక్, ఫ్రాన్స్, రొమేనియా, సింగపూర్, స్వీడన్, స్విట్జర్లాండ్, దేశాల నుంచి ఓఎం సంస్థ సేకరిస్తున్న నిధుల వివరాల రికార్డులను అధికారులు పరిశీలించినట్టు తెలిసింది. అంతేగాక, పలు దేశాల నుంచి వచ్చిన నిధులను ఏ విధంగా వినియోగిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. అయితే, దానికి సంబంధించిన సరైన లెక్కపత్రాలను ఆ సంస్థ చూపలేదని తెలిసింది. దళిత, పేద, అనాథ పిల్లల చదువు, వైద్యం, ఇతర సౌకర్యాల కోసం ఓఎం సంస్థ నిధులను సేకరించి వ్యయం చేస్తున్నట్టు చెబుతున్నప్పటికీ ఆ ఆశయానికి విరుద్ధంగా విదేశీ నిధులను బినామీల పేరుతో నిర్వాహకులు దారిమళ్లిస్తున్నట్టు ఈడీ అధికారులు ఆరోపిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని కార్యాలయాల్లో కూడా ఈడీ అధికారులు సోదాలు జరిపినట్టు తెలిసింది. దాదాపు రూ.300 కోట్ల మేరకు నిధులు దారిమళ్లినట్టుగా అనుమానిస్తున్న ఈడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మూడో చార్జిషీట్ దాఖలు

- ఆధారాలను సమర్పించిన దర్యాప్తు అధికారులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట స్పెషల్ టీమ్ అధికారులు మంగళవారం నాంపల్లి కోర్టులో మూడో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. హార్డ్‌డిస్కులు, పెన్‌డ్రైవ్‌లతో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన సాంకేతిక పరికరాలను ఆధారాలుగా చార్జి షీట్‌కు జతచేసినట్టు తెలిసింది. నెల కిందనే మొదటి చార్జిషీట్‌ను, తర్వాత రెండోసారి చార్జిషీట్‌ను దర్యాప్తు అధి కారులు సమర్పించగా..వాటికి తగిన ఆధారాలు లేవని కోర్టు పరిశీలించలేదని తెలిసింది. దీంతో మూడో చార్జిషీట్‌లో పకడ్బందీగా వివరాలను పేర్కొనడమే కాకుండా దానికి తగిన ఆధారాలను కూడా దర్యాప్తు అధికారులు సమర్పిం చినట్టు తెలిసింది.

ఉపాధ్యాయులకు అన్యాయం జరగదు

- ఎస్సీ గురుకులాల కార్యదర్శి హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెబ్‌ఆప్షన్‌లో ఉపాధ్యాయులకు జరిగే అన్యాయాలపై పరిశీలిస్తామంటూ ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి హామీ ఇచ్చారని గురుకుల జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే సంఘా లతో ఆమె సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అన్ని రకాలైన స్పౌజ్, మెడికల్ కేసులను పరిష్కారం చేయటానికి కార్యదర్శి సుముఖత వ్యక్తం చేసినట్టు వారు తెలిపారు.

కేసీఆర్ మీటింగ్‌కు మహిపాల్‌రెడ్డి డుమ్మా

- ఢిల్లీల్లో కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు
- కారు దిగి కాంగ్రెస్‌లో చేరే ఛాన్స్
- ఆ నలుగురి చూపు కాంగ్రెస్ వైపే
- ఉమ్మడి మెదక్ జిల్లాలో మిగిలేది మామా అల్లుళ్లే



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గులాబీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జంపు జిలానీ అంటూ పార్టీ మారుతున్న నేపథ్యంలో పార్టీని రక్షించుకునేందుకు సమాలోచనలు జరిపేందుకు కేసీఆర్ నిర్వహించిన కీలక సమావేశానికి పలువురు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. మాజీ సీఎం, గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ మంగళవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఎంతో కీలకమైన సమావేశానికి బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రం హాజరుకాలేదు. పార్లమెంట్ ఎన్నికల ముందు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో కొందరు, బీజేపీలో మరి కొందరు చేరారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కూడా పార్టీ ఫిరాయింపులు ఆగట్లేదు. ఇటీవల బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సంజయ్ ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. గైరాజరైన ఐదుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ దానం నాగేందర్ ప్రకటించిన పేర్లే కావడం విశేషం.

ఢిల్లీలో గూడెం మకాం

బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. కారు దిగి హస్తం పార్టీ చెంతకు చేరేందుకు ఢిల్లీలో మకాం వేసి కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు కూడా ఢిల్లీ వెళ్లారు. అయితే గూడెం మహిపాల్‌రెడ్డి మాత్రం తన వ్యక్తిగత విషయాల గురించే ఢిల్లీకి వెళ్లినట్టు చెబుతున్నారు. కాగా, అక్రమ మైనింగ్ కేసులో రూ.300 కోట్ల వరకు అవినీతి జరిగినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ కేసులో గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి అరెస్టయి జైలుకు వెళ్లారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైనా మళ్లీ జైలుకెళ్లడం తప్పదంటున్నారు. ఇదే కేసులో ఎమ్మెల్యే పేరు కూడా ఉంది. దాంతో పాటు ఇటీవల ఈడీ సైతం గూడెం సోదరుల అక్రమ మైనింగ్ విషయంలో దాడులు చేసింది. ఏకకాలంలో ఎనిమిది చోట్ల సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు పలు డ్యాక్యుమెంట్లు, హార్డ్‌డిస్క్‌ల్ని స్వాధీనం చేసుకున్నారు.

మైనింగ్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అధికారులు ఏకకాలంలో విచారణలు జరపడంతో ఏం చేయాలో పోలుపోని పరిస్థితుల్లో గూడెం బ్రదర్స్ పార్టీ మారేందుకు సిద్ధమైనట్టు ఆయన సన్నిహితులు తెలుపుతున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావుకు అత్యంత సన్నిహితుడు కావడమే కాకుండా ఆయన బినామీగా కూడా ప్రచారముంది. ఈడీ దాడులకు దిగడంతో బీజేపీ నేతల నుంచి కూడా ఒత్తిడి ఉన్నట్టు చెబుతున్నారు.

కేసీఆర్ మీటింగ్‌కు ఐదుగురు ఎమ్మెల్యేల డుమ్మా

పార్టీని రక్షించుకునేందుకు కేసీఆర్ నిర్వహించిన కీలక సమావేశానికి పలువురు ఆ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు.

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఉన్నారు. గూడెం మహిపాల్‌రెడ్డి ఢిల్లీలో ఉన్నారు. మిగతా నలుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరందరూ కాంగ్రెస్‌లో చేరుతున్నట్టుగా ఇటీవల దానం నాగేందర్ ప్రకటించారు. ఐదుగురు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకే కేసీఆర్ సమావేశానికి హాజరుకాలేదా..? లేక మరేవైనా కారణాలున్నాయా..? అనేది చర్చనీయాంశమైంది.

ఎక్కువ మంది కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది.

మిగిలేది కేసీఆర్, హరీశ్‌రావు ఇద్దరే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం సీఎంను కలిశామని చెప్పినా పొలిటికల్ నిర్ణయం కోసమే అప్పట్లో సీఎంను కలిశారనే చర్చ జరిగింది. సీఎంను కలిసి వారిలో కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్యం, చింత ప్రభాకర్ ఉన్నారు. ఇప్పటికే గూడెం మహిపాల్‌రెడ్డి దాదాపు కాంగ్రెస్‌కు దగ్గరైనట్టు చెబుతున్నారు. ఇక మిగిలిన నలుగురు సైతం అటు ఇటు అయినా కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమంటున్నారు. సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డికి సంబంధించి ట్రావెల్స్, ఇతర వ్యాపారాలున్నాయి. సునీతకు సంబంధించి భూములు, ఆస్తుల వ్యవహారాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఇబ్బందులు పెట్టే అవకాశముందంటున్నారు. ఇప్పటికే మహిపాల్‌రెడ్డిని టార్గెట్ చేశారు. అలాగే సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు ప్రభాకర్, మాణిక్యం సైతం నియోజకవర్గంలో ఏ చిన్న పని కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నందున కాంగ్రెస్‌లో చేరడమే మేలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుండగా.. వీరిలో కేసీఆర్, హరీశ్‌రావు తప్ప మిగతా వాళ్లంతా పార్టీని వీడి హస్తం చెంతకు చేరుతారనే ప్రచారం సాగుతోంది. హరీశ్‌రావుకు సన్నిహితులైనప్పటికీ వ్యాపారాలు, ఆస్తుల్ని రక్షించుకునేందుకు పార్టీ మారడం తప్పని పరిస్థితి.

రూపాయి అవినీతి చేయలేదంటూ.. తడిబట్టలతో కౌశిక్‌రెడ్డి ప్రమాణం

- కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు సవాల్‌ను స్వీకరించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి
- ఆలయానికి వచ్చేందుకు సిద్ధంకాగా హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు
- ఆలయ సమీపంలో ఇరుపార్టీల శ్రేణులపై లాఠీచార్జీ, 144సెక్షన్ అమలు
- మంత్రి పొన్నమూ ప్రమాణం చేయాలంటూ 'పాడి' డిమాండ్
- దేవునిపైనా అబద్ధపు ప్రమాణాలా?

ఇక కౌశిక్‌రెడ్డి విమర్శకు స్పందించబోనన్న ప్రణవ్‌బాబు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి.. తాను అవినీతికి పాల్పడలేదని చెల్పూర్ ఆలయంలో ప్రమాణం చేయాలంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బావు సవాల్ చేసిన విషయం తెలిసిందే. అందుకు మంగళవారం ఆలయానికి వచ్చేందుకు సిద్ధమైన కౌశిక్‌రెడ్డిని పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. దాంతో ఇంట్లోనే తడిబట్టలతో దేవునిపై ప్రమాణం చేసిన ఎమ్మెల్యే.. మంత్రి పొన్నం కూడా అవినీతి చేయలేదని ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్య 144సెక్షన్ విధించిన పోలీసులు ఆలయ సమీపంలో లాఠీచార్జీ చేసి ఇరుపార్టీల శ్రేణులను చెదరగొట్టారు.

స్థానిక రైస్ మిల్లర్లు, ఇసుక మాఫియా వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డబ్బులు వసూలు చేశారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు విమర్శించారు. తాను పూర్తి ఆధారాలతో చెల్పూరు ఆంజనేయ స్వామి ఆలయానికి వస్తున్నానని, 'నీకు ధైర్యం ఉంటే నీవు కూడా వచ్చి డబ్బులు తీసుకోలేదని ఆంజనేయుని పై ప్రమాణం చేస్తావా?' అని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తాను చెల్పూర్‌కు మంగళవారం వస్తున్నట్టు ప్రకటించారు. ఇరువురు నేతలూ తమ కార్యకర్తలను ఆలయానికి రావాలని పిలుపునిచ్చారు. దాంతో చెల్పూర్‌లో ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉందని గ్రహించిన పోలీసులు మంగళవారం ఉదయమే రంగ ప్రవేశం చేశారు. అక్కడ 144 సెక్షన్ అమలు చేశారు. హుజురాబాద్, జమ్మికుంట రహదారిలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇరుపార్టీల కార్యకర్తలను ఎవ్వరినీ అక్కడికి రానీయ్యకుండా గుడి చుట్టూ పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా హుజు రాబాద్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ బొల్ల రమేష్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డిని, కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబుతో సహా ఇరుపార్టీల నాయకులను వారి ఇండ్లలోనే హౌజ్ అరెస్టు చేశారు. ఈ దశలో కొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు మూకుమ్మడి గా చెల్పూర్ హనుమాన్ టెంపుల్ వైపు నినాదాలు చేసుకుంటూ వస్తుండగా వారిపై లాఠీచార్జి చేసి చెదరగొట్టారు.

ఇంట్లోనే తడిబట్టలతో ఎమ్మెల్యే ప్రమాణం

పోలీసుల అరెస్టుతో బయటకు రాలేకపోయిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన ఇంట్లోనే తడిబట్టలతో ఆంజనేయస్వామి ఫొటోపై ప్రమాణం చేశారు. తాను ఒక్క రూపాయి అవినీతి చేయలేదని, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లయాష్ రవాణాలో ఓవర్‌లోడ్ లారీల వద్ద రూ.100కోట్ల వరకూ అవినీతికి పాల్పడ్డారని మళ్లీ విమర్శించారు. తాను ప్రమాణం చేసినట్టుగానే మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఆలయానికి వచ్చి దేవునిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు బుధవారం (నేడు) హైదరాబాద్‌లోని టీటీడీ దేవస్థానానికి ఉదయం 11గంటలకు వస్తానని, మంత్రి పొన్నం వచ్చి తన నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

దేవునిపైనా అబద్ధపు ప్రమాణాలు సిగ్గుచేటు: ప్రణవ్‌బాబు

'బాధ్యతగల ఎమ్మెల్యేగా ఉంటూ అవినీతి చేసి మరీ చేయలేదని దేవునిపై అబద్ధపు ప్రమాణాలు చేయడం మానుకో. ఒక జోకర్‌లా కాకుండా బాధ్యతగా మెదులుకో' అంటూ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డికి కాంగ్రెస్ హుజూరాబాద్ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు హితవు పలికారు. హుజురాబాద్ మండలం సింగాపూర్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే చేసిన అవినీతి ఆరోపణలకు ఆధారాలు చూపాలని ఎన్నిసార్లు అడిగినా అసత్యపు ఆరోపణలే చేస్తూ పబ్లిసిటీ చేసుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యేనే అవినీతి చేశారని, అందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పామన్నారు. దమ్ముంటే దేవుడిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేస్తే అందుకూ సిద్ధపడి దిగజారిపోయారని తెలిపారు. అలాంటి వ్యక్తి ఆరోపణలకు ఇకపై సమాధానం చెప్పబోమని ప్రకటించారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను చట్టబద్ధం చేయాలి



- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి
- జులై 10న ఢిల్లీలో రైతు సంఘాల సమావేశం : మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల (ఎంఎస్‌పీ)ను చట్టబద్ధం చేయాలని మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోపలు రైతు సంఘాల నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 ఏడాదికి గాను కనీస మద్దతు ధరల పెంపుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారుల మేరకు మద్దతు ధరలు దేశంలో ఇప్పటికీ అమలు కావడం లేదని వ్యాఖ్యానించారు. 2014లో అధికారంలోకి వచ్చేందుకు స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలను చెల్లిస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ఉత్పత్తి ఖర్చు, రైతుల సేవలకు అదనంగా 50 శాతాన్ని జోడించి మద్దతు ధర నిర్ణయించాలని కమిషన్ సూచిస్తే కేవలం మొదటి రెండింటిని మాత్రమే బీజేపీ సర్కార్ అమలు చేసిందని విమర్శించారు. రైతు రుణమాఫీ చేయాలని 2018 నుంచి చేస్తున్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరుపేద, చిన్న, సన్నకారు రైతుల రుణాలను కాదని, పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిందని విమర్శలు గుప్పించారు. నేషనల్ క్రైం బ్యూరో రికార్డు లెక్కల ప్రకారం దేశంలో 1.9 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలను నిరోధించాలంటే కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేయనున్న రైతు రుణ మాఫీలో కేంద్రం సగం భరించాలని కోరారు. అఖిల భారత సభ జాతీయ కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ 2017లో ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులను కాల్పుల్లో చంపించిన వ్యక్తిని కేంద్ర వ్యవశాయశాఖ మంత్రిగా నియమిస్తే రైతులకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. వెంటనే వ్యవశాయ శాఖ మంత్రిని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ పై కేంద్రం అనుసరించిన విధానంలో శాస్త్రీయత పూర్తిగా లోపించిందని గుర్తు చేశారు. ఫలితంగా గత పదేండ్లలో మద్దతు ధర 6 నుంచి 7 శాతం పెరిగితే, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, కూలీలు, డీజిల్ తదితర వస్తువుల ధరలు 16 నుంచి 20 శాతం పెరిగాయని తెలిపారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు పెంచితే ప్రస్తుతం వరికి క్వింటాలుకు రూ.2,183గా ఉన్న మద్దతు ధర రూ.3,150కి పెరిగేదని గుర్తు చేశారు.కేరళ సర్కార్ తరహాలో ఆహార ధాన్యాలతో పాటు పండ్లు, కూరగాయలకు సైతం మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాల రూపకల్పన తదదితర అంశాలపై చర్చించేందుకు జులై 10న ఢిల్లిలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతు స్వరాజ్ వేదిక నాయకులు విస్సా కిరణ్, కన్నెగంటి రవి మాట్లాడుతూ ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50 శాతం జోడించి ఎంఎస్‌పీ ప్రకటించాల్సి ఉండగా, మొక్కుబడిగా ఏటా వంద, యాభై పెంచుతున్నారని ఆరోపించారు. కేంద్రం ఇప్పటికైనా మద్దతు ధరల విషయంలో పునరాలోచించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలను కౌలు రైతులకు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బి.కొండల్, జక్కుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డ్ ఉపయోగిస్తున్నవారే టార్గెట్

- బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని గాలం
- ఓ వ్యక్తిని నమ్మించిన సైబర్ నేరస్తులు రూ.1.39లక్షలు స్వాహా
- మరో సంఘటనలో రూ.1.50లక్షలు దండుకున్న సైబర్ నేరస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రోజుకో తీరులో రెచ్చిపోతున్న సైబర్ నేరస్తులు ఎంత వీలైతే అంత దండుకుంటున్నారు. ప్రస్తుతం క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్న వినియోగదారులను, ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్న వారిని సైబర్ నేరస్తులు టార్గెట్ చేస్తున్నారు. ఇదే తరహాలో నాలుగు క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్న హైదరాబాద్‌కు చెందిన (పదవీ విరమణ చేసిన) ఓ వ్యక్తిని టార్గెట్ చేశారు. ఈ క్రమంలో టోల్‌ఫ్రీ నెంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి బాధితునికి ఫోన్ చేశాడు. తాను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్‌నంటూ పరిచయం చేసుకున్నాడు. మీ బ్యాంక్ లావాదేవీలను చెక్ చేయాలని చెప్పాడు. బ్యాంక్ మేనేజరేనని భావించిన బాధితుడు సైబర్ నేరస్తులు చెప్పిన విధంగా చేశాడు. వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలతోపాటు మూడు సార్లు ఓటీపీని వారికి చెప్పాడు. ఆ తర్వాత ఖాతా నుంచి రూ.1,39,895 ట్రాన్స్‌ఫర్ అయినట్టు బాధితుని సెల్‌కు ఎస్ఎంఎస్ వచ్చింది. ఆందోళనకు గురైన బాధితుడు తాను మాట్లాడిన నెంబర్‌కు ఫోన్ చేయడంతో కనెక్టు కాలేదు. అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రేడింగ్ పేరుతో గాలం..

నగరానికి చెందిన ఓ వ్యక్తికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అందులో ఎస్ఎస్‌జీఏ (స్టేట్ స్ట్రీట్ గ్లోబల్ అడ్వైజర్స్)గా సమాచారం ఉంది. ఆ తర్వాత బాధితునికి ఫోన్ చేసిన వ్యక్తి తాను ఎస్ఎస్‌జీఏలో పనిచేస్తున్నానని, తాము చెప్పిన వాటిల్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలొస్తాయని నమ్మించాడు. వాట్సాప్‌లో ఓ లిస్ట్‌ను పంపించి గాలం వేశారు. వారు చెప్పిన విధంగా బాధితుడు ప్రతిరోజూ ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేశాడు. ఒక నెలలో రూ.1,50,000లను పెట్టుబడి పెట్టాడు. వాటికి అధిక లాభాలొచ్చాయని సైబర్ నేరస్తులు చెప్పడంతో వచ్చిన లాభాలను విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. అయితే డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతోపాటు ప్రతి సారీ స్కానర్ తిరిగి మరిన్ని డబ్బులను ఇన్వెస్ట్ చేస్తే అన్ని డబ్బులను ఒకే సారీ తీసుకోవచ్చని చెప్పింది. అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్, సోషల్ మీడియా, టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లతో జాగ్రత్తగా ఉండాలని డీసీపీ తెలిపారు. మోసపూరితమైన ప్రకటనలు, గుర్తుతెలియని వ్యక్తుల మాటలను నమ్మొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరస్తుల చేతిలోపడి మోసపోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆ తర్వాత బ్యాంక్ అధికారులకు సమాచారం ఇవ్వడంతోపాటు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అంటూనే.. ఫిరాయింపులా?

- కాంగ్రెస్‌పై కేటీఆర్ మండిపాటు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూనే మరోవైపు పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎమర్జెన్సీ నాటి నుంచి ఇప్పటి వరకు నయవంచనకు ప్రతిరూపం కాంగ్రెస్ అంటూ ట్వీట్ చేశారు. పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల గొంతులను అణిచి వేస్తూ 49 ఏండ్ల క్రితం ఇదే రోజు కాంగ్రెస్ దేశంలో ఎమర్జెన్సీని విధించిందని గుర్తు చేశారు. ఇన్ని దశాబ్దాలు గడిచినా సరే ఆ పార్టీ ప్రజాస్వామ్యంపై అదే దాడిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు పార్లమెంట్‌లో రాజ్యాంగ కాపీలను ఆ పార్టీ నేతలు చేత పట్టుకొని ప్రదర్శన చేస్తారు.. మరోవైపు అదే పార్లమెంట్‌కు కొద్ది దూరంలోనే ఉన్న వాళ్ల పార్టీ ఆఫీస్‌లో రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసే విధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారు అని విమర్శించారు. ఏ రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారో...అదే రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బ తీసేలా వ్యవహరించే కాంగ్రెస్ హిపోక్రసీ చూస్తుంటే ఆవేదన కలుగుతోందని పేర్కొన్నారు. నయవంచనకు ప్రతిరూపమే కాంగ్రెస్ అని విమర్శించారు.

కేసీఆర్‌ను కలిసిన కౌశిక్ హరి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రామగుండం కేశోరాం సిమెంట్స్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఎన్నికల్లో ఇటీవల బీఆర్ఎస్ ప్యానల్ విజయం సాధించిన నేపథ్యంలో అధ్యక్షులు కౌశిక్ హరి కుటుంబ సమేతంగా ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు .

ప్రొటోకాల్ పంచాయితీ

- ప్రారంభోత్సవాల్లో ఇన్‌చార్జీల పాత్ర
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అభ్యంతరాలు
- నర్సాపూర్‌లో మంత్రి సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే సునీత
- సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింత.. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- పటాన్‌చెరులో ఎమ్మెల్యేను పిలవని వైనం
- గజ్వేల్, సిద్దిపేటలోనూ వివాదాలే..


(ఫైల్)

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అధికార పార్టీ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ప్రొటోకాల్ పంచాయితీ రచ్చకెక్కింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడు చోట్ల ఓటమిపాలైంది. అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నా అధికారిక కార్యక్రమాలకు ప్రాధాన్యత దక్కట్లేదు. ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు హాజరవుతున్నారు. దాంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలపడంతో వివాదం చోటు చేసుకుంటుంది. ఇప్పటికే నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి, గజ్వేల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కాదని కాంగ్రెస్ నాయకులకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ గొడవలు జరుగుతున్నాయి. నర్సాపూర్‌లో మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మధ్య నువ్వేంటి అంటే నువ్వేంటీ అంటూ గొడవ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్న చోట కాంగ్రెస్ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని తప్పుపడుతున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆరు గ్యారంటీ పథకాల అమలుతో పాటు గతంలో నిర్మించిన భవనాలు, రోడ్లకు ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మంత్రివర్గంలో దామోదర రాజనర్సింహ ఉన్నారు. అదే విధంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొండా సురేఖ కొనసాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగుతున్నాయి. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక మూడు చోట్ల కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్, సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, జహీరాబాద్, సంగారెడ్డిలో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఈ నియోజకవర్గాల్లో అధికారికంగా చేపట్టే కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేలకు విధిగా సమాచారం ఇవ్వాలి. అధికారులు ఆ మేరకు ఎమ్మెల్యేలకు కూడా సమాచారం అందజేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆ కార్యక్రమాల్లో అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులు సైతం క్రియాశీలకంగా ఉంటున్నారు. దాంతో స్థానిక ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలుపుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో కొండా సురేఖ నర్సాపూర్, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, మెదక్ వంటి ప్రాంతాల్లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆమె వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా ఉంటున్నారు. కొన్ని చోట్ల కొబ్బరి కాయలు కొట్టడం, ప్రారంభోత్సవాలకు రిబ్బన్ కటింగ్ చేయడం వంటి జరుగుతుండటంతో వివాదస్పదమవుతుంది. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో మంత్రి దామోదర రాజనర్సింహ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయన వెంట కూడా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులు పాల్గొంటున్నారు.

నర్సాపూర్‌లో ప్రొటోకాల్ గొడవ

నర్సాపూర్ నియోజకవర్గంలోని కొల్చారం, నర్సాపూర్, కౌడిపల్లి ప్రాంతాల్లో ఇటీవల పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నర్సాపూర్‌లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కూడా మంత్రి వెంట పాల్గొన్నారు. దాంతో మంత్రి రాజిరెడ్డిని రిబ్బన్ కటింగ్ చేయాలని కోరింది. రాజిరెడ్డి కత్తెర అందుకుని రిబ్బన్ కట్‌చేయబోయారు. ఇంతలో అక్కడే ఉన్న స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అభ్యంతరం తెలిపారు. రాజిరెడ్డి చేతిలో ఉన్న కత్తెరను లాగేసి అడ్డుకున్నారు. దాంతో మంత్రి సురేఖనే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రాజిరెడ్డి సైతం కొబ్బరి కాయ కొట్టడంతో కొద్దిసేపు వివాదం జరిగింది. ప్రజా ప్రతినిధి కాని వ్యక్తులతో ఎలా అధికారికంగా ప్రారంభోత్సవాలు చేయిస్తారంటూ ఎమ్మెల్యే సునీత నిలదీశారు. అయితే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కాదని పార్టీ నాయకులు ప్రారంభోత్సవాలు చేసిన ఉదంతాలను మంత్రి గుర్తు చేశారు. దాంతో వారిద్దరి మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని గుమ్మడిదల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో కూడా ప్రొటోకాల్ పంచాయితీ ఏర్పడింది. బీఆర్ఎస్‌కు చెందిన జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న మంజుశ్రీ జైపాల్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీటీసీల పేర్లను ప్రొటోకాల్ పద్ధతిలో పెట్టకుండా కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీల పేర్లు మాత్రమే పెట్టారు. దాంతో అక్కడ కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సంగారెడ్డి నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కాదని పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా ఉన్న జగ్గారెడ్డి భార్య నిర్మలారెడ్డినే పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పెద్దగా అధికారిక కార్యక్రమాలకు పిలవడంలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు.

అధికారులకు తలనొప్పి


(ఫైల్)

ప్రొటోకాల్ విషయం అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. మూడు జిల్లాల్లోని ఏడు నియోజకవర్గాల్లో విపక్ష బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలున్నారు. అధికారికంగా చేపట్టే సమీక్షా సమావేశాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, పర్యటనలు ఇలా ఏది చేసినా స్థానిక ఎమ్మెల్యేనే మొదటి ప్రొటోకాల్ వీఐపీగా ఉండాలి. అందుకే అధికారులు విపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు కూడా ఆహ్వానాలు, సమాచారాలు పంపుతున్నారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జిలను కూడా గౌరవించి పిలవాల్సి వస్తుంది. ఇన్‌చార్జి, జిల్లా మంత్రుల పర్యటన సందర్భంగా వారి వెంట కాంగ్రెస్ నాయకులు కూడా ఉంటున్నారు. వారిని సైతం గౌరవించి పిలవాలని మంత్రులు మౌఖికంగా ఆదేశిస్తున్నట్టు చెబుతున్నారు. అలా పిలవకపోయినా గౌరవించకపోయినా అధికారుల మీద బీఆర్ఎస్‌కు అనుకూలమనే ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు.. ఇతర ముఖ్య స్థానాల్లో ఉండే అధికారుల బదిలీల విషయంలోనూ ఇదే జరిగింది. సంగారెడ్డి ఆర్డీఓ, డీఎస్పీ బదిలీల విషయం కూడా వివాదస్పదమైంది. మూడు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు ప్రొటోకాల్ విషయంలోనూ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

పలు చోట్ల అగ్నిప్రమాదాలు

- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో రెండు అగ్ని ప్రమాదాలు
- సిద్దిపేటలోనూ ఘటన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/సిద్దిపేట


హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో మంగళవారం ఒక్కరోజే రెండు చోట్ల అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీ బస్టాప్ ఎదురుగా ఉన్న 16 అంతస్తుల భవనంలోని 4వ అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో ఆ భవనంలో పనిచేస్తున్న అనేక రకాల కంపెనీల ఉద్యోగులు సుమారు 500 మంది అప్రమత్తమై వెంటనే బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు, ఫిలింనగర్ ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో వచ్చి వెంటనే మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఎవరికీ గాయాలు గాని జరగలేదు. ఫైర్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. 16 అంతస్తుల భవనంలో మొదటి ఆరు అంతస్తులు వాహనాలకు పార్కింగ్ కోసం వదిలి పెట్టారని తెలిపారు. మిగిలిన పై అంతస్తుల్లో కొన్ని కంపెనీలు నిర్వహిస్తున్నారన్నారు. అయితే నాలుగో అంతస్తులో ఫర్నిచర్, అట్టపెట్టెలతో నింపి ఉందని.. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నట్టు చెప్పారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఏరియాను స్టోర్ రూమ్‌గా వాడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో పోలీస్ స్టేషన్‌కు ముందున్న ఐదంతస్తుల భవనంలో మరో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రెండో ఫ్లోర్‌లో ఉన్న ఫ్యాబ్ ఇండియా క్లాత్స్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి భవనం మొత్తం వ్యాపించాయి. దాంతో జనం పరుగులు పెట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఫైర్ సిబ్బంది. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాప్తి చెంది రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు చెబుతున్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ బార్‌లో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బార్‌లోనిసమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఖరీదైన మద్యం బాటిల్స్ ఉండటంతో.. సుమారు రూ 15 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు బార్ యజమాని తెలిపారు.

గంజాయి పట్టివేత

- రెండు ఘటనల్లో ఐదుగురు యువకులు అరెస్టు



నవతెలంగాణ-బోడుప్పల్

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం బోడుప్పల్ కమాన్ ప్రాంతంలో మేడిపల్లి పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో నలుగురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా వారి వద్దనున్న బ్యాగు అనుమాస్పదంగా కనిపించింది. దాంతో వారిని ఆపి బ్యాగును తనిఖీ చేయగా అందులో 1100 గ్రాముల గంజాయి లభించింది. దాంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులు బోడుప్పల్‌కు చెందిన కూరెళ్ల సాయి కుమార్, శివరాత్రి వినయ్ కుమార్, కొడిదల మనోజ్ కుమార్, సంతోష్ కుమార్‌గా గుర్తించారు.

మరో ఘటనలో.. బోడుప్పల్ ప్రాంతంలోనే మేడిపల్లి పోలీసులు, ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్దనున్న బ్యాగును తనిఖీ చేయగా అందులో 1300 గ్రాముల గంజాయి లభించింది. సీతాఫల్ మండీకి చెందిన జున్ను సంతోష్ అలియాస్ సంతుగా అతన్ని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మేడిపల్లి సీఐ తెలిపారు. యువత క్షణికావేశంలో మత్తుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నతమైన లక్ష్యాల వైపు తమ జీవితాలను మలుచుకోవాలని సీఐ సూచించారు. మేడిపల్లి పీఎస్ పరిధిలో ఎక్కడైన యువకులు నిర్మానుష్య ప్రదేశాల్లో గుమిగూడితే ప్రజలు పీఎస్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బెయిల్ అంశాలను అనవసరంగా వాయిదా వేయొద్దు : సుప్రీం

- జులై 9న ఆప్ నేత సత్యేందర్ జైన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ

న్యూఢిల్లీ : బెయిల్ విషయాలను అనవసరంగా వాయిదా వేయవద్దని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. మనీ లాండరింగ్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఆప్ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణలోనైనా ఢిల్లీ హైకోర్టు నిర్ణయం తీసుకోగలదని ఆశిస్తున్నట్లు పేర్కొంది. తన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఆరు వారాల పాటు వాయిదా వేస్తూ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ జైన్ పిటిషన్ వేశారు. దానిపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ భట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ పై వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు జైన్ బెయిల్ పిటిషన్‌పై జులై 9న విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అంతకుముందు జైన్ తరపు వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ, నిందితుడి డీఫాల్ట్ బెయిల్ హక్కును హరించేందుకు దర్యాప్తు సంస్థ అసంపూర్తిగా వున్న ఛార్జిషీట్‌ను దాఖలు చేసిందా అనే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. ఇదే విషయం సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పరిశీలనలో వుందని, దానికి జైన్ బెయిల్ పిటిషన్‌ను జత చేసి విచారించాల్సిందిగా వెకేషన్ బెంచ్‌ను కోరారు. తమది ద్విసభ్య ధర్మాసనం అయినందున తాము దాన్ని విచారించలేమని జస్టిస్ మిశ్రా చెప్పారు. హైకోర్టు ముందు ఆ విషయాన్ని పరిష్కరిస్తే తర్వాత తాము చేపడతామని బెంచ్ పేర్కొంది. వాస్తవిక కోణాన్ని పరిగణనలోకి తీసుకుని హైకోర్టు ఈ కేసును విచారించాలని పేర్కొంది. మనీ లాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్‌ను ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్‌కు లభించని ఊరట !

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఉపశమనం లభించలేదు. ఎక్సైజ్ పాలసీ కేసులో ఆయనను బెయిల్‌పై విడుదల చేయాలని ఈనెల 20న ట్రయల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మంగళవారం స్టే విధించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అందజేసిన సమాచారాన్ని ట్రయల్ కోర్టు సరిగా సమీక్షించలేదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఆయా పక్షాలు దాఖలు చేసిన వేలాది పేజీలను కూలంకషంగా సమీక్షించడం సాధ్యం కాదని ట్రయల్ కోర్టు న్యాయమూర్తి చేసిన కొన్ని వ్యాఖ్యలను హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది.

ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

- సీపీఎస్‌ను రద్దు చేయాలి
- పెండింగ్ డీఏలను ప్రకటించాలి : తెలంగాణ ఉద్యోగ జేఏసీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలను చేపట్టాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరింది. పెండింగ్‌లో నాలుగు డీఏలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యోగ జేఏసీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. ఉద్యోగుల చందాతో కూడిన ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల పదోన్నతులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. 2018 నుంచి ఉద్యోగుల బదిలీలు జరగలేదని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో జరిగిన బదిలీలను వెనక్కి పంపిన తర్వాతే ఉద్యోగుల బదిలీలను చేపట్టాలని కోరారు. గచ్చిబౌలి టీఎన్జీవో రెండో ఫేజ్‌లో 101.02 ఎకరాల స్థలాన్ని సొసైటీకి యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. భాగ్యనగర్ టీఎన్జీవో హౌజింగ్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలో సర్వేనెంబర్ 36,37 గోపనపల్లి ఇండ్ల స్థలాలను బిటి ఎన్జీవోకు కేటాయించడానికి ప్రభుత్వం 2014, జులై రెండోన జారీ చేసిన మెమోను రద్దు చేసి కేటాయించాలని సూచించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచేటట్టు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయంలోకి హెచ్‌వోడీల నుంచి 12.5 శాతం కోట అమలు చేసి ఉద్యోగులను పంపాలని సూచించారు. 317 జీవోలోని లోపాలను సవరించి రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 భవిష్యత్తు ఉద్యోగ నియామకాలకు వర్తింపచేసేటట్టు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాత ఉద్యోగులకు పాత సీనియార్టీని కొనసాగించాలని అన్నారు. మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నూతన క్యాడర్ స్ట్రెంథ్‌ను పాత జిల్లాల్లో ఉన్న విధంగా అదనపు క్యాడర్‌ను మంజూరు చేయాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాలని సూచించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ అనుమతిని 2026, మార్చి 31 వరకు పొడిగించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవద్దనీ, తద్వారా పదోన్నతులు రాక ఉద్యోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఉద్యోగుల మీద కక్షసాధింపు చేస్తూ అక్రమ ఆస్తుల పేరుతో కేసులను నమోదు చేయడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవో, టీజీవో ప్రధాన కార్యదర్శులు ముజీబ్, ఎ సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ, ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె గౌతంకుమార్, తెలంగాణ ఇంటర్ విద్యాజేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి, క్లాస్-4 ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె గంగాధర్, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైవేల నిర్మాణాలను వేగవంతం చేయండి

- ఎన్‌హెచ్ఏఐ చైర్మెన్‌తో మంత్రి కోమటిరెడ్డి భేటీ



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో హైవేల నిర్మాణాలను వేగవంతం చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఏఐ)ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో ఎన్‌హెచ్ఏఐ చైర్మెన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ భేటిలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఇంజనీర్ ఇన్‌చీఫ్ (ఆర్ అండ్ బీ) ఐ.గణపతి రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెండింగ్‌లోని రహదారుల సమస్యల పరిష్కారం, పలు జాతీయ రహదారుల మంజూరు గురించి చర్చించారు. పదేండ్లుగా తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం నత్తనడకన సాగడం వల్ల వేలాదిమంది అమాయకులైన ప్రజలు చనిపోతున్నారని చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు.. వెంటనే జాతీయ రహదారుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరారు. ఇందులో భాగంగా హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్-65 నిర్మాణ పనులను ఆరు లేన్లుగా నిర్మించాలని సూచించారు. ఎన్ హెచ్-163 (హైదరాబాద్ - మన్నెగూడ) కు ఉన్న ఎన్జీటీ సంబంధిత సమస్యకు సత్వర పరిష్కారాన్ని చూపి, ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్న నాలుగు లేన్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. అధిక రద్దీతో తీవ్ర ప్రమాదాలకు కారణమవుతున్న ఎన్ హెచ్ -765 (హైదరాబాద్ - కల్వకుర్తి) రోడ్డును నాలుగు లేన్లుగా నిర్మించేందుకు కావాల్సిన డీపీఆర్ తయారీ ప్రక్రియని వేగవంతం చేయాలని కోరారు.

కిషన్ రెడ్డితో మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి భేటీ

కేంద్ర కేబినేట్ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణ నుంచి మరో సారి కేంద్ర కేబినేట్‌లో చోటు దక్కించుకున్నందుకు అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో సహకారం అందించాలని కోరారు. అయితే, మంత్రుల విజ్ఞప్తిపై స్పందించిన కిషన్ రెడ్డి, రాష్ట్ర అవసరాల విషయంలో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

మంత్రులూ ఆదాయ పన్ను చెల్లించాల్సిందే

- మధ్యప్రదేశ్ క్యాబినెట్ నిర్ణయం

భోపాల్ : మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ఇక నుంచి తమ జీతాలు, అలవెన్సులపై ఆదాయ పన్నును వారే స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రుల జీతాలు, అలవెన్సులపై రాష్ట్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను చెల్లించే 1972 నిబంధనను రద్దు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రే చేశారని రాష్ట్ర పట్టణ పరిపాలన శాఖ మంత్రి కైలాష్ విజయవర్గీయ మీడియాకు వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు.

పూణే కారు ప్రమాదంలో మైనర్ విడుదల : హైకోర్టు

ముంబయి : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పూణే పోర్షే కారు ప్రమాదం కేసులో మైనర్ నిందితుడ్ని విడుదల చేస్తూ బాంబే హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఈ కారు ప్రమాదం కేసు తీవ్రమైనదైనప్పటికీ చట్ట ప్రకారం నిబంధనలు పాటించవల్సిందేనని స్పష్టం చేసింది. మైనర్ నిందితుడికి జువైనల్ జస్టిస్ బోర్డు (జెజెబి) విధించిన రిమాండ్ ఉత్తర్వులు చట్ట వ్యతిరేకమని పేర్కొంటూ వాటిని హైకోర్టు పక్కనపెట్టింది. మైనర్ నిందితుడిని తక్షణమే విడుదల చేయాలని జస్టిస్ భారతి డాంగ్రే, మంజూష దేశ్‌పాండేలతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. నిందితుడిని అబ్జర్వేషన్ హోమ్ నుంచి విడుదల చేయాలని అతడి బంధువు దాఖలు చేసిన పిటీషన్‌ను విచారిస్తూ ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. మే 19 అర్ధరాత్రి మైనర్ నిందితుడు ఖరీదైన పోర్షే కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో ఇద్దరు యువకులు మరణించారు. ఈ ప్రమాదానికి ముందు నిందితుడు బార్‌లో తన స్నేహితులతో కలిసి మద్యం సేవించినట్లు సిసిటివి ఫుటేజిలో వెల్లడైంది.

కేంద్రమంత్రులతో సీతక్క భేటీ

- రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మంత్రులతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం భేటీ అయ్యారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద పది లక్షల గృహాలకు రక్షిత మంచినీటిని అందించేందుకు నిధులు కేటాయించా లని కేంద్ర జలశక్తి శాఖా మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌ను, పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ. 1,544 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌లతో కలిసారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 53.98 లక్షల గృహాలకు రక్షిత మంచినీరు అందుతుందని, కొత్తగా నిర్మించిన గృహాలకు నల్లాల ద్వారా నీటిని అందించేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర జలశక్తి శాఖా మంత్రిని కోరారు. రాష్ట్రంలో 6,176 గ్రామ పంచాయతీలకు భవనాలు లేవని రాజీవ్ రంజన్ సింగ్‌కు నివేదించారు.

తాత్కాలిక భవనాల్లో ఆఫీసులు కొనసాగుతున్నాయని, స్వంత భవనాలు కాకపోవడం వల్ల ఆటంకాలు ఎదురవుతున్నాయని కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ స్కీం ద్వారా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

రాహుల్‌ను కలిసిన సీతక్క

న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శాలువా కప్పి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అప్యాయంగా పలుకరించిన రాహుల్ గాంధీ, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

లీకేజీలతో దేశ ప్రతిష్టకు భంగం

- ఎన్టీఏను రద్దు చేయాలి
- ప్రధాని ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నీట్ నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకే ఇవ్వాలి
- విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- నేడు రాష్ట్రవ్యాప్తంగా మోడీ దిష్టిబొమ్మ దహనం : విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ సమితి పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో దేశ ప్రతిష్టకు భంగం కలుగుతున్నదని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి విమర్శించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్‌ను మార్చడం కాకుండా ఆ సంస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేసింది. నీట్ నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకే అప్పగించాలని కోరింది. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలనీ, ఆ రాతపరీక్షలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చేపడతామని పిలుపునిచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్‌కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆ సమితి నాయకులు అభిజిత్ యాదవ్ (ఎన్ఎస్‌యూఐ), అశోక్‌రెడ్డి (ఎస్ఎఫ్ఐ), శ్రీను (పీడీఎస్‌యూ), కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ (డీవైఎఫ్ఐ), కె ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్ (ఏఐవైఎఫ్), కెఎస్ ప్రదీప్ (పీవైఎల్), ఎస్‌కే సలీంపాషా (వైజేఎస్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అయి విద్యార్థులు నష్టపోయినా ప్రధాని మోడీ నోరుమెదపడం లేదని విమర్శించారు. అమ్మకానికి ప్రశ్నాపత్రాలుండడం సిగ్గుచేటని అన్నారు. నీట్ ప్రశ్నాపత్రాన్ని అంగట్లో సరుకుగా బీజేపీ ప్రభుత్వం మార్చిందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నిర్లక్ష్య వైఖరిని వీడాలనీ, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూజీసీ నెట్ రద్దుకు బాధ్యత వహించి అభ్యర్థుల దగ్గర వసూలు చేసిన దరఖాస్తు ఫీజును తిరిగి చెల్లించాలని కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహించి మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీకర్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, పీడీఎస్‌యూ నాయకులు గౌతమ్, అనిల్, వీజేఎస్ నాయకులు వీరన్న, ఏఐవైఎఫ్ నాయకులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హష్మీబాబు, ఎండీ జావెద్, పీవైఎల్ నాయకులు బిఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ జూడాల సమ్మె

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. సోమవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, డీఎంఈ వారితో చర్చలు జరిపారు. అయితే ప్రధాన డిమాండ్లన్నింటిపై స్పష్టత రాకపోవడంతో సమ్మెను కొనసాగిస్తామని జూడాల నాయకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం (వరంగల్)తో పాటు రాష్ట్రంలోని అన్ని బోధనాస్పత్రుల్లో వారు రెండో రోజు కూడా సమ్మెను కొనసాగించారు. హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ముందు జూడాలు ఆందోళన నిర్వహించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ప్రతినెలా స్టైపెండ్ చెల్లించాలనీ, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు రూ.1.25 లక్షల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఏపీ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలను నిలిపివేస్తున్నామని వారు స్పష్టం చేశారు. మొదటి రోజు సమ్మె సందర్భంగా ఓపీ సేవలను మాత్రమే బహిష్కరిస్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ తెలిపింది. మంగళవారం సాయంత్రం తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులతో వైద్యశాఖ ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు.

ఉద్యోగుల సమస్యలపై త్రిసభ్య కమిటీ అధ్యయనం

- త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జోతిబాఫూలే ప్రజాభవన్‌లో భేటీ అయ్యారు. ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి, టీజేఎస్ అధినేత కోదండరాం, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య పాల్గొన్నారు. అనంతరం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తరచూ భేటీ కావాలని నిర్ణయించామని తెలిపారు. ఇది ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. కింది స్థాయి నుంచి ఉన్నత ఉద్యోగి, అధికారి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందిన పలు వినతి పత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని వివరించారు. ఆయా సంఘాల నుంచి సీఎంకు అందిన వినతి పత్రాలపై చర్చించి నివేదికను రూపొందిస్తామని తెలిపారు. దాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తామని పేర్కొన్నారు. ఇది ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వమనీ, ఈ వర్గాలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో ముందుకు సాగుతామని తెలిపారు.

డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- బడ్జెట్ సమస్య లేదు.. ఎన్ని నిధులైనా కేటాయిస్తాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్స్ రహిత తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, వాటి అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్ అవేర్నెస్ సాంగ్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణ, నివారణ కోసం ఎన్ని నిధులైనా కేటాయిస్తామనీ, వాటి రవాణాలో ఎవరున్నా ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చిరించారు. తక్కువ సమయంలో, అక్రమ పద్ధతుల్లో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలన్న దురద్దేశంతో కొంతమంది, దేశాన్ని బలహీన పర్చాలనే కుట్రతో దేశద్రోహులు యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. వాటిని నిర్మూలించటమనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇందుకోసం ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నివారణకు అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి పోలీసులు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుంటే కట్టడి చేయడం సులభం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ సీపీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారి సభ్యత్వాన్ని రద్దు చేయండి...

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఐదుగురు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలని పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి .జగదీష్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ,ఎమ్మెల్సీ తాత మధు పాల్గొన్నారు. జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ఫిరాయింపుదారులపై పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్ సమయం కోరామనీ, ఒకట్రెండు రోజుల్లో సమయం ఇస్తానని ఆయన తెలిపినట్టు వెల్లడించారు. పాంచ్ న్యాయ్ తీర్మానం ప్రకారం ఫిరాయింపులను ప్రోత్సహించవద్దని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెబుతుంటే, సీఎం రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ బీజేపీపై దాడి చేస్తుంటే రేవంత్ రెడ్డి అదే పార్టీకి తోకలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫిరాయింపులకు సంబంధించి హైకోర్టు తీర్పుతో న్యాయం జరగకపోతే తర్వాత సుప్రీంకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు. తాము కమిషన్ వద్దని చెప్పటం లేదనీ, జస్టిస్ నర్సింహారెడ్డిని తప్పించాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు.

సైనిక్ స్కూల్ పై సీఎం రేవంత్ అబద్ధాలు

- బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశాన్ని కేసీఆర్ పట్టించుకోలేదంటూ సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయంలోనే వరంగల్‌కు సైనిక్ స్కూల్ మంజూరైందని గుర్తుచేశారు. దాని మంజూరు కోసం గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను రక్షణశాఖ అధికారులను అడిగి, రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుందని సూచించారు. తెలంగాణ సమస్యలపై కేంద్రంతో నిజాయితీగా పోరాడింది బీఆర్ఎస్సేననీ, పోరాడబోయేది కూడా బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. నీట్‌పై తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్రం తరపున మంచి న్యాయవాదిని నియమించి పోరాడాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు భరోసా అమలు చేస్తారా? లేదా?

- సర్కారుకు నిరంజన్ రెడ్డి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వానాకాలం సీజన్ ప్రారంభమైంది...రైతు భరోసాను అమలు చేస్తారా? లేదా? అంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా రైతు భరోసా అందించే తీరిక లేదా? రుణమాఫీ అమలు చేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. రూ. రెండు లక్షల రుణం తీసుకున్న రైతుల వివరాలు వెల్లడించాలని కోరారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తారా? లేదా? రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తారా? లేదా? రేషన్ కార్డులు లేనివారికి కొత్తవి ఇస్తారా? లేదా? అని ఆయన నిలదీశారు. ఈ అంశాలన్నింటిపై సీఎం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీకి కేబినెట్ ఆమోదించినందుకే సంబురాలు చేస్తుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు.



పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డిని మంగళవారం ఢిల్లీ లోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత అభినందనలు తెలియజేశారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

'రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ - వనస్థలిపురం

రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్‌లోని ఆటో సాయి నగర్‌లో సీసీ రోడ్ లెవెల్స్ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరు నిలవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనే విషయాన్ని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు సూచించారు. ఈ పరిశీలనలో కాలనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శివారెడ్డి, నర్సిరెడ్డి, రాములు, సత్యనారాయణ, అభినందన్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.




సీసీ రోడ్లు పూర్తి చేయాలని వినతి

నవతెలంగాణ - నాగోల్

కాలనీలోని సీసీ రోడ్లకు నిధులను మంజూరు చేయించి, త్వరగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ పరిధిలోని ఫతుల్లాగూడ సాయి సుప్రభాత్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయి సుప్రభాత కాలనీలో ఇంకా మౌలిక సదుపాయాలు చేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా రోడ్ నెంబర్ 3 లో 25 అడుగుల వెడల్పు గల సీసీ రోడ్డుతో పాటు మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లకు తగిన నిధులను మంజూరు చేయించి.. మా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్టు తెలిపారు. సాయి సుప్రభాత్ కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నిధులను మంజూరు చేయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నియోజకవర్గంలోని ప్రతి కాలనీ ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సాయి సుప్రభాత్ కాలనీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె వి శాస్త్రీ, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి మంత్రి.. విద్యకు లేకపాయే..



సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు రాజు

నవతెలంగాణ - హయత్‌నగర్

తెలంగాణ ప్రభుత్వంలో మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ.. విద్యకు మాత్రం మంత్రి లేకపోవడం చాలా విడ్డూరంగా ఉందని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు(పిడికిలి రాజు) ఎద్దేవా చేశారు. విద్యా దీక్ష కార్యక్రమంలో భాగంగా కామినేని పక్కన ఉన్న మహాత్మ జ్యోతిరావు ఫూలే విగ్రహం వద్ద సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్లో 30% బడ్జెట్‌ను విద్యా రంగానికి కేటాయించాలని కోరారు. గురుకుల విద్యా సంస్థల ఇంటిగ్రేటెడ్ పద్ధతిని పైలెట్ ప్రాజెక్టుగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి అమలు చేయాలన్నారు. కార్పొరేట్ విద్యను తక్షణమే కట్టడి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్ధన్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో కామన్ విద్య విధానాన్ని అమలు చేయాలని కోరారు. తక్షణమే విద్యా వ్యవస్థలో ఖాళీ లను భర్తీ చేయాలన్నారు. ఈ విద్యా దీక్షకు పలువురు సామాజిక వేత్తలు, పలు రాజకీయ పార్టీల నేతలు మద్దతుగా సంఘీభావం పలికారు. ఈ నిరసనలో సోషల్ జస్టిస్ ఫోరమ్ చైర్మెన్ ప్రొ. ప్రభంజన్ యాదవ్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు పాండు రంగా చారి, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు నక్క యాదీశ్వర్, ద్రవిడ మున్నేట్ర కజగం పార్టీ తెలంగాణ అధ్యక్షులు అశోక్ శాక్య , కార్పొరేట్ నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాస్, బీసీ రాష్ట్ర నాయకురాలు కరుణ శ్రీ, బీసీ రాష్ట్ర నాయకులు దుర్గయ్య గౌడ్, ఎం ఆర్ పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జెల్ల వెంకటేష్, సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కే వి గౌడ్, నవ భారత నిర్మాణ సేవా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండల్ గౌడ్, అధికార ప్రతినిధి చెన్న శ్రీకాంత్, విద్యార్థి విభాగం అధ్యక్షులు పంచిక అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ శిక్షణా తరగతులు





నవతెలంగాణ - చైతన్యపురి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో ఎల్బీనగర్ సరూర్‌నగర్ సర్కిల్ కమిటీ సీపీఐ(ఎం) పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులను చైతన్యపురిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కమిటీ కార్యదర్శి వెంకటేష్ దోపిడి విధానాలపై తరగతులను బోధించారు. అనంతరం సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కడిగళ్ళ భాస్కర్.. పార్టీ నిర్మాణం, రాజకీయ పరిస్థితుల మీద ప్రసంగించారు. ఈ శిక్షణా తరగతుల్లో సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్. వెంకన్న, కమిటీ సభ్యులు వీరయ్య, జి. మనోహర్, కే. శ్రీనివాస్, కే. రాములు, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ కమిటీ సభ్యులు పురుషోత్తం చారి, ఎండి. కమర్, దుర్గారావు, లతీఫ్, చైతన్య, యాదయ్య, రవి, ఎల్బీనగర్ సర్కిల్, సరూర్‌నగర్ సర్కిల్ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో ఇండో-ఉజ్బెక్ ఫార్మా బిజినెస్ ఫోరం



నవతెలంగాణ - సిటీబ్యూరో

భారత్, ఉజ్బెకిస్థాన్ దేశాల మధ్య ఫార్మా రంగంలో వాణిజ్యం, పెట్టుబడుల అవకాశాలను మరింత పెంచేందుకు ఇండో-ఉజ్బెకిస్థాన్ ఫార్మా బిజినెస్ ఫోరం హైదరాబాద్‌లో విజయవంతంగా జరిగింది. న్యూఢిల్లీలోని ఉజ్బెకిస్థాన్ రాయబార కార్యాలయం, ఉజ్బెకిస్థాన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ డెవలప్మెంట్ ఏజెన్సీ, నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. దీనికి రెండు దేశాల నుంచి ఉన్నత స్థాయి అధికారులతోపాటు పరిశ్రమ దిగ్గజాలు కూడా హాజరయ్యారు. ఈ ఫోరమ్‌లో భారతదేశంలోని ఉజ్బెకిస్థాన్ రిపబ్లిక్ రాయబారి సర్దోర్ ఎం.రుస్తంబయెవ్‌తో సహా విశిష్ట భాగస్వాములు పాల్గొన్నారు. నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దివ్య రాజ్, ఉజ్బెకిస్థాన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ డెవలప్మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ అబ్దుల్లా అజిజోవ్, ఉజ్బెకిస్థాన్ రాయబార కార్యాలయానికి చెందిన నిపుణులు, దౌత్యవేత్తలు, హెటిరో ల్యాబ్స్, భారత్ బయోటెక్ వంటి భారత ఫార్మా కంపెనీలతో పాటు ఇతర ప్రఖ్యాత సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించే దిశగా కీలక అడుగుగా పలు ఎంఓయూలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రంలో ఉజ్బెకిస్థాన్ ఎంబసీ నుంచి రాయబారులు ఎస్. సుయరొవ్, కె.సమియెవ్, ఉజ్బెకిస్థాన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ అబ్దుల్లా అజిజొవ్, ఎస్.ఒబ్లొయెరొవ్, ఎస్.ఇషంఖనొవ్, నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ దివ్యారాజ్, బీవీకే రాజ్, వెలుగుబంట్ల శ్రీరోహిత్, బుఖారా ప్రాంతీయ ప్రభుత్వాధినేత ముహమ్మద్జన్ రేఖొనొవ్, జె.యుల్డొషెవ్, భారతీయ ఫార్మా కంపెనీలైన హెటెరో ల్యాబ్స్, భారత్ బయోటెక్, ఇతర ప్రధాన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అండర్ పాస్‌లకు బదులుగా ఫ్లైఓవర్ నిర్మించాలి



- హయత్‌నగర్ చౌరస్తా వద్ద ఎట్టి పరిస్థితుల్లో అండర్ పాస్ నిర్మాణం చేపట్టనీయం
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం/ హయత్‌నగర్

ఆర్ అండ్ బీ రోడ్డు రవాణా శాఖ అధికారులు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అండర్ పాస్ నిర్మాణాలు చేపడుతున్నారని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆరోపించారు. వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ పనులను వెంటనే నిలిపివేసి, ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. అండర్ పాస్ నిర్మించడం వలన రోడ్డుకు ఇరువైపులా ఉన్న కమర్షియల్ షాపుల వారికి వ్యాపారం తగ్గిపోతుందని, అంతే కాకుండా ఆ పరిసర ప్రాంతాల కాలనీ వాసులకు కూడా పలు సమస్యలు ఏర్పడతాయని అన్నారు. కావున అండర్ పాస్‌లకు బదులుగా ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

పనామా వద్ద కాకుండా హయత్ నగర్ చౌరస్తా వద్ద కూడా అండర్ పాస్ నిర్మాణం ఉందని, హయత్‌నగర్ చౌరస్తా వద్ద ఎట్టి పరిస్థితిలో అండర్ పాస్ నిర్మాణం చేపట్టనీయం అని అన్నారు. ఈ నిరసనలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి, బద్దం ప్రేమ్ మహేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, వివిధ కాలనీల సంక్షేమ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ - హయత్ నగర్

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే నేడు(బుధవారం) సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల సమయం వరకు తమ సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని హయత్ నగర్ 1 డిపో మేనేజర్ విజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాల కోసం 9959226138 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ కళాశాల అడ్మిషన్ల దరఖాస్తులు



కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న ప్రభ

నవతెలంగాణ - హయత్‌నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జ్యోత్స్నప్రభ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి దోస్త్ ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలన్నారు. దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యార్థులకు ఏదైనా సాంకేతిక ఇబ్బంది కలిగినట్లయితే కళాశాలలోని సహాయక కేంద్రం ద్వారా పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఈ నెల19 నుండి మూడో విడత నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, వెబ్ ఆప్షన్లు జూలై మూడవ తేదీ వరకు ఇవ్వొచ్చని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలతో పాటు గత సంవత్సరం నుండి బీబీఏ కోర్సు ప్రారంభించినట్లు తెలియజేశారు. ఇందులో విద్యార్థులు చదువుకుంటూనే ఉపాధి పొందడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. అన్ని సౌకర్యాలు కలిగిన కళాశాలలో డాక్టరేట్, నెట్, సెట్ కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అత్యుత్తమ బోధన జరుగుతుందని తెలిపారు. విశాలమైన కళాశాల ప్రాంగణం, లైబ్రరీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలతో పరిపుష్టమై విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి మొదటి ఆప్షన్‌గా కళాశాల పేరును దోస్త్ వెబ్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం దోస్త్ కోఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి మొబైల్ నెంబర్ 9441065762, దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ వినయ్ కుమార్ మొబైల్ నెంబర్ 9666338001 ను సంప్రదించాలని సూచించారు.

ఢిల్లీలో లోక్ సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, కుందూరు రఘువీరా రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి.. శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మహేశ్వర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి.



నవతెలంగాణ - చైతన్యపురి

రహదారి నిర్మాణ పనులు పూర్తిచేయడానికి సహకరించాలి

జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిలకు వినతి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

గుర్రంగూడ నుండి అల్మాస్ గూడ శివాలయం వరకు అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయడానికి సహకరించాలని గుర్రంగూడ 6, 7 డివిజన్ల కార్పొరేటర్లు డి.శంకర్, లక్ష్మారెడ్డిలు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,హెచ్ ఎండీఏ కమిషనర్, కందుకూర్ ఆర్ డీఓ.సూరజ్ కుమార్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ రఘు నాయక్‌లకు వేరువేరుగా వినతి పత్రాలను అందజేసినట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.3కోట్ల నిధులు మంజూరై మూడు సంవత్సరాలు దాటినా నేటికీ పనులు పూర్తి చేయడం లేదన్నారు. కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా గోతులు తీసి, కంకర వేసి పనులను పూర్తి చేయకుండా నిలిపివేశారని విమర్శించారు. అదేవిధంగా గుర్రంగూడలో ఉన్న స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం లేకపోవడం వలన ప్రజలు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న సాహెబ్ నగర్ కు వెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.





ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సమస్యలు పరిష్కరించాలి : ఏఐవైఎఫ్



- నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో ఐదు రోజులుగా ఆన్‌లైన్ ఎర్రర్
- మందుల కొరత.. అపరిశుభ్రంగా మరుగుదొడ్లు..
- ఔట్ పేషెంట్స్ వార్డు పైకప్పు పెచ్చులూడుతున్న వైనం
- ఏరియా ఆస్పత్రిని సర్వే చేసిన ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం

నవతెలంగాణ - సంతోష్‌నగర్

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం కోరింది. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాంపల్లి ఏరియా ఆస్పత్రిలోని పలు అంశాలపై ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల డయాగ్నోసిస్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలను బాధ్యతతో అందించాలని డిమాండ్ చేశారు. నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో గత ఐదు రోజులుగా రక్త పరీక్ష సేవలు ఆన్లైన్ ఎర్రర్ కారణంగా అందుబాటులో లేవన్నారు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఆస్పత్రిలో మందుల కొరత, మరుగుదొడ్లు సరిగా లేవని, ఆస్పత్రి ఔట్ పేషెంట్ వార్డ్‌పై కప్పు పెచ్చులు ఊడి పడ్డాయని చెప్పారు. వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. బాలింతలకు గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన కిట్లను ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రిలో ఆవరణ చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉందన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలోని సెక్యూరిటీ ఏజెన్సీ ఏగిల్ గ్రూప్ సిబ్బందికి మూడు నెలలుగా జీత భత్యాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే అనంతరం ఏఐవై ఎఫ్ ప్రతినిధి బృందం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవై ఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, బాలు, విజయ్, వంశీ, సీనియర్ కార్మిక నేత చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలని తీర్మానం



- నిధుల కొరతతో అన్ని వార్డుల్లో అసంపూర్తి పనులు
- గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రద్దు
- చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది

నవతెలంగాణ - బడంగ్‌పేట్

జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, అసంపూర్తిగా ఉన్న వివిధ అభివృద్ధి పనులను రూ.65లక్షల నిధులతో పూర్తి చేయాలని తీర్మానం చేయడం జరిగిందని జల్‌పల్లి మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లాబిన్ సాది అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ వాణీదేవి ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ మున్సిపల్‌లో సరియైన నిధులు లేకపోవడం వలన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మున్సిపల్‌లో అభివృద్ధి పనులను చేపట్టడానికి మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేయగా.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దుచేయడం జరిగిందన్నారు. నేటి సమావేశంలో రూ.65లక్షలతో మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో పగిలిపోయిన మ్యాన్ హెూల్స్ మరమ్మతులు, గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం, బోనాల ఉత్సవాల నిర్వహణ చేస్తున్నట్టు తెలిపారు.

మున్సిపల్‌లో నిధుల కొరత కారణంగా అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రయినేజీ, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించడం, తదితర వాటిని పూర్తి స్థాయిలో చేపట్టలేకపోతున్నామని చెప్పారు. ఎర్రకుంటలోని శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహించి..రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మున్సిపల్ సాధారణ నిధులు రూ.8లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం జిల్లా అధికారులు ప్రత్యేక నిధులు మంజూరు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్.ఓ, మేనేజర్, డీఈఈ వెంకన్న, టీ.పీ.ఓ, ఏఈ అయేషా, కో ఆప్షన్ సభ్యులు కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బి.యాదగిరి, శంషోద్దీన్, లక్ష్మీ నారాయణ, పల్లపు శంకర్, యాహియా, దస్తగిర్, పుష్పమ్మ కొండల్ యాదవ్, పమీద అఫ్జల్, మజర్ అల్లి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కును అందజేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 139 ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ బీజేఆర్ నగర్‌కు చెందిన ఎం.పద్మావతి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నది. ఆమెకు మంజూరైన రూ. 1,50,000 ఎల్‌వోసీ పత్రాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బాధితురాలు ఎం.పద్మావతికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 139 ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, సుకేశ్, సతీష్, టీంకు, హ్యారీ, మహేష్, రవి, విజయ్, చందు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఐఈడీ, డీపీఎస్‌ఈ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి



నవతెలంగాణ-కాప్రా

రెండేండ్ల డీఈఐఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్), డీపీఎస్‌ఈ (డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత పరీక్షలో అభ్యర్థులు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు 45శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు. 1.9.2024 నాటికి 17 ఏండ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జులై 10వ తేదీన ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామనీ, మరిన్ని వివరాలకు http://deecet.cdse.telangana.in సందర్శించాలని కోరారు.

బెల్టు షాపులను ఎత్తేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్రంలో ఉన్న బెల్టు షాపులు ఎత్తేసి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ కమలానగర్‌లో మంగళవారం ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో 80వేలకుపైగా బెల్టు షాపులను ఏర్పాటు చేసి మొత్తం రాష్ట్రాన్ని తాగుబోతులుగా మారుస్తున్నారన్నారు. మద్యానికి బానిసై చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. పేద కుటుంబాల్లో కూలీనాలీ చేస్తే వచ్చిన డబ్బులను మద్యానికి ఖర్చు చేస్తున్నారన్నారు. మద్యం మత్తులో మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. స్వయంగా ప్రభుత్వ గుర్తింపు ద్వారా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపులు కాకుండా ఒక్క మద్యం షాపు పర్మిషన్ తీసుకుని ఐదు బ్రాంచీలుగా నడిపిస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మద్యం షాపులు సమయం పాటించకుండా 24 గంటలు ఓపెన్‌గా ఉంచుతున్నారని చెప్పారు. చదువుకునే విద్యార్థులు కూడా డ్రగ్స్, మద్యానికి బానిసై కుటుంబాలు, ప్రజలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆదాయం కోసం మద్యం షాపులను పెంచి పోషిస్తుందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా డ్రగ్స్, మద్యం షాపులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పత్రికా ప్రకటనలకే పరిమితమవుతుంది తప్పా, చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డ్రగ్స్, మద్యం షాపులపై చర్యలు తీసుకుని నూతన బెల్ట్ షాపులకు పర్మిషన్ ఇవ్వకుండా చూస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే అడ్డగోలుగా బెల్టు షాపులను ప్రోత్సహిస్తుందన్నారు. బెల్ట్ షాపులు షాపింగ్ మాల్ టైప్‌లో ఏర్పాటు చేసి ప్రజలను ఆకట్టుకునే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు, లైంగికదాడులు ఆగాలంటే డ్రగ్స్, బెల్ట్ షాపులను ప్రభుత్వం తొలగించాలనీ, లేనిపక్షంలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం రూపొందిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి మాట్లాడుతూ డీవైఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో వైద్యంపై సర్వేలు, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌లో సర్వేలు నిర్వహిస్తామనీ, ఇందులో వచ్చిన అంశాలపై అధికారులకు మెమోరాండాల రూపంలో అందజేస్తామని తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్యం మొత్తం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలనీ, ధరలు తగ్గించి ప్రజలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సజన, ఎం.వినోద, ఐద్వా జిల్లా కమిటీ నాయకులు ఎ.విజయ, సఫియా, శారద, పి.మంగ, వి.కరుణ, నజీమా, ఎస్.నాగమణి, ఆర్.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి

నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈపీఎస్ పెన్షనర్ల ఆలిండియా కమిటీ నిర్ణయం మేరకు కనీస పెన్షన్ రూ.9 వేలు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం పెంచాలని, వైద్య వసతులు కల్పించాలని (టాప్రా) తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి అన్నారు. తమ సమస్యలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఆందోళన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జులై 24 నుంచి ఆగస్టు 9 వరకు నిర్వహించే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఆగస్టు 6 నుంచి 8 వరకు జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ లోపు రాష్ట్రం నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యులందరికీ ఆయా జిల్లా బాధ్యులు వినతి పత్రాలు అందజేసి తమ సమస్యలను పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించాలని కోరతామని తెలిపారు. ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు, సీబీటీ సభ్యులు, ప్రతిపక్ష నాయకులందరికీ వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరిలోని ఈపీ ఎస్ పెన్షనర్స్ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో టాప్రా రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బాలగంగాధర్, మల్కాజిగిరి ఏరియా కమిటీ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులున్నారు.

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చక్రిపురం వెంకటేశ్వర స్వామి 18వ సంవత్సర బ్రహ్మోత్సవాల్లో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. ఆలయంలో వేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. చక్రిపురంలో భక్తులు, ప్రజల నడుమ మూడు రోజులుగా భక్తి పారవశ్యంతో కూడిన వేడుకలు నిర్వహించారు. దీంతో చక్రిపురం గోవిందనామ స్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో ములుగు చక్రధర్‌రెడ్డి దంపతులు, రణధీర్ రెడ్డి దంపతులు, బాల్ రెడ్డి, రాఘవరెడ్డి, గంగిరెడ్డి వెంకటేష్, శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, వెంకటేష్, రమాదేవి, సంతోష్ గుప్తా, వెంకట్ రెడ్డి, లక్ష్మి, సాకేత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ మ్యాన్ హౌల్‌కు మరమ్మతులు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో కొంత కాలంగా కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హౌల్‌కు కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మరమ్మతులు చేయించారు. సమస్యను హెచ్ఎండబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ వారికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. దీంతో బస్తీవాసులు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి కృతజ్ఞతలు తెలిపారు. మ్యాన్ హౌల్ కవర్లు కిందకు కూరుకుపోయి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హౌల్స్‌కు మరో రెండురోజుల్లో మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

మృతుడి కుటుంబానికి బండారి పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

ఎర్రగుంట ప్రాంతానికి చెందిన గద్ద నర్సింగ్ రావు అకాలంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి గద్ద నర్సింగ్ రావు ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

న్యూ విరాట్ నగర్‌లో బొంతు శ్రీదేవి పర్యటన



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డలోని న్యూ విరాట్ నగర్‌లో చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ లైట్స్, మాన్ హౌల్ కవర్స్ డ్యామేజ్ అయ్యాయని న్యూ విరాట్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ సుధీర్ కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శ్రీదేవి కాలనీలో పర్యటించి స్ట్రీట్ లైట్స్ రిపేర్ చేయించారు. డ్యామేజ్ అయిన మ్యాన్ హౌల్ కవర్స్‌కు రీప్లేస్ చేయాలని ఏఈ సందీప్‌ను ఆదేశించారు. న్యూ విరాట్‌నగర్ కాలనీలో మంచినీరు ప్రెషర్ రావట్లేదని కాలనీ వాసులు తెలపడంతో వాటర్ వర్క్స్ ఏఈతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, వెంకటరెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ సుధీర్ కుమార్, వెంకటేష్, శివమ, కృష్ణారెడ్డి, రాజు, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-కీసర

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీహాల్‌లో ఎస్సీ కార్పొరేషన్, ప్రో ఫ్యాషన్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగారం మున్సిపాలిటీకి చెందిన 70మంది మహిళలకు 3నెలలు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా రాణించాలన్నారు.



ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ మల్లేష్, మున్సిపాలిటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, ఎస్సీవో అధికారి సుచిత్ర, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్, కార్పొరేషన్ అధికారులు, అభయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కీసర మండలంలోని ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్దీత గడువులోగా ధరణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.రెవెన్యూ అధికారులతో పాటు ఆపరేటర్లను కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఆరా తీశారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే మర్రిని కలిసిన డబుల్ బెడ్ రూం లబ్దిదారులు



నవతెలంగాణ మల్కాజిగిరి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని డబుల్ బెడ్‌రూం లబ్దిదారులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లకు డ్రయినేజీ, మంచినీరు, ఎలక్ట్రికల్ సౌకర్యాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడ ఉండలేని పరిస్థితి ఉందని వాపోయారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆగిపోయిన పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. డబల్ బెడ్ రూం లబ్దిదారులను అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి సాధించాలి

- బోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలు అభివృద్ధి సాధించాలని బోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం బోగారం గ్రామంలో మహిళా శక్తి గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధులను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు మీసేవ కేంద్రాలు, భోజనం క్యాంటీన్లు, చేపల వ్యాపారం, గేదేలు, ఆవులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీరామ్, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ఎం.వీ. ప్రసాద్, వసంతక్క 19 వ వర్ధంతి



- ఆపరేషన్ కాగర్‌ను వెంటనే ఆపాలి
- మల్లెపల్లి ప్రభాకర్, మెరుగు పుణ్యవతి

నవతెలంగాణ-జవహర్ నగర్

దోపిడి, పీడన, అణిచివేతకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన గోదావరిలోయ విప్లవ ప్రతిఘటనోద్యమ నాయకులు కామ్రేడ్ ఎం.వీ.ప్రసాద్, వసంతక్కలు అని సీపీఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ, కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ కొనియాడారు. మంగళవారం కేంద్ర కమిటీ పిలుపు మేరకు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వెంకటేశ్వర కాలనీలో మా గృహలక్ష్మీ సేవా సంఘం ఆవరణలో ఎం.వీ.ప్రసాద్, వసంతక్కల 19వ వర్ధంతి సభను ఐపీవోడబ్ల్యూ మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం.పుణ్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి మౌనం పాటించి, నివాళులర్పించారు. అనంతరం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆదివాసి గిరిజన ప్రజలపై అంతిమయుద్ధాన్ని వెంటనే ఆపాలని, జనశక్తి కూర రాజన్న విప్లవోద్యమంలో చేసిన రాజకీయ హత్యలపై ఆత్మవిమర్శ చేసుకొని, భారత విప్లవ ప్రజానీకానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి బానోత్ సంతోష్ నాయక్ సభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రభాకర్, నకిరేకంటి చిట్టిబాబు, సంపంగి పద్మ, పెర్క సునీత, ఇఫ్టూ (శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ షావలి, కె.నర్సన్న, మహ్మద్ రషీద్ ద్రావిడ, నేతప్ప, మైమూద్, సిద్ధిరాజు, బడిగే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


చొప్పదండి ఎమ్మెల్యేకు కోదండరాం పరామర్శ



నవతెలంగాణ ఆల్వాల్

కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పరామర్శించారు. ఇటీవల సత్యం సతీమణి రూపా దేవి మృతి చెందడంతో మంగళవారం తన అనుచరులతో కలిసి రూపాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యంను ఓదార్చి ధైర్యంగా ఉండాలని, పిల్లల బాగోగులు చూసుకోవాలని సూచించా రు. ఆయన వెంట టీజేఎస్ నాయకులు ఆంజనేయులు, దయాకర్, రవి, సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

విశ్వకర్మ పరిషత్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రఘురామచారి



నవతెలంగాణ-మేడ్చల్

అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా అల్వాల రఘురామచారిని ఎన్నుకున్నారు. మంగళవారం మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా సమావేశాన్ని మేడ్చల్ పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణానికి చెందిన అల్వాల రఘురామచారిని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా వడ్ల అశోక్ చారి, ఉపాధ్యక్షులుగా శ్యామ్ రావు చారి, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్ చారి, కోశాధికారిగా బాలరాజు చారి ఎన్నికయ్యారు. అదేవిధంగా విశ్వకర్మయ, టింబర్ సామిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వడ్ల పండరాచారిలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శివపల్లి రాజేశం, ప్రధాన కార్యదర్శి అణిపెద్ది వేణుగోపాలచారి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు శివపల్లి రాజేశం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విశ్వకర్మలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనైనా విశ్వకర్మల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విశ్వకర్మలపై అటవీ శాఖ అధికారుల దాడులను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. అనుమతులు, కర్ర సేకరణ తదితర సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదిమూలం రాఘవచారి, బొడ్డిపల్లి చరణ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

- జవహర్ నగర్‌ను ఆకుపచ్చగా తీర్చిదిద్దుదాం
- మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్



నవతెలంగాణ - జవహర్‌నగర్

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, జవహర్‌నగర్‌ను ఆకుపచ్చగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బాలాజీ నగర్‌లో ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్ మధ్యలో నాటిన మొక్కలలో చనిపోయిన వాటిని గుర్తించి వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటారు. అనంతరం చెన్నాపురంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నందన వనం పార్కును సందర్శించారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, జమాల్పూర్ నవీన్ కుమార్, ఎడ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ శానిటేషన్ సూపర్వైజర్ కృష్ణప్ప, ఎన్విరాన్మెంట్ సందీప్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బోడుప్పల్ బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ నాయకులు ఘట్కేసర్ మాజీ జడ్పీటీసీ సభ్యులు,కార్పొరేషన్ ధ్యక్షులు మంద సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఫాం హౌస్ లో మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణమాలపై కేసీఆర్‌తో మాట్లాడగా పార్టీ పక్షాన పోరాడాలని బీఆర్ఎస్ నిరంతరం ప్రజా పోరాటాలతో ప్రజాల్లో ఉండేలా కార్యచరణ రుపొందించాలని సూచించినట్లు తెలిపారు. కేసీఆర్ ను కలిసిన వారిలో కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త రవి గౌడ్,కాటపల్లి రాంచంద్రారెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్ ఉన్నారు.

మైదుకూరు ఎమ్మెల్యేను కలిసిన యాదవ నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను మంగళవారం హైదరాబాద్‌ని వారి స్వగృహంలో యాదవ ఐక్య వేదిక కన్వీనర్ యల్లావుల చక్రధర్ యాదవ్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంటీ.కృష్ణ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, తదితరులు కలిసి సన్మానించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
బుధవారం | జూన్ 26, 2024 | www.navatelangana.com

వీధి కుక్కల నివారణ చర్యలు



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మల్లంపేట్ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్న పిర్యాదుల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ కే. సత్యనారాయణ రావు, మల్లంపేట్ వార్డ్ నందు వీధి కుక్కల వలన ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు రక్షణ చర్యలలో బాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారి భాగస్వమ్యంతో మంగళవారం 18 కుక్కలను అప్పగించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి కుక్కల నివారణ చర్యలు లో బాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారితో గతంలో ఒప్పందం చేసుకోవడం జరిగినదని, వారు వీధి కుక్కలను తీసుకొని వెళ్లి చంప కుండా, వాటికి పిల్లలు పుట్టకుండా స్టిరలైజేషన్ ఆపరేషన్ యాంటి రేబీస్ టీకా వేసి వదిలిపెడతారని వివరించారు. ఆహారం నీరు లేక కుక్కలు వింతగా ప్రవర్తిస్తాయి అని కావున వాటికి కావలసిన తాగు నీటిని, ఆహారం ను పిల్లలు తిరగని ప్రదేశాలలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలుంటే సాధించలేనిదేదీ లేదు : సీఐ నవీన్



నవతెలంగాణ - బాలానగర్

స్కేటర్ తేజేష్ పడిగ ఈ నెల 13 నుండి 17వరకు జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్, ఓషియానియా, పసిఫిక్ చాంపియన్ షిప్ పోటీలలో ఇన్ లైన్ ఫ్రీ స్కేటింగ్ లో బంగారు పతకం, సోలో డాన్స్ లో వెండి పతకం', ఫ్రీ స్కేటింగ్ లో కాంస్య పతకం సాధించి భారత దేశ కీర్తిని, తన సత్తాను ఇనుమడింప చేసాడు. ఈ సందర్భంగా తేజేష్ మాట్లాడుతూ ఇప్పటి దాకా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ విభాగాలలో మొత్తం 93 బంగారు పతకాలు, 38 వెండి పతకాలు, 21 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 152 పతకాలు సాధించానన్నారు. సెప్టెంబర్‌లో ఇటలీ జరగబోయే చాంపియన్‌షిప్ కోసం ప్రభుత్వం, దాతల సహకారం అందించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, బాలానగర్ సీఐ నవీన్ కుమార్ పతకాలు సాధించిన తేజేష్‌ను ప్రత్యేకంగా పిలిపించుకుని ఘనంగా సత్కరించారు. సెప్టెంబర్ లో జరగబోయే ప్రపంచ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆశీర్వదించారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- కార్పొరేటర్ మాధవరం రోజాదేవీ రంగారావు



నవతెలంగాణ - కూకట్ పల్లి

పటేల్ కుంట పార్క్‌లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవీ రంగారావు అధికారులకు సూచించారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని పటేల్ కుంట పార్క్‌లో అధికారులతో కలిసి పెండింగ్ పనులను కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ జిమ్ మెయింటెనెన్స్ రెగ్యులర్‌గా చేపట్టాలని, వాకింగ్ ట్రాక్‌లో టైల్స్, టాయిలెట్స్ లో రిపేర్, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ డీఈ జగన్, ఏఈ సంధ్య ,పటేల్ కుంట పార్క్ సభ్యులు చెన్నయ్య, కొండయ్య, రామచంద్రయ్య హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కిల్లర్ జన్మదినం సందర్భంగా ఉచిత వినికిడి పరీక్షలు



నవతెలంగాణ- మల్కాజిగిరి

హెలెన్ కిల్లర్ 144వ పుట్టినరోజు సందర్భంగా జూన్ 26వ నుంచి 29వ వరకు హెలెన్ కిల్లర్స్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ రామకృష్ణాపురం, నేరేడ్‌మెట్ క్రాస్ రోడ్ దగ్గర ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఫౌండర్ అండ్ చైర్మెన్ ఉమర్‌న్ మంగళవారం తెలిపారు. పిల్లలకు ఐదేండ్లు దాటినా మాట్లాడకపోతే తమ క్లినిక్‌ను సంప్రదించాలన్నారు. అలాగే పేద పిల్లలకు 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్య, హాస్టల్ వసతులు కల్పిస్తామని తెలిపారు. పిల్లలను 29వ తేదీలోపు చేర్పించాలన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి

- మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. మంగళవారం బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని టీ.అంజయ్యనగర్‌లో నూతనంగా ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల దృష్ట్యా నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. పజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజా పాషా, ఫయాజ్, ఖలీల్ పాషా, మహబూబ్, భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా ఎమ్మెల్సీ స్పందించారు. వెను వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ప్రజల సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్లు



నవతెలంగాణ - కూకట్ పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ 35 బ్లాక్‌లో ఉన్న, శ్రీ కట్టమైసమ్మ అమ్మ వారి 17 వ వార్షికోత్సవంలో జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, ఆంజనేయులు, దేవాలయ ప్రెసిడెంట్ ఎర్ర లక్ష్మయ్య, పల్లపు బాబు, బీంరాజ్, రాంబాబు, సురేష్ గుప్తా, పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ముందుంటాం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

129 సూరారం డివిజన్ పరిధిలోని నాయి బ్రాహ్మణుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పల్నాటి శివకుమార్ నాయి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షులు పుప్పాల భాస్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ లోని స్మశాన వాటికలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రత్యేక దృష్టి తో దశ దినకర్మ దినాలు క్షవరాలు చేసుకోవడానికి వీలుగా ఏర్పాటు చేసిన షెడ్ విషయమై చర్చించారు. పుప్పాల భాస్కర్ మాట్లడుతూ... ఎమ్మెల్యే కేపీ వివేకానంద సహకారంతో నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ నాయి , బాలవీర్ నాయి, మధునాయి, చంద్రనాయి , కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి



- మేడ్చల్-మల్కాజిగిరి డీఎంఅండ్‌హెచ్ఓ
- పోలీస్ స్టేషన్ల ఎస్ఎస్‌హెచ్ఓలకు లేఖలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి చైర్మెన్ ఆదేశాలనుసారం, జిల్లాలో అల్లోపతి వైద్యం చేస్తూ మందులు రాసుకుంటున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలనీ, నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్ఎంసీ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలకు లేఖ జారీ చేశారు. దీంతో ఎస్‌హెచ్ఓలు ఎఫ్ఐఆర్‌లు బుక్ చేశారు. బోడుప్పల్‌లోని శివ బాలాజీ, కొర్రెములలోని ఆర్ఆర్ ప్రథమ చికిత్స కేంద్రాలను డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ టి.రఘునాథస్వామి తన బందంతో కలిసి సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ రావు, డిప్యూటీ జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి, కీసర డివిజన్, డాక్టర్ శోభన, వైద్య అధికారి, పీహెచ్‌సీ నారపల్లి, పాపాని శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీసు శాఖ, అధికారులు పంచనామా నిర్వహించి, ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేశారు.



కోడి పందెల స్థావరాల పైదాడి

- 3 పందెం కోళ్లు, రూ.39,600 నగదు, 22 కోడి కత్తులు స్వాధీనం
- కేసు నమోదు చేసిన పోలీసులు



నవతెలంగాణ-బోడుప్పల్

గుట్టు చప్పుడు కాకుండా కోడి పందెలు నిర్వహిస్తున్న స్థావరాలపై ఎస్‌వోటీ పోలీసులు, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పలువురు నిందితులను అరెస్టు చేసిన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణ పురం కాలనీలో కొందరు వ్యక్తులు కోడి పందెలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు కోడి పందెలు నిర్వహిస్తున్న స్థలానికి వెళ్లగా అక్కడ కుంచ శివ, కందుల చెన్నయ్య, మేలం వెంకట్ రావు, తన్నీరు హరిప్రసాద్, చిప్ప రాములు, తన్నీరు నరసింహ్మా రావు, వల్లపు శ్రీను, తన్నీరు నరసింహ్మా, మేలం రమేష్, మంతల పోతురాజు, రామశెట్టి శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 పందెం కోళ్లు, రూ.39,600 నగదు, 22 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

టార్గెట్ బాల్ పోటీలకు పల్లవి స్కూల్ విద్యార్థులు



- విజేతలుగా తిరిగి రావాలని ప్రోత్సహించిన స్కూల్ చైర్మెన్ కొమరయ్య

నవతెలంగాణ-బోడుప్పల్

నేపాల్ దేశంలో జరిగే అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని పల్లవి స్కూల్ కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ చైర్మెన్ కొమరయ్య ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9 నుండి 12వ తేదీల వరకు నేపాల్‌లోని ఖాట్మండులో జరగబోవు అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు బోడుప్పల్ కార్పొరేషన్ పల్లవి మోడల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని కొక్కుల మౌక్తిక, పదో తరగతి విద్యార్థి ఆవుల సహర్ష్, సక్కి యశ్ వర్ధన్‌లు ఎంపికైయ్యారని పేర్కొన్నారు. భారతదేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో ఆడటానికి తమ పాఠశాల విద్యార్థులకు అవకాశం లభించినందుకు సంతోషం ఉందన్నారు. అన్ని రకాల ఆటల ఆడే విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిలోని నైపుణ్యం వెలికి తీస్తామని తెలిపారు. టార్గెట్ బాల్ పోటీలలో విజేతలుగా తిరిగి రావాలని విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్లవి స్కూల్ డైరెక్టర్ సుశీల్ కుమార్, ప్రిన్సిపాల్ తనుజలు పాల్గొన్నారు

ఎక్కువ రోజులు నీరు నిలువ లేకుండా చూసుకోవాలి

- ఎంటమాలాజీ సూపర్ వైజర్ డి. నర్సింహులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో కానీ ఇంటి బయట గానీ ఎక్కువ రోజులు నీరు నిలువ లేకుండా చూసుకోవాలని ఎంటమాలాజీ సూపర్ వైజర్ డి. నర్సింహులు అన్నారు. దోమల నివారణ చర్యలో భాగంగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలో అంబీర్ చెరువులోని (ప్రగతి నగర్ చెరువు లోని) కూకట్ పల్లి జోన్ సీనియర్ ఎంటామాలజిస్ట్ సంధ్య సూచనలతో మంగళవారం అంబీర్ చెరువులోని ఎంటమాలాజీ సూపర్ వైజర్ డి. నరసింహులు, సిబ్బందితో కలిసి దోమ పిల్లలను అంతం చేయడానికి ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దష్టిలో పెట్టుకొని ఎక్కడైతే ఎక్కువ రోజులు నీరు నిలువ ఉంటుందో అక్కడ దోమలు గుడ్లు పెట్టి దోమల ఉత్పత్తికి కారణం అవుతాయన్నారు. మురికిగా ఉన్న చెరువులను తనిఖీ చేసి అట్టి చెరువులలో (ఎంఎల్ఓ) ఆయిల్ కానీ, పనికిరాని ఇంజన్ ఆయిల్ కానీ, కిరోసిన్ కానీ, తీసుకొని, గోనె సంచులలో కానీ లేదా ఒక క్లాత్ తీసుకొని(రంపపు) చెక్క పొట్టు పోసి గుండ్రంగా రబ్బర్ బాల్ లాగా తయారుచేసి వాటిని ఒక ప్లాస్టిక్ పెద్ద డబ్బాలో ఎంఎల్ఓ ఆయిల్ పోసి కొన్ని రోజులు నానబెట్టిన తర్వాత ఒక తాడు సాయంతో మురికిగా ఉన్న చెరువు లోకి ఆయిల్ బాల్స్ విడవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ ఒక లేయర్ లాగా ఫామ్ అయి, వెంటనే దోమ పిల్లలు (లార్వలు) చనిపోవడంతో దోమల నియంత్రణ జరుగుతున్నదన్నారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ డ్రమ్ములు గాని, సిమెంటు గోళాలు గాని,నల్ల గుంతలు గాని, పూల కుండీలు గాని, టైర్లు గాని, సంపులు గాని, బిల్డింగ్ పైన ఉన్న ప్లాస్టిక్ సింటెక్స్ లు గాని, పగిలిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు గాని, తాగి పడేసి నా కొబ్బరి బొండాలు గాని ,వారానికి ఒకసారి తనిఖీ చేసి ఎక్కువ రోజులు నిలువ ఉన్న నీటిని తీసివేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటు ద్వారా డెంగ్యూ ఫీవర్, మలేరియా, చికెన్ గునియా, మెదడువాపు, బోధకాలు,తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస కాలనీ ద నెక్స్ అపార్ట్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి , ద నెక్స్ అపార్ట్మెంట్ అసోసియేషన్ ట్రెజరర్ ధర్మారెడ్డి , బ్రహ్మయ్య , బాలాజీ రెసిడెన్స్ అపార్ట్మెంట్ గోపాల్ రాజు , అంబీర్ లేక్ వాకర్స్ తరపున గరికపాటి సాంబశివరావు , ఎంటమాలాజీ సిబ్బంది కే.మురళి, కే.కనకయ్య, కే.మధు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనుల్లో అధికారుల తాత్సారం ఎందుకు?

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులపై వార్డు కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో అభివృద్ధి శూన్యమై పోయిందని, పెండింగ్‌లో ఉన్న పనులను గాలికి వదిలేసి ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అపర్కితంగా ఉన్న పనులను, నాలా పరిశీలనతో పాటు డ్రయినేజీ సమస్యలను పరిశీలించారు. ఈ మేరకు అధికారులతో సమీక్ష సమావేశంలో ఎప్పుడూ లేని విధంగా డివిజన్‌లో గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన నాలా పనుల నిర్వహణలో చేయకుండా నిర్లక్ష్యం వహిస్తు న్నారని, నాలాలో, డ్రయినేజీలు పొంగిపొర్లు తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని.. ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఇకనైనా అధికారులు స్పందించి నాలా పనులు, డ్రయినేజీ, రోడ్ల,, విద్యుత్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బస్తీ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఎస్.ఆర్. నాయక్ నగర్‌లో నివసించే కడిమి దుర్గాప్రసాద్, భార్య, కుమార్తె శరణ్యతో కాలనీ వాసులతో ఎంతో మర్యాదపూర్వకంగా కలిసి మెలిసి ఉండేవారు. దుర్గాప్రసాద్ టీవీ రిపేరింగ్ చేస్తూ.. తన ఏకైక కుమార్తె శరణ్యను చదివిస్తున్నాడు. ఇంతలోనే అనుకోని పరిస్థితులలో కడిమి దుర్గాప్రసాద్ రెండు కిడ్నీలు చెడిపోయి మతి చెందాడు. శరణ్య 9 ,10వ తరగతి ఫీజులు పాఠశాలలో కట్టవలసి ఉంది.ఆర్థిక ఇబ్బందుల వల్ల ఫీజు కట్టలేక 10వ తరగతి క్లాసులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుబ్బల లక్ష్మీనారాయణ తన స్నేహితుడు బొబ్బ ప్రసాద్‌కు ఓ సందర్భంలో తెలియజేశాడు. అదే విషయాన్ని తన అల్లుడు వాసిరెడ్డి గౌతం తన కుమార్తె శశికి తెలియజేయగా... వారు ఆ పాపకు రెండు సంవత్సరాలకు ఫీజులు కట్టడం కోసం డబ్బులు పంపించారు. ఈ మేరకు ఆ డబ్బులను మంగళవారం ఆ పాఠశాలకు వెళ్లి రెండు సంవత్సరాలకు ఫీజులు కట్టారు. మానవత్వాన్ని చాటుకున్న శశి, సహాయపడిన గుబ్బల లక్ష్మీనారాయణ ,పితాని ప్రసాద్ , బొబ్బ ప్రసాద్, వాసిరెడ్డి గౌతం లను కాలనీవాసులు అభినందించారు.

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ పాఠశాల పున ప్రారంభం సందర్భంగా మంగళవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ నిజాంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు కావలసిన మౌలిక వసతులు గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. తరగతి గదులు,గ్రౌండ్ బోర్, స్కూల్ బెంచ్ లు,సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రధానో పాధ్యాయుడు డిప్యూటీ మేయర్‌ను కోరారు.డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం డిప్యూటీ మేయర్ పీఎంశ్రీ నిధులు ద్వారా మంజూరు అయినా సైన్స్ ల్యాబ్ పనులును సందర్శించి నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలని డిప్యూటీ మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రఘునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన కమిటీ సభ్యులు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

దుండిగల్, సారెగూడెం లోని ఆల్కాలిక్ మెటల్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఘన విజయం సాధించిన ఎం.రాము గౌడ్, అతని ప్యానెల్ సభ్యులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ను వారి నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. కంపెనీ అడ్వైజర్లుగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను, జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి ని కమిటీ సభ్యులు, ఉద్యోగులు శ్రీ ఎం.రాము గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శ్రీశైలం గౌడ్ శాలువాతో సత్కరించి, అభినందించారు. కంపెనీ అభివద్ధిలో భాగస్వామ్యం అవుతూ, ఉద్యోగుల సంక్షేమం కొరకు యూనియన్ పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మెన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి యూనియన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎం.రాము గౌడ్, సీనియర్ నేతలు శ్రీనివాస్ రెడ్డి, సదానందం, యాదగిరి, ప్రధాన కార్యదర్శి కె.శంకర్, కమిటీ సభ్యులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కోర్సులు పూర్తయిన విద్యార్థులను క్వార్టర్స్ ఖాళీ చేయించాలి

- జేఎన్టీయూహెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ సభ్యులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నాన్ బోర్డర్లను, కోర్సులు పూర్తయిన విద్యార్థు లను, సమయం అయిపోయిన పరిశోధక విద్యార్థులను వెంటనే క్వార్టర్స్ ఖాళీ చేయించాలని జేఎన్టీయూ హెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ సభ్యులు కోరారు. జేఎన్టీయూ హెచ్ కూకట్ పల్లి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రావు పీఏ జయబాబుకు జేఎన్టీయూ హెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ సభ్యుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్ , గాదే పవన్ కుమార్ మాట్లాడుతూ క్వార్టర్స్ అద్దె సైతం 50 వేల రూపాయల కంటే అదనంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, విశ్వ విద్యాలయ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవటం నిజంగా దారుణమన్నారు. సాధారణ బీటెక్ విద్యార్థులను మాత్రం రూ. 6 వేల కంటే ఎక్కువ హాస్టల్ ఫీజు ఉంటే హాల్ టికెట్లను ఆపుతున్నారన్నారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు కొంత మంది విషయంలో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.కోర్సులు పూర్తయిన వారు విశ్వవిద్యాలయ వనరులను వినియోగించుకోవటం దారుణమని, హాస్టల్స్, క్వార్టర్స్, ఖాళీ చేయించాలని, లేని యెడల రానున్నరోజుల్లో ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళ్యాణ్ , కిరణ్, రంజిత్, శివ, అనీష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి ప్రతీక 'బంగారు తెలంగాణ సంకల్ప శక్తి సేవా ట్రస్ట్'



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మానవసేవే మాధవసేవ అనే భావాన్ని నమ్ము తూ.. కుత్బుల్లాపూర్ బంగారు తెలంగాణ సంకల్పశక్తి సేవ ట్రస్ట్ సేవా భావంతో ముందుకు వెళ్తుంది.. తమదైన శైలిలో సేవా దక్పథాన్ని చాటుకుంది. అందు లో భాగంగా.. మంగళవారం ట్రస్ట్ చైర్మెన్ పంబి శ్రీనివాస్ నాయి, అంబి గణేష్ నాయి ఆధ్వర్యంలో కార్తికేయ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో 68వ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు . వద్దులకు కటింగ్, షేవింగ్ వంటి క్షవర సేవలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా పంబి శ్రీనివాస్...తమ - తమ కుటుంబ సభ్యులకు దూరంగా అనాథాశ్రమాలలో బతుకుతున్న వారికి ఎంతో కొంత సేవ చేయడం తన అదష్టంగా భావిస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ వ్యవస్థాపక అధినాయకులు ఉప్పల భీంరావు, ఉప్పల హనుమంతరావు, ఎస్ రవిబాబు నాయి, నియోజకవర్గం అధినేతలు ఎ.రేనయ్య నాయి, కె.పరమేష్ నాయి, చింతల్ కమిటీ చైర్మన్ నరేందర్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ నాయి, షాపూర్ నగర్ కమిటీ అధ్యక్షులు బండారి దాసు నాయి, బైరి నాయి , ఇతర నాయి సోదరులు పాల్గొని తమ వంతు సేవలను అందించారు.

చిన్నారెడ్డిని కలిసిన పార్ట్ టైమ్ టీచర్లు



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యాక్షులు జిల్లెల చిన్నారెడ్డిని పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిసి ఆరు నెలల వేతనాలు అర్ధాకాలి బతుకులతో యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ పడుతున్న బాధలను విన్నవించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్‌గా మారకుండా గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని వివరించారు. చిన్నారెడ్డి స్పందిస్తూ పార్ట్ టైం టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జానకి రెడ్డి, డాక్టర్ విష్ణు భూపతి ,డాక్టర్ సుందర్, డాక్టర్ సునీల్,డాక్టర్ కర్ణాకర్, డాక్టర్ సుమన్ డాక్టర్ చందు,డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ అమర్, పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టే



నవతెలంగాణ-బంజారాహిల్స్

అత్యవసర పరిస్థితుల్లో ఓ ప్రాణాన్ని కాపాడాలంటే రక్తదానం ఎంతో అవసరం, రక్త దాతలు లేక అనేక ప్రాణాలు అర్ధ ఆయుష్షుగా ముగుస్తున్నాయి. రక్తదానంపై అవగాహన కల్పిస్తూ అనేక రక్తనిధి కేంద్రాలు సైతం ఏర్పాటు చేస్తూ సంవత్సరంలో రెండు నుంచి మూడుసార్లు రక్తదానం చేయచ్చని దీనితో రక్తం సైతం ఉత్పత్తి అవుతుందని నిపుణులు తెలియజేస్తున్న విషయం తెలిసిందే, సోమవారం బంజారా హిల్స్‌లోని ట్రాఫిక్ కానిస్టేబుల్ శంకర్ రామ్ బాల్ విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో కేర్ ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయాలని పిలుపు రావడంతో వెంటనే వెళ్లి రక్త దానం చేశారు. ఏ మాత్రం ఆలోచించకుండా రక్తదానానికి ఒప్పుకొని రక్తదానం చేసి తన వీధి నిర్వహణతో పాటు కర్తవ్యాన్ని నెరవేర్చి శభాష్ అనిపించుకున్నారు. ఉన్నతాధికారులు బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆయనను అభినందించారు.

నిత్య పెండ్లి కూతురిపై రెండో భర్త ఫిర్యాదు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మూడు పెండ్లీలు చేసుకున్న నిత్య పెండ్లికూతురు తప్పుడు ఆరోపణలు చేస్తూ, తనను బ్లాక్మెయిల్ చేస్తున్నదని, తనకు రక్షణ కల్పించాలని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రెండో భర్త బి వెంకటరమణ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం 2010 జూన్ 17వ తారీఖున ఓ జూనియర్ ఆర్టిస్ట్‌ను బి వెంకటరమణ వివాహం చేసుకున్నాడు. అయితే అప్పటికే ఆమె మొదటి భర్తను వదిలి వేసింది. కానీ అతనికి మాత్రం ఇది మొదటి వివాహమని తెలిపింది. తాను సినిమా రైటర్‌గా పనిచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నానని, ఆమె గర్భం దాల్చినప్పుడు గర్భం తీయించాలని, పిల్లల పుడితే ఆమె అందం పాడైపోతుందని గొడవపడి గర్భం తీయించుకుందని ఫిర్యాదు దారుడు ఫిర్యాదు పేర్కొన్నారు. అలాగే అప్పటినుండి ఆమె ప్రతిరోజు భర్తతో గొడవపడి ఆమెను సీరియల్‌లలో పెట్టించాలని, సినిమాలలో అవకాశం కల్పించాలని కోరింది. కొన్ని సీరియల్‌లలో అవకాశం రాగా పని చేసిందని, అదేవిధంగా కొన్ని చిన్న సినిమాల్లో పని చేసిందని, ఆ తర్వాత తనను నిర్లక్ష్యం చేసిందని, ఇతరులతో స్నేహం చేసిందనిరెండో భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు. 2015 లో కోర్టు ద్వారా విడిపోయామని తెలిపారు. ఆ తరువాత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాజేష్‌ను వివాహం చేసుకుందని, అతను ఆమెను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నందున, తిరిగి నా వద్దకు చేరాలని ప్రయత్నం చేసిందని దానికి తాను అంగీకరించలేదని చెప్పారు. తనపై కక్షతో తన మూడో భర్త రాజేష్ పై మధుర నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెడుతూ, తనపై కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఆమె నుంచి తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో వెంకటరమణ కోరాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలి

- ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించండి
- రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా చూడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నగరంలోని అమీర్ పేట్ ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను, ఓపి, ల్యాబ్, ఐసీయూ యూనిట్,మేటర్నిటీ, భోజన శాల వార్డులను, టాయిలెట్, ఆక్సిజన్ యూనిట్, క్యాంటీన్ లను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో, బాలింతలతో కలెక్టర్ ముచ్చటించారు. హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవల గురించి వాకాబు చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో డెలివరీస్ మరిన్ని పెరిగేలా వైద్యులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను నమోదు చేయాలని, ఆరోగ్యశ్రీ కిట్ లను అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి ఆవరణ, భోజన శాల, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. ఆస్పత్రి పని వేళలలో వైద్యులు, సిబ్బంది సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకట్, అమీర్‌పేట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రౌఫ్, సివిల్ సర్జన్ డాక్టర్ దశరథ్, డాక్టర్ మహేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తాజ్ కృష్ణలో సూత్ర ఎగ్జిబిషన్ షురూ

- ఆధునిక సంప్రదాయ మేళవింపు : బినా మెహతా

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆధునిక సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను నగర సోషలైట్ బినా మెహతా మంగళవారం బంజారాహిల్స్ లోని తాజ్ క్రిష్ణాలో ప్రముఖ మోడల్స్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు.. దేశంలోని అనేక నగరాల మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లలను ఒకే వేదికలో తమ వేలాది రకాల ఉత్పత్తులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత జీవనశైలికి అనుగుణమైన ఫ్యాషన్ ట్రెండ్ భారతీయ దుస్తులు, డిజైనర్,వెస్ట్రన్ వేర్,ఇండియన్ అప్పారెల్,హ్యాండ్లూమ్స్,కాస్ట్యూమ్ అండ్ డిజైనర్ జ్యువెలరీ తో పాటు గహెూపకరణాలు,పాదరక్షలు వంటి వేలాది రకాల ఉత్పత్తులు ఒకే వేదికలో ఈ నెల 27 వరకు మూడు రోజుల పాటు సూత్ర ప్రదర్శన కొనసాగనున్నట్టు నిర్వాహకులు ఉమేష్ మాధ్యం తెలిపారు.

పలు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

సీతఫలమండి డివిజన్ పరిధిలోని ఉప్పర్ బస్తీ, మేది బావి,బ్రాహ్మణ బస్తీ ప్రాంతాల్లో అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ సోమవారం పర్యటించారు. పూర్తిగా ధ్వంసమైన సీసీ రోడ్లను పరిశీలించి నూతన రోడ్లకు ప్రపోజల్స్ పంపాలని జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ ని ఆదేశించారు. స్థానికుల నుండి కలుషిత నీరు వస్తుందని కార్పొరేటర్‌కు పలువురు ఫిర్యాదులు చేయగా వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్‌తో తనిఖీలు చేసి మంచి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకొని త్వరగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మైలర్ గడ్డ,వేంకటేశ్వర నగర్,ఇందిరా నగర్ రోడ్ నెం 2 ప్రాంతాల్లో నూతన రోడ్లు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్, బీజేపీ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

దూద్ బాయ్ పాఠశాలకు రోడ్డు మార్గం కల్పించాలి

- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

మెట్టుగూడ, దూద్ బాయ్ పాఠశాలకు సరైన రోడ్డు మార్గం కల్పించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. సర్కార్ బడులను బలోపేతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రభుత్వ బడుల పరిశీలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మెట్టుగూడ, దూద్ బాయ్ లోని ప్రాథమిక పాఠశాలను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూద్ బాయ్ ప్రభుత్వ పాఠశాలకు సరియైన రోడ్డు, అదేవిధంగా ప్రధాన దారి లేకపోవడంతో స్కూలుకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. మరోపక్క సరైన మౌలిక వసతులు లేక తల్లిదండ్రులు ప్రయివేటు స్కూల్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. దాంతో ఫీజుల భారంతో పేద వర్గాల విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేస్తున్నారని తెలిపారు. స్కూలుకు సరైన రోడ్డు మార్గం, ప్రధాన ద్వారం మౌలిక వసతులు కల్పిస్తే బస్తీ పిల్లలంతా చదువుకునేందుకు వీలుంటుందని కావున ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజనం అత్యంత నాసిరకమైనదని... రుచి లేని పప్పు పెడుతున్నారన్నారు. దీంతో అనేకమంది పిల్లలు పోషకాహార లోపానికి గురవుతున్నారని కావున ప్రభుత్వం ప్రభుత్వ బడులలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఆర్ఓ వాటర్, ఏర్పాటు చేయాలని కోరారు. పిల్లలకు సరిపడా తరగతి గదులను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఫీజుల పేరుతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారి ఆగడాలను కట్టడి చేయాలని కోరారు. పార్టీ నాయకులు కొమురెల్లి బాబు, యాదగిరి, చందర్, గౌరీ నాగరాజ్, శ్రీహరి, బిక్షపతి, మల్లేష్ పాల్గొన్నారు.

గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలి

- ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్



నవతెలంగాణ-ఓయూ

గ్రూప్ 2, 3 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఓయూ ప్రధాన లైబ్రరీ దగ్గర మీడియా సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఓయూ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో గ్రూప్-2 గ్రూప్ -3, పోస్టులు పెంచుతామని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహిస్తామని , ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు నియమిస్తామని, జీవో నెంబర్ 46 జీవో నెంబర్ 317కు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచకుండా, డీఎస్సీ పోస్టులు కేవలం 11 వేలకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసి మోసం చేశారన్నారు. వెంటనే నిరుద్యోగులకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక వేదికల పైన నిరుద్యోగ విద్యార్థులు ఓట్లు వేస్తేనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పదేపదే చెప్పున్నారు కానీ వారి సమస్యలు ఎందుకు పరిష్కరించట్లేదని విమర్శించారు. ఇప్పటికైనా నిరుద్యోగుల సమస్యల పరిష్కరించడంలో చొరవ చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచి ఎగ్జామ్ లను నిర్వహించాలని,25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, జీవో నెంబర్ 46, జీవో నెంబర్ 317 ల సమస్యపై శాశ్వత పరిష్కారం చూపాలని,గురుకుల పోస్టుల నియామకాలలో రిలింక్విష్మెంట్ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ప్రభుత్వ ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా, రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులను సమీకరించి దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి, భగత్, నాయకులు రమేష్, మధు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే జైలుకే..

- ఖైరతాబాద్ ఎమ్మార్వో నయూముద్దీన్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఖైరతాబాద్ మండల పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని ఎమ్మార్వో నయుముద్దీన్ హెచ్చరించారు. రహమత్ నగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ లో, పోచమ్మ టెంపుల్ ఎదురుగా గల చర్చి పక్కన ఓ ఇంటి మధ్యగల ప్రభుత్వ స్థలాన్ని పక్కనే నివసిస్తున్న ఎల్లయ్య కబ్జా చేసి మంగళవారం ఇల్లు నిర్మించాలని పనులు చేస్తుండగా విషయం తెలుసుకున్న ఖైరతాబాద్ ఎమ్మార్వో వెంటనే డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్ , రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్, సిబ్బందిని అక్కడికి పంపించి పనులు నిలిపివేయించారు.

ఎమ్మార్వో మాట్లాడుతూ 1993లో రాజీవ్ గాంధీ నగర్‌లో అనేకమందికి అప్పటి ప్రభుత్వం ఒక్కొక్కరికి 50 గజాలు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. అయితే కొంతమంది ఇప్పటివరకు ఇండ్లు నిర్మించుకోకుండా ఉన్నారని, అలాంటివారు ప్రభుత్వ స్థలం ఖాళీగా ఎక్కడ ఉంటే అక్కడ పట్టా ఉందని ఇల్లు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వాస్తవంగా పట్టా ఉన్నవారు ఖైరతాబాద్ ఎమ్మార్వో ఆఫీస్‌కు వచ్చిన ఎడల, పట్టాలు పరిశీలించి వారి స్థలంలో ఇండ్లు నిర్మించుకునేందుకు అనుమతిస్తామని తెలిపారు. తెలిసి తెలియక ప్రభుత్వ స్థలాలలో ఇండ్లు నిర్మిస్తే నష్టపోతారని పట్టాదారులను హెచ్చరించారు.

బీజేపీ ప్రజాస్వామ్య పరిపాలన అందించాలి

- ఓయూ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ



నవతెలంగాణ-ఓయూ

దేశంలో బీజేపీ ప్రజాస్వామ్య పరిపాలన అందించాలని ఓయూ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ కోరారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేండ్లలో ప్రధాని మోడీ బీజేపీ పరిపాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిపాలన కొనసాగించారని... దేశవ్యాప్తంగా ఎంతోమంది పౌర హక్కుల నాయకులను, మేధావులను,అకారణంగా సుదీర్ఘకాలం పాటు జైళ్లలో బంధించారని తెలిపారు. పౌర హక్కులను కాలరాస్తూ భారతదేశ జీవన విధాన విలువలైన భిన్నత్వంలో ఏకత్వం, లౌకిక వాదం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం వంటి విలువలను విస్మరించి, సమాజాన్ని విచ్ఛిన్నం చేసేలా మైనార్టీ మతం పేరు మీద ప్రజలను విభజిస్తూ ఎన్నోవేదికలపై ప్రసంగాలు చేశారని చెప్పారు. రైతుల హక్కుల పోరాటాలపై నిర్బంధాలు, లాఠీ చార్జీలు, విధిస్తూ రైతు సంఘాల నాయకుల పై తీవ్రవాదులనే ముద్ర వేశారన్నారు. అలాగే జీఎస్టీ, నీట్ లాంటివి ప్రవేశ పెట్టి ఈడీ, సీబీఐ వంటి సెంట్రల్ ఏజెన్సీ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను కూల్చారని మండిపడ్డారు. ఓబీసీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించకుండా, పరిశోధనకు అందించాల్సిన ఫెలోషిపులు తీసివేశారని, పెట్రోల్, డీజిల్,నిత్యావసర ధరలు పెరుగుదల వంటిదే కాకుండా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీలను విస్మరించి నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. ఈ దేశ సంపదను కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు ధారాదత్తం చేయడం మోడీ నైజం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పార్థు, అభిలాష్, కళ్యాణ్ ,మహిపాల్ ,భూమన్న పాల్గొన్నారు.

'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదాం'



- కళాయాత్ర లోగోను ఆవిష్కరించిన ఆహ్వాన సంఘం చైర్మెన్, మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

డ్రగ్స్ పట్ల ప్రజలకు, యువకులకు, యువతులకి, విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ప్రజానాట్యమండలి "డ్రగ్స్ నిర్మూలిద్దాం - సమాజాన్ని మేలుకొలుపుదాం" అనే పేరుతో ఎగ్జిబిషన్- కళాయాత్ర నిర్వహించనుంది. ఈ మేరకు మంగళవారం అందుకు సంబంధించిన లోగోను రాష్ట్ర మంత్రి, ఆహ్వాన సంఘం చైర్మెన్ పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు.

అందమైన హైదరాబాద్ నగరాన్ని, ధనికుల పిల్లలు ,సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులు విద్యార్థులు , యువతను, మధ్యతరగతి కుటుంబాలను వారు వీరు అనే తేడా లేకుండా అందరినీ డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తున్నది. ఈ డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టడం కోసం ప్రజానాట్యమండలి యాత్ర నిర్వహిస్తోంది. నగరంలో చదువుకుంటున్న కొంతమంది యువకులు, విద్యార్థులు సిగరెట్‌ను సరదా కోసం తాగి నెమ్మదిగా అలవాటు పడేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది డ్రగ్స్ ను స్టయిల్ కోసం, గొప్పల కోసం తీసుకొని దానికి బానిసలు అవుతున్నారు. విలువైన జీవితాన్ని, కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ప్రభుత్వం డ్రగ్స్ ను ఎంత కట్టడి చేసినా డ్రగ్స్ మాఫియా వివిధ రూపాల్లో వ్యాపారం సాగిస్తూ చివరకు చిన్న పిల్లలు తినే చాక్లెట్స్‌లో డ్రగ్స్ కలిపి వ్యాపారం చేస్తూ చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా దేశ అభివృద్ధి లో ప్రముఖ పాత్ర పోషించవలసిన యువత డ్రగ్స్ మాఫీలో పడి జీవితాలను చీకటిలోకి నెట్టి వేసుకుంటున్నారు

ఈ కళాయాత్ర హై స్కూల్స్ ,జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, కాలేజీల్లో కళారూపాల ప్రదర్శనల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను, యువతను ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం 2024 జులై 1 నుంచి 31 వరకు ఎగ్జిబిషన్స్, ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు కళాయాత్ర తో వివిధ కార్యక్రమాలను నిర్వహించడానికి పూనుకుంది ఈ సందర్భంగా ఆహ్వాన సంఘాన్ని ప్రకటించారు


ఆహ్వాన సంఘం చైర్మెన్ గా పొన్నం ప్రభాకర్, బీసీ వెల్ఫేర్ ట్రాన్స్‌పోర్ట్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు చీఫ్ పాట్రన్స్ గా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ , సినీ గేయ రచయిత అశోక్ తేజ, నటుడు డాక్టర్ మాదాల రవి, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డాక్టర్ నీలిమ, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ జి.యస్ రావు, భారత్ ఇన్‌స్టిట్యూషన్స్ సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి , పట్నం సంస్థ కార్యదర్శి డిజి నరసింహారావు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న, కోశాధికారి డి మహారాజ్‌లను ప్రకటించారు. ఈ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో డీజీ నరసింహారావు, నాగటి మారన్న పి మల్లేష్,పి కళ్యాణ్ డి మహారాజ్ టీ రఘు, సోమేష్, సునీత పాల్గొన్నారు



గాన గంధర్వుడికి ఘన నివాళి

నవతెలంగాణ-బంజారా హిల్స్

ప్రముఖ సినీ గాయకులు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంకు నివాళిగా నగరంలోని మొట్టమొదటి ఏకైక 90'ం మ్యూజిక్ రేడియో స్టేషన్ అయిన మ్యాజిక్ (106.4) ఎఫ్ఎం ఆధ్వర్యంలో ' బాల గాన గంధర్వులు - సీజన్ 4 ' ఫైనల్స్‌ను మంగళవారం నిర్వహించారు.ఈ గ్రాండ్ ఫినాలేకూ ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, ప్రముఖ గాయకులు సాయి చరణ్, హరిణి లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి వారిలో టాప్ 5 కంటెస్టెంట్స్‌ను ఎంపిక చేశారు.బాల సుబ్రమణ్యం జయంతి రోజున మొదలుపెట్టిన ఈ సంగీత పోటీలో కొన్ని వందలమంది 15 ఏండ్లలోపు బాల బాలికలు పోటీ పడ్డారు. పాటల పోటీ ఆద్యంతం జనరంజకంగా సాగింది. తన అద్వితీయ ప్రతిభతో అందరినీ మంత్రముగ్ధుల్ని చేసి విశ్వదత్త విజేతగా నిలిచారు. ఆర్ జే లు నాని,రవళి,ప్రతీక,సంగీత తమ వ్యాఖ్యానంతో అలరించారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ 106.4 ఎఫ్ఎం ప్రతినిధులు ఆర్జే షివ్ ,బద్రినాథ్, ధీరజ్, కృష్ణమోహన్, భవానీ తదితరులు పాల్గొన్నారు.



కళింగలో చేనేత ప్రదర్శన ప్రారంభించిన నటి

నవతెలంగాణ-బంజారా హిల్స్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను టాలీవుడ్ వర్ధమాన నటి తాక్షి చిత్తోపాకర్ నిర్వాహకులు జయేష్ గుప్తాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాలులో కొలువుదీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగి మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతి లో పట్టు,హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదనీ.. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని చెప్పారు. అనంతరం నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ..ఈ నెల 30 వ తేది వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశం లోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బందాలతో తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు,డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ప్రొ. గాలి వినోద్ కుమార్‌కు విద్యా రత్న జాతీయ అవార్డు



నవతెలంగాణ-ఓయూ

విద్యారంగంలో ముఖ్యంగా న్యాయవిద్యలో అనేక సంస్కరణలు తెచ్చి అంతర్జాతీయ స్థాయిలో ఓయూ ఖ్యాతిని పెంచిన ఓయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్‌కు ఇంటర్నేషనల్ ఇన్సానియత్ కిడ్ మత్ అంతర్జాతీయ సంస్థ విద్యారత్న 2024 జాతీయ అవార్డును సోమవారం రాత్రి రవీంద్ర భారతి లో జరిగిన అవార్డు ఫంక్షన్‌లో తెలంగాణ తొలి మానవ హక్కుల కమిషన్ చైర్మెన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య ఇతర పెద్దల చేతుల మీదుగా అందజేశారు. అందుకు ఆ సంస్థ నిర్వాహకులకు ప్రొ. వినోద్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ అవార్డు తన మీద మరింత బాధ్యత పెంచిందని, విద్యా రంగంలో పేద విద్యార్థులను ప్రపంచంతో పోటీపడే సాయికి తీసుకు రావడానికి తన వంతు ప్రయత్నం చేశానని తెలిపారు. ప్రపంచ అత్యున్నత విశ్వవిద్యాలయాలైన కొలంబియా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ హార్వర్డ్ ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించానని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మానవ హక్కులు కుల వివక్షత భారత రాజ్యాంగం అనే అంశాలపై అనేక దేశంలో ప్రసంగాలు చేశానన్నారు. ఓయూ, టీయూ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ స్థాయిలో న్యాయ శాస్త్రంలో పరిశోధన చేస్తున్న విద్యార్థుల నాణ్యత ప్రమాణ ప్రమాణాలు పెంచడానికి ఓయూ న్యాయ చరిత్రలో మొదటిసారిగా డీన్ అవార్డుతో పాటు పీజీ కోర్సుల్లో రెండు కొత్త కోర్సులు హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ క్రిమినల్ లా మూడు డిప్లమా కోర్సులు ప్రవేశపెట్టానని ఇంకా అనేక సంస్కరణలు న్యాయవిద్యలో తెచ్చి ఓయూను అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో సమానంగా పోటీపడే విధంగా విద్యార్థులకు లా స్టూడెంట్ మెరిట్ ఫెస్టివల్ జస్టిస్ ఆన్ వీల్స్ లాంటి వినూత్న ప్రోగ్రామ్స్‌తో పాటు న్యాయవిద్యలో దేశంలోనే మొదటిసారిగా సైన్స్ ఎగ్జిబిషన్ లాగా లా ఎగ్జిబిషన్ కండక్ట్ చేశానని తెలిపారు. ఇది భారతదేశంలో తాను చేసిన మొదటి ప్రయోగమని అన్నారు. తాను ఈ స్థాయికి ఎదగడానికి కారణమైన తన తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు, ఉపాధ్యాయులకు ముఖ్యంగా పేద విద్యార్థులకు స్ఫూర్తిగా ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



మొండా డివిజన్ కుమ్మరిగూడలోని శ్రీ పండితా రాజ్యమరం శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలోని శ్రీ గణపతి శ్రీ సుబ్రహ్మణ్య శ్రీ మహాకాళి శ్రీ మహాలక్ష్మి శ్రీ మహాసరస్వతి, శ్రీ శ్రీ రాజ రాజేశ్వరి దేవి అష్టదశ వార్షికోత్సవ కార్యక్ర మానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో వేద పండితులు, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి సభ్యులు వీరలక్ష్మి, ఎస్ ఎస్ కుమారి ప్రభావతి కమిటీ సభ్యులు విజయలక్ష్మి,విజయలక్ష్మి,రాజేశ్వరి అరుణ,అన్నపూర్ణ,రుక్మిణి, కాంగ్రెస్ నాయకులు శేఖర్ ముదిరాజ్,మహేష్ పాల్గొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట

వీపీ సింగ్ 93వ జయంతి



నవతెలంగాణ-ఓయూ

మాజీ ప్రధానమంత్రి వీపీ సింగ్ 93వ జయంతి సందర్భంగా మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ఈ దేశంలో మొట్ట మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన కులాలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిన ప్రధాని అని అన్నారు. బీసీలు అంతా ఆయనకు ఋణ పడి ఉండాలన్నారు. ఆయన ప్రధాన మంత్రి పదవి పోతున్నదని తెలిసినా, రిజర్వేషన్ అమలుపరిచి బీసీలకు పెద్ద దిక్కుగా నిలిచారన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి రిటైర్డ్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య అంసా ఓయూ అధ్యక్షుడు నామా సైదులు, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, సీఐటీయూ ఉస్మానియా అధ్యక్షులు మహేందర్, ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్, శ్రీను పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఉద్యోగికి పదోన్నతి

- డాక్టర్ ముజీబ్‌కు సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా విద్యాశాఖలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న బదిలీలు, ట్రాన్స్‌ఫర్స్‌లో భాగంగా హైదర్ బస్తీ జీపీఎస్ స్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌కు విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌కు జీహెచ్ఎస్ బండిమెట్‌లో ఫిజికల్ డైరెక్టర్(ఎస్‌ఏ)గా పదోన్నతి కల్పించారు. ఈ పదోన్నతి ఫైల్‌ను ఏడీ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ చారి, జూనియర్ అసిస్టెంట్ ఎస్‌డీ ప్రేమ్ కుమార్ వేణుగోపాల్‌కు సంబంధించిన పదోన్నతి ఫైల్‌ను ప్రాసెస్ చేయగా.. డీఈవో ఆర్.రోహిణి ఆమోదం తెలిపారు. డాక్టర్ ముజీబ్ కృషితో ఈ పదోన్నతి లభించడంతో మంగళవారం టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా సహాధ్యక్షులు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్ కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.డేవిడ్, కోశాధికారి ప్రేమ్ కుమార్ వారి కార్యవర్గంతో పాటు ఈసీ ముజాహిద్, జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు సమక్షంలో మంగళవారం సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్)కి బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ నేత లు డీఈవో రోహిణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షులు పర్వతాలు, కొండల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జిల్లా సెక్రటరీ విక్రమ్ కుమార్, ట్రెజరర్ బాల్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖలేద్ అహ్మద్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ మెంబర్లు శంకర్, శ్రీధర్, ముఖీద్, పీఆర్వో జాహంగీర్, ఏపీఆర్వో వహీద్, వారి కార్య వర్గంతో పాటు మాజీ సెక్రటరీ ప్రభాకర్, ఈఎన్‌టీ రాజు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సోహేల్ అహ్మద్, ఫయాజ్ , యోగి, లక్ష్మి పతి, సూర్య, పనీల్ పరమేష్, దామోదర్, ఖలీల్, ఇస్మాయిల్, నాగమణి పాల్గొన్నారు.



సమర్థుడైన అధికారి అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

- అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో బాగా పనిచేశారు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మంచి నైపుణ్యంతో, అందరినీ సమన్వయం చేసుకుంటూ మంచి పనితీరుతో సమర్థుడైన అధికారిగా పాటిల్ హేమంత కేశవ్ పేరు తెచ్చుకున్నారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. హైదరాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) పాటిల్ హేమంత కేశవ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లిన సందర్భంగా కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన ఏకైక వ్యక్తి హేమంత్ కేశవ్ పాటిల్ అని, నల్గొండ జిల్లా నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా చేశారన్నారు. సూర్యాపేట అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్‌గా సమర్థవంతంగా పని చేశారని కలెక్టర్ గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా(రెవెన్యూ) పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సికింద్రాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మంచి నైపుణ్యంతో, అందరిని సమన్వయం చేసుకుంటూ అద్భుతంగా పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో, భూ ఆక్రమణల నివారించడంలో సమర్థవంతంగా పనిచేసి మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం పాటిల్ హేమంత కేశవ్‌కు శాలువా కప్పి.. పూల బొకేతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాటిల్ హేమంత్ కేశవ్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్, డీఆర్వో వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు యాదయ్య, ఆశన్న, కోటజీ, కలెక్టరేట్ ఏవో సదానందం, రాములు, జహీరుద్దీన్, తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో డబ్ల్యూపీపీ సంస్థ సికింద్రాబాద్ చారిటీ ఈవెంట్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ, స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మారెడుపల్లి డిప్యూటీ ఐవోఎస్ మదన్ మోహన్ రెడ్డి హాజరై మాట్లాడారు. పేద పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలకు సహాయ పడుతున్నందుకు డబ్ల్యూపీపీ సంస్థని అభినందించారు. మరిన్ని స్కూళ్లకు సహాయపడాలని ఆయన కోరారు. విద్యార్థులు డబ్ల్యూపీపీ వారు ఇచ్చిన వాటిని సక్రమంగా ఉపయోగించుకొని బాగా చదువుకోవాలన్నారు. మీరంతా డొనేషన్ ఇచ్చే స్థాయికి ఎదగలన్నారు. డబ్ల్యూపీపీ సెక్రటరీ ప్రిన్స్, సుధాకర్, సభ్యులకు పాఠశాల, ఉపాధ్యాయుల, విద్యార్థుల తరుపున ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీపీ సెక్రటరీ ప్రిన్స్, జనరల్ సెక్రటరీ సుధాకర్, టీచర్లు మల్లీశ్వరి, నాగశృతి, స్ఫూరా పాల్గొన్నారు.

అన్ని జీపీల్లో ప్రత్యేక మహిళా గ్రామసభలు

- మేడ్చల్-మల్కాజిగిరి డీఆర్డీఓ సాంబశివరావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్ర మాల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ ల్లో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రామ సభలు నిర్వహించినట్టు మేడ్చల్-మల్కాజిగిరి డీఆర్డీఓ సాంబశివరావు తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టంలో భాగంగా ఈ గ్రామ సభలు నిర్వహించామనీ, ఇందుకు జిల్లా వ్యాప్తంగా అనూహ్యమైన స్పందన వచ్చినట్టు వారు తెలిపారు. ఈ గ్రామసభలకు గ్రామపంచాయతీల్లో మహిళా సం ఘం సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు అధిక మొత్తంలో హాజరైనట్టు తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఎజెండా అంశాలుగా కొన్నింటిని తీసుకున్నారు. ఇప్పటి వరకు సంఘంలో లేని మహిళలను గుర్తించడం, వారిని సంఘాల్లో చేర్పించడం, మైక్రో ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్‌ను గుర్తించి వాటిని ప్రోత్సహించడం, కుట్టు కేంద్రాల ఏర్పాటు, పాడి పరిశ్రమ ఏర్పాటు, పౌల్ట్రీ, మదర్ యూనిట్ల ఏర్పాటు, మిల్క్ పార్లర్లు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ మహిళా క్యాంటీన్లు, కుట్టు కేంద్రాల ఏర్పాటు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వంటి తదితర యూనిట్లను ఎంపిక చేయడానికి ఈ గ్రామ సభలు నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మహిళా శక్తి కార్యక్రమం కింద జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించడంలో సఫలీకతులమయ్యామని తెలిపారు. రెండో జత బట్టలు కూడా కుట్టడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మహిళా క్యాంటిన్లను ప్రోత్సహిస్తూ సచివాలయంలో రెండు క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే అందులో ఒకటి మేడ్చల్-మల్కాజిగిరి మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయడం ఒకింత జిల్లాకు గుర్తింపు అని చెప్పారు. పబ్లిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్స్, హాస్పిటల్స్, టూరిజం ప్రాంతాలు, ఆలయాలు, ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా సఫలీకతం అవుతాయని తెలిపారు. పూర్తిగా మహిళతో నిర్వహించబడే ఈ స్టాల్స్‌కు ఆదరణ లభిస్తుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. ఈనెల వరకు స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి లబ్దిదారులను గుర్తించడం పూర్తిచేసి జులై నుంచి గ్రౌండింగ్ చేయడానికి తగు ప్రణాళికలు తయారు చేస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన సంఘాలు సభ్యులకు గుర్తించి వారిని గ్రూపుల్లో చేర్పించడం, బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేయడం, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం, పుస్తకాల నిర్వహణకు బుక్ ఈ పర్సన్ గుర్తించి వారిని ట్రైనింగ్ పూర్తి చేయడం, ఇవన్నీ 100 రోజుల కార్యచరణ ప్రణాళికల్లో భాగంగా చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇంకా 1948 మందిని సభ్యులుగా గ్రూపుల్లో చేర్పించడానికి టార్గెట్‌గా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 16 మీ సేవా కేంద్రాలు మహిళా శక్తిలో భాగంగా మహిళా సంఘం సభ్యులతో ఏర్పాటు చేయించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో గల 118 వీవోల సభ్యులకు 2,613 యూనిట్లను 3,013 మంది సభ్యులకు ఇప్పించడానికి తగు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు.



మహారాజశ్రీ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో సూర్యాపేట నందు
I.A.NO. 75 of 2024
IN
O.S.NO. 08 of 2024

మధ్యన : వి.యల్. బి. కేసరి (వెలమకన్ని లక్ష్మి బ్రహ్మానంద కేసరి)

.....పిటిషనర్/ వాది

మరియు

శెనగాని రాంబాబు మరియు ఇతరులు,

...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

టు

పేర్ల జ్యోతి, భర్త పాపయ్య, వయస్సు.47 సం..లు, వృత్తి : గృహిణి, నివాసం, బి-7, ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, కొంపల్లి, కుతుబ్దుల్లాపూర్, హైదరాబాద్. (ప్రతివాది నెం. 9)

నోటీసు

పైన తెలిపిన వాది మీ పై వేసిన పిటిషన్ I.A.NO. 75 of 2024 తేదీ. 02.08.2024న కోర్టులో వాయిదా కలదు. ఇట్టి పిటిషన్ నోటీసులు మీకు పలుమార్లు పంపిననూ ఉద్దేశపూర్వకంగా తామీలు కాకుండా చేయుచున్నందున ఇట్టి ప్రకటన ఇవ్వనైనది.

కావున మీరు తేదీ. 02.08.2024 ఉదయం 10.30గం..లు తదుపరి పై కోర్టు నందు ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కాని ఎడల పిటిషన్‌ను ఏకపక్షముగా తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారముగా)

ఇట్లు
వి. వెంకటేశ్వరరావు,
మేడిగ ఈశ్వర్‌కుమార్,
అడ్వకేట్స్, సూర్యాపేట.
సెల్ : 9848198660

మహారాజశ్రీ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో సూర్యాపేట నందు
O.S.NO. 08 of 2024

మధ్యన : వి.యల్. బి. కేసరి (వెలమకన్ని లక్ష్మి బ్రహ్మానంద కేసరి)

..... వాది

మరియు

శెనగాని రాంబాబు మరియు ఇతరులు,

... ప్రతివాదులు

టు

పేర్ల జ్యోతి, భర్త పాపయ్య, వయస్సు.47 సం..లు, వృత్తి : గృహిణి, నివాసం, బి-7, ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, కొంపల్లి, కుతుబ్దుల్లాపూర్, హైదరాబాద్. (ప్రతివాది నెం. 9)

పైన తెలిపిన వాది ప్రతివాదులపై ఇన్‌జంక్షన్ దావా వేసి ఉన్నారు. పైన తెలిపిన దావాపై కోర్టు నందు తేదీ. 02.08.2024న కలదు. మీకు (ప్రతివాది నెం.9) పలుమార్లు సమన్లు పంపిననూ ఉద్దేశపూర్వకంగా తామీలు కాకుండా చేయుచున్నందున ఇట్టి ప్రకటన ఇవ్వనైనది.

కావున మీరు తేదీ. 02.08.2024 ఉదయం 10.30గం..లకు పై కోర్టు నందు ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కాని ఎడల కేసును ఏకపక్షముగా తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారముగా)

ఇట్లు
వి. వెంకటేశ్వరరావు,
మేడిగ ఈశ్వర్‌కుమార్,
అడ్వకేట్స్, సూర్యాపేట.
సెల్ : 9848198660

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client is intending to purchase the schedule of property from Smt Vijaya Laxmi Agarwal W/o Sri Late Suresh Kumar Agarwal, aged about 57 years, Occ: Home maker, R/o: 6-4-454/3, Bholakpur, Secunderabad. Hence the Notice is hereby given to general public that if any person/s, entity company, firm, institution (corporate or otherwise) has or claims any right, title, interest, pending litigation, tenancy, mortgage. charge, lien or demand or any other interest of Whatsoever nature in or upon the schedule property or any part thereof, the same may be brought to the notice of the undersigned in writing together with all details and documents in support of such claim within 14 (Fourteen) days from the date of this notice, failing which, it shall deemed that the aforesaid owner has a clear and marketable title to the schedule property and that none else has any right, title, interest, or claim whatsoever, in respect of the Schedule property and our client would be at liberty to proceed to complete the transaction in respect of the Schedule Property. Any objections and/or claims received after the expiry after the period mentioned above shall neither be entertained nor be binding on my client.

Schedule Property

All the parcel of land with address: Plot No. 142/D, admeasuring about 272.36 Sq Yards, lying and situated with Plot Number 6-4-454/3 in Survey No. 21 at bholakpur, Secunderabad, Hyderabad, Telangana, India 500080 under Police Station Gandhinagar, Registration Sub-District Secunderabad, in the district of Hyderabad, more fully and particularly described in the schedule here under

North : By Neighbor's House. South : By Neighbor's House. East : By 25'0" Wide Road. West : By Neighbor's shed.

V. Venkata Mayur, Advocate
Advaith Law Firm
H.No.3-4-512/81, Flat No.501,
Adarsh Apartments, Barkatpura,
Hyderabad - 5000027. Cell : 9848040831

IN THE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT:: AT: MALKAJGIRI
I.A No.249 OF 2024
In
O.S.No.604 OF 2022

BETWEEN:

Kachireddy Munni

...Petitioner/Plaintiff

AND

M.Venkat Reddy & Others

..Respondents/Defendants

To

Katpelly Neeraja, W/o.VinodReddy R/o.Flat No.405, Sri Ganga Residency, Nallakunta,Hyd-44

...Proposed Respondent/ Defendant no.8

Whereas the above named Petitioner/Plaintiff has filed the above IA No.249 of 2024 to implead you as the Defendant no.8 in the suit filed by the Petitioner/ Plaintiff against the Respondents /Defendants for Declaration and Recovery of Possession in respect to that part and parcel of open Plot No.62 & 63 admeasuring 400 Sq. yds., or 334.4.sq.mts.,in Sy.No. 54 situated at Kachivani Singaram Village, Ghatkesar Mandal, Ranga Reddy District. The same is stand posted **on 18-07-2024** for your appearance **at 10-30 A.M** before this Hon'ble Court, either in person or through an advocate duly instructed by you, failing which the matter will be decided on merits, by setting you exparte.

//BY ORDER OF THE COURT//
M.DEEPIKA REDDY
ADVOCATES
Flat No.401, TULIP SIRI
H.No. 16-2-751/55/21, GA-2, SBH Colonies, Gaddiannaram,
Saidabad, Hyderabad-60
Telangana

CHANGE OF NAME

I, **GURRAM JAYAMMA, W/o. G.Buchi Reddy**, aged about 70 year Occ: Housewife, R/o. H-No.1-22, Laxmidevigudem Village, Raghavapuram Post, Bibinagar Mandal, Yadadri Bhongir Dist., That I submit that in passport bearing No.**A6849408**. In this Passport my name wrongly mentioned as **SAILAMMA** instead of **GURRAM JAYAMMA** as per my Aadhar card bearing No.9772 0423 3540 my name is RECORDED AS GURRAM JAYAMMA So the higher authorities please to consider my correct name as **GURRAM JAYAMMA**

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, AT: HYDERABAD
O.S.NO.158 OF 2024

Mohammed Iqbal Ali, S/o.Late Mohammed Ibrahim Ali, aged about 53Yrs,Occupation:Business, R/o.H.No.9-4-77/A/135, Al Hasnath Colony, Hyderabad-500006,

...Plaintiff

AND

Syed Sajjad S/O Late Khaja Ali Aged about 60Yrs ,Occupation: Business R/o.H.No.9-4-77, A/230, Al Hasnath Colony, Tolichowki, Hyderabad-500008

...Defendant

Please take notice that the above Plaintiffs herein have filed the above suit for Perpeptual Injunction against Defendant. Now the above matter is stand posted **to 26-07-2024** for appearance of the Defendant **at 10:30 AM** either in person or through advocate before the Hon'ble court failing which the matter will be decided as per law.

//BY THE ORDER OF THE COURT//
S.M.M.HUSSAIN ,
ADVOCATE
Office 8-1-366/B/5, Janaki Nagar,
Tolichowki, Hyderabad..
Cell No. 9700313267

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT. AT: RAJENDRANAGER.
O.S.NO.134 of 2024.

Between:

1.Jahid Firoz Bhai Tejani S/o.Late Firoj Bhni Tejani, Aged about 41yrs, Occ: Business, R/o.H.No. Flat.No.204, Upparpally. Attapur, R.R.Dist, T.S.
2.Roshan Asif Manjiyani D/o.Late Firoj Bhai Tejani, Aged about 47yrs, Occ: Household, R/o.H.No. 2-4-46, Fint No.203, Palace-C, Happy homes Towers, UpperPally, Pillar No.184, Attapur, R.R.dist.
3.Thakkar Samiraben Amithhai D/o.Late Firoj Bhai Tejani, Aged about 45 yrs, Occ: Household, R/o.H.No.Juna-2, Maliya, Bhara Nagar, Bhavnagar, Takshteshwar, Gujrat Sate.

...Petitioners/Plaintiffs

AND

The Thasildar & All Concerned

...Defendants

To,
All Concerned

...Defendants

The above named plaintiff's filed the above suit for the relief of declaring the palintiffs as the only egal heirs of decesed Late Firoj Bhai Tejani, as such anybody has got any Objection or claim may appear before the Hon'ble Court **on 25/07/2024 at 10.30 am** either in person or through pleader, otherwise the matter will be cecide according to law.

//BY ORDER OF COURT//
ADVOCATE
MIRZA SULEMAN BAIG
ADVOCATE & ASSOCIATES
#12, 3rd Floor, Sanall Mall Complex, Opp. Chermas Grammar School, Abids, Hyderabad-500001.
Cell: 9701122545

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE :: MEDCHAL-MALKAJGIRI DISTRICT :: AT:MALKAJGIRI
O.S.NO.226 OF 2021

Between:

Gummadi Tejesvi @ Tejaswni

...Plaintiff

AND

Gummadi Nitin Reddy and Others

...Defendants

To,
Babita Devi, (Defendant No.16) Wife of Kameshwar Singh, Aged about 41yrs, Resident of Flat No. 211, Mary Gold Block, ARKHomes, Bolaram, Alwal, Secunderabad.

Madam,

Take notice that the Plaintiff herein has filed the above referred suit for partition, separate possession and perpetual injunction. In the said suit you are arrayed as party Defendant No.16 wherein you are required to enter appearance personally or through duly instructed counsel **on 04-07-2024 at 10:30 A.M.** in the court. On your failure to appear on the said date you will be set ex-partee and the matter will be decided in your absence.

(By order of the Court)
Sri.S.Balchand
Sancheti Deepak Aditya Lalwani
Advocates
M/s.S.Balchand Deepak &Co.
Advocates &Solicitors
3-5-1/5, Eden Garden Road
Ramkote, Hyderabad-500 001
Ph.No. 040 24750759
Mobile No. 98480 95336

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా కూకట్‌పల్లి దవీందర్ కుమార్ గారు మరియు అతడి యొక్క భార్య ప్రొద్దుటూరి మాధవి గారు నా యొక్క క్లయింట్స్ అయినటువంటి ఎల్.ఐ.సి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిని రుణ సదుపాయం కోసం ఇంటి నెం.13-7-110/1 (పాత నెం.7-110/1), (పిటిఐఎన్ నెం.1039904901), ప్లాట్ నెం.37, విస్తీర్ణం 306.00చ.గ. సర్వే నెంబర్లు 39 నుండి 42, మాధురాపురి కాలనీ, గడ్డిఅన్నారం గ్రామం, జీహెచ్ఎంసి పరిధి, సరూర్‌నగర్ సర్కిల్ మరియు మండలం, రంగారెడ్డి జిల్లా ఆస్తిని సెక్యూరిటీగా ఉంచి రుణాన్ని పొందాలని భావిస్తున్నారు. ఇందుమూలంగా వారి ద్వారా రిప్రెజెంట్ చేసిన విషయం ఏమిటంటే ఒరిజినల్ సేల్ డీడ్ తేది:02-03-1985, డి.ఆర్., రంగారెడ్డి జిల్లా ఎదుట డాక్యుమెంట్ నెం.1659/1985 ద్వారా రిజిస్టర్ చేయబడిన బి.లక్ష్మమ్మ పేరిట ఎగ్జిక్యూట్ చేయబడిన ఏ.లలిత పేరిట ఉన్న డాక్యుమెంట్ దిల్‌సుఖ్‌నగర్ వద్ద జిరాక్స్ తీసుకునేందుకు వెళ్తున్న క్రమంలో పోయినది. సదరు డాక్యుమెంట్ ఎంతగా వెదికినా లభ్యం కాలేదు. ఇందుమూలంగా ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులకు పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించి లేదా సంబంధిత రుణ లావాదేవీకి సంబంధించి ఎలాంటి అభ్యంతరాలైనా లేదా హక్కు ఉన్నట్లయితే దయచేసి దిగువ సంతకందారును ముఖదస్తు అనుమతిని పొందిన అనంతరం ఉ.గం.10-30 నుండి సా.గం.5-00 లోపు అన్ని రకాల సంబంధిత డాక్యుమెంట్లతో పాటుగా ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 15 రోజుల్లోపు సంప్రదించాల్సిందిగా కోరడమైనది. ఎవరైనా వ్యక్తి/ వ్యక్తులకు సంబంధిత పోయిన పేపర్లు దొరికినట్లయితే, దయచేసి దిగువ సంతకందారును సంప్రదించి అప్పగించాల్సిందిగా కోరడమైనది. పైన పేర్కొన్న నిర్దిష్ట గడువు ముగిసిన తర్వాత వచ్చే ఏవైనా అభ్యంతరాలు/ హక్కులు పరిగణించబడవని తెలియజేయడమైనది మరియు నా యొక్క క్లయింట్స్ రుణ లావాదేవీని నిర్వహిస్తారని తెలియజేయడమైనది.

సం/-
(జి.వెంకటసుబ్బయ్య)
అడ్వకేట్
ఆఫీస్ నెం.221, రెండో అంతస్తు, కుబేరా టవర్స్, నారాయణగూడ, హైదరాబాద్-29.
సెల్: 9866573130

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER COMMISSION-II,AT:HYDERABAD
EA.NO.17/2024
IN
CC NO.858/2009

Between:

Smt.K.Shobha, Krishna Reddy, Aged about 36yrs, Occu: NRI, Presently residing at Chicago USA, Permanently residing at H.No.2-3-677/1, Road No.3, Sai nagar Colony GSI Post, Nagol Hyderabad Rep.Through her Father Mr.K.Mohan Reddy.

...PETITIONER/COMPLAINANT

And

1.M/s Prestige Avenue Ltd Rep.By its Managing Director MR. Mandava Venkateswara Rao
2.M.Venkateshwara Rao,Managing Director, Prestige Avenue Pvt Ltd, having its registered office located at4th Floor, Tirumala Estates 3-6-262, Himayatnagar, Hyderabad, Telangana-500029
3.Sri.Bachala Veeranna Raja, Director
4.Annavarapu Hari Hara Nath, Director
5.Sri.Mandava Venkata Lakshman Kumar, Director
6.Sri.Nallam Chanukya, Director
7.Sri.Pathi Raj Gopal, Director
8.Sri.Shimoga Gopalakrishna Ramesh Babu, Director
Respondents No.3 to 8 are residents of 4th Floor, TirumalaEstates 3-6-262, Himayatnagar, Hyd, Telangana-500029

...RESPONDENTS/OPP.PARTIES

In obedience to the directions of the Hon'ble District Consumer Commission -II, Hyderabad in EA No.17/ 2024 dated 10-06-2024 directed the Petitioner to get the Notice published in the local edition of Nava Telangana News paper, and accordingly the publication is being made. The matter now stands posted **to 02-07-2024**, for Respondents appearance either in person or through a counsel. If you fail to appear, the Hon'ble Commission may pass appropriate orders by setting you as exparte.

//BY ORDER OF STATE COMMISSION//
Counsel for Appellant
A.Naveen Kumar
15-93, Kodandaramnagar
Dilsukhnagar, Hyderabad
Cell:9700380730, 9440234117

IN THE COURT OF HON'BLE II ADDITIONAL JUNIOR CIVI JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT AT :: MALKAJGIRI
O.S.No. 506 OF 2024

Between:-

Myathari Balakistaih and others

...Plaintiffs

AND

The Tahsildar Keesara and another

...Defendants

To,
ALL CONCERN

The Plaintiffs filed the above suit seeking the Declaration to Declare the Plaintiffs are the legal heirs of the deceased Maitri Shantha, before the **Hon'ble II ADDL.JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI AT : MALKAJGIRI IN O.S.NO.506 OF 2024** and the same is posted on **10.07.2024 at 10.30 AM** for any objections from all the concerned. That in case of no objections received before the above said Hon'ble court, the matter will be decided on merits.

// By order of Hon'ble court //
Sd/-
V. BAPI REDDY B.A., LL.B.
ADVOCATE
H.No. 3-72, Godhumakunta (V),
Keesara (M),
R.R. Dist.,
Pin Code: 501301.
Cell: 9505778778

మహారాజశ్రీ మోటార్ అక్సిడెంట్స్ క్లెయిమ్ ట్రిబ్యునల్ (I - ఎడిషనల్ డిస్ట్రిక్ మరియు సెషన్ జడ్జి) ఖమ్మం
MAT O.P.NO. 91/2024

పిటీషన్

తేడబోయిన మహేష్ ...క్లెయిమ్ పిటిషనర్

మరియు

1. దొడ్డి ఆశోక్ కూమర్
2. దుబుర్క నరసింహా రావు
3. చోళ జనరల్ అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వీరి తరుపున వీరి బ్రాంచ్ మేనేజర్, ఖమ్మం

...రెస్పాండెంట్స్

టు

రెస్పాండెంట్ నెం.1

దొడ్డి ఆశోక్ కూమర్, తండ్రి : కృష్ణ,వయస్సు: 38, వృత్తి : డ్రైవర్ ఆఫ్ లారీ బెరింగ్ నెం TS30-T-3473, నివాసం : ఇంటి.నెం. 1-7-837, మోహాన్ నగర్ (ఫ్రెండ్స్ కాలనీ, రామ్ నగర్, హైదరాబాద్

రెస్పాండెట్ నెం. 2

దుబుర్క నరసింహారావు, తండ్రి: రాములు, వయస్సు : అడల్ట్ ఓనర్ ఆఫ్ లారీ బెరింగ్ నెం. TS30-T-3473, నివాసము చౌటుప్పల్ భువనగిరి యాద్రాద్రి జిల్లా, నివాసం:ఇంటి.నెం 1-7-837, మోహాన్ నగర్, ఫ్రెండ్స్ కాలనీ, రామ్‌నగర్, హైదరాబాద్

నోటీసు

పైన తెలిపిన క్లెయిమ్ పిటీషనర్ మీపై మోటార్ అక్సిడెంట్ క్లెయిమ్ రాబట్టుకొనుటకై పైన తెలిపిన కోర్టు(మహారాజశ్రీ మోటార్ అక్సిడెంట్స్ క్లెయిమ్ ట్రిబ్యునల్ (I -ఎడిషనల్ డిస్ట్రిక్ మరియు సెషన్ జడ్జి) ఖమ్మం నందు MATOP నెం. 91 ఆఫ్ 2024 దాఖలు చేసియున్నారు. అట్టి OP లో మీ హాజరు కొరకు ది.15-07-2024న వాయిదా ఉండి వున్నది. కావున ఆ రోజు మీరు స్వయముగా కాని లేక మీ తరుపు న్యాయవాది ద్వారా కాని జవాబు చెప్పుకోనుటకు పైన తెలిపిన కోర్టు యందు ఉదయం 10:30 ని.లకు హాజరు కాగలరు లేని ఎడల మీ పరోక్షములో తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో//
మేకల నవీన్ కూమర్
యర్ర జ్ఞానేష్
న్యాయవాదులు,
ఖమ్మం | ఖమ్మం
తేది.24-06-2024 | సెల్: 9959594084

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER COMMISSION-II,AT:HYDERABAD
EP.NO.18 /2024
IN
CC.NO.859/2009

Between:

1.Sri K.Mohan Reddy S/o. K.Narayana Reddy Aged about 66yrs, Occ: Retd. Teacher,
2.Smt V.Kavitha, W/o.V.Goverdhan Reddy Aged about 28yrs, Occ:NRI Presently residing at Sandiago, USA Permanently both are R/o. H.No.2-3-677/1, Road No.3, Salna gar Colony, GSI Post Nagole, Hyd-68, Being an NRI, Rep. through, her father Mr.K.Mohan Reddy,

..PETITIONERS/COMPLAINANTS

And

1.M/s Prestige Avenue Ltd Rep. By Its Managing Director, MR. Mandava Venkateswara Rao
2.M.Venkateshwara Rao, Managing Director, Prestige Avenue Pvt Ltd, having its registered office located at4th Floor, Tirumala Estates 3-6-262, Himayatnagar, Hyderabad, Telangana-500029
3.Sri.Bachala Veeranna Raja, Director
4.Annavarapu Hari Hara Nath, Director
5.Sri.Mandava Venkata Lakshman Kumar, Director
6.Sri.Nallam Chanukya, Director
7.Sri.Pathi Raj Gopal, Director
8.Sri.Shimoga Gopalakrishna Ramesh Babu, Director Respondents No.3 to 8 are residents of 4th Floor, Tirumala Estates 3-6-262, Himayatnagar, Hyderabad, Telangana-500029

...RESPONDENTS/OPP.PARTIES

In obedience to the directions of the Hon'ble District Consumer Commission-II, Hyderabad in EA No.18/ 2024 dated 10-06-2024 directed the Petitioner to get the Notice published in the local edition of Nava Telangana News paper, and accordingly the publication is being made. The matter now stands posted **to 02-07-2024,** for Respondents appearance either in person or through a counsel. If you fail to appear, the Hon'ble Commission may pass appropriate orders by setting you as exparte.

//BY ORDER OF STATE COMMISSION//
Counsel for Appellant
A.Naveen Kumar
15-93, Kodandaramnagar
Dilsukhnagar, Hyderabad
Cell:9700380730, 9440234117

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: AT: HYDERABAD
O.S.No.2337 of 2024

Between:

1.SMT.PARUPALLI SITARAM
2.SMT.AMRITA PARUPALLI

...Plaintiffs

AND

1.The Tahsildar, Mandal Revenue office, Himayat Nagar,Hyd-29, T.S.
2.To Whomsoever it may ever concern

...Defendants

NOTICE

The above-named Petitioners have filed suit for declaration, to declare the Plaintiffs as legal heirs of Late Sri.Parupalli Seetharam. The Plaintiffs are wife and daughter and are the only legal heirs to Late Sri. Parupalli Seetharam. In this regard the Hon'ble court posted the above O.S. 2337/2024 **on 15-07-2024 at 10:30 A.M.** If anybody have got any objection for grant of the above relief in favour of the Plaintiffs, they may file their objections before the Hon'ble court on the said date. Hence the concern hereby informed to appear before the said court either person or through an advocate, failing which the case will be heard determined exparte.

(BY ORDER OF THE COURT)
M/s.SUDHEER LINGALA,
A.SATYAVATHI,
Advocates
13-6-457/1, Pulipathi Complex,
Gayathri Nagar, Shiv Bhag
Gudimalkapur,HYDERABAD
Pho: 9391062216

IN THE COURT OF THE HON'BLE III ADDL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: LB NAGAR
O.S.NO.1132 OF 2022

Between:

Kavali Yadamma, w/o Kavali Shankaraiah. Aged about 50 yrs, Occ: Agriculture, R/o H No.1-74, Hamidullanagar Village, Shamsha bad Mandal, Ranga Reddy District, Telangana-501 218.

...Plaintiff

And

1.Mali@ Totla Narsimha, s/o Late Mali Chandrajah, Aged about 52yrs, Occ: Agriculture.
2.Mali Totla Sathaiah, S/o.late Mali Chandraiah, Aged about 45yrs, Occ: Agriculture,
3.Mali @ Totia Jayamma, W/o Late Mali Yadaiah. Daughter-in-law of Late Mali chandraiah. Aged about 42yrs, Occ: Agriculture,
4.Mali @ Totla Srikanth, S/o Late Mali Yadaiah, Aged about 22 yrs, Occ: Agriculture,
5.Mali@ Totla Sridevi, D/o Late Mali Yadaiah, Aged about 20 yrs, Occ: Nil, All the Defendant No. 1 to 5 are R/o H No.2-45, Nagaram Village, Maheshwaram Mandal, RR District.
6.K.Srilatha, w/o K.Srinivas D/o Late Mali Yadaiah, aged about 24yrs, Occ: Housewife, R/o.H No. 4-64, Nandupalli Village, Mahesh waram Mandal, RR District,
7.M/s.K.Venkata Raju Projects Pvt. Ltd., Rep.by its MD, Sri T.Kishore Kumar, s/o T.Poorna ChandraRao, Aged about 57 yrs, Occ: Business, R/o Road No.3, Banjara Hills, Hyd
8.Sri.T.Rakesh Reddy s/o T.Rani Reddy, Aged about 50yrs, Occ: Business, R/o Plot No.65/A, Road No.14, Film Nagar, Jubilee Hills, Hyderabad,

...Defendants

To.

M/s.K.Venkata Raju Projects Pvt. Ltd., Rep.by its MD, Sri T.Kishore Kumar, s/o T.Poorna Chandra Rao, aged about 57yrs, Occ: Business, R/o Road No.3, Banjara Hills, Hyderabad

Please take Notice that the above Plaintiff have filed a Suit in OS No. 1132 of 2022 on the file of the Hon'ble III Additional District Judge, Ranga Reddy District, at LB Nagar for Partition and Separate Possession.If, any objection or interest in the above matter may appear before the Hon'ble III Additional District Judge, Ranga Reddy District, at LB Nagar, either in person or through pleader **on 29-08-2024, at 10:30 AM**, failing which the Hon'ble court shall proceed with the matter and pass appropriate order/s as per Law.

//By Order of Court//
P.ASHOK
ADVOCATE
Office: H.No.10-67, Opp. MRO Office, Maheshwaram, R.R. District-501359 Cell: 9848721918,

IN THE COURT OF THE HON'BLE VIII ADDL DISTRICT JUDGE. AT : VIJAYAWADA
O.S. No. 138/2016

Between:

Siripurapu Hari Prasad

.... Plaintiff

AND

Prathigadapa Venu Gopala Raju (Died) And 3 others

...Defendants

To:-

1. Prathigadapa Durga Rani W/o Venu Gopala Raju, Hindu, aged about 50 years, Properties (D-2)
2. Prathigadapa Harshavardhan s/o Venu Gopala Raju, Hindu, aged about 25 years, Properties (D-3)
3. Prathigadapa Saraswathi Lavanya D/o Venu Gopala Raju, Hindu, aged about 23 years, Properties (D-4)

All are R/o 7 Hills Apartments, Power Welfare Society, Narsingi, Hyderabad - 500075, Telangana

పై వెంబడిలోని వాది ప్రామిసరీ నోటు బాకీ వసూలు కోరుతూ పై వెంబడి దావాను దాఖలు చేసియున్నారు, 2వ, 3వ మరియు 4వ ప్రతివాది అయిన మీకు కోర్టు వారు ఎన్ని పర్యాయములు దావా సమన్సు పంపినను తీసుకోనిక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారు మీకు దావా సమన్సు పేపరు ప్రకటన ద్వారా జారీచేయుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. మీ హాజరు నిమిత్తం ది. 16-07-2024కు వాయిదా వేసియున్నారు. కనుక మీరు పై తేదీన పై కోర్టులో 10-30ని.లకు హాజరు అయ్యి మీకు గల అభ్యంతరాలు తెలుపవలెను లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని 2వ, 3వ మరియు 4వ ప్రతివాది అయిన మీకు తెలియచేయుటమైనది.

వాయిదా తేది. 16-07-2024.

(By order of the court)
Sri Venkat Rao. Madala
Advocate
Vijayawada
9246223338

IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT . AT: KUKATPALLY
O.S.NO. 1240 OF 2018

BETWEEN:

M. SUBBA RAO and others

.. PLAINTIFFS

AND

THE DISTIRCT COLLECTOR
Sanga Reddy District,And others

..DEFENDANTS

To,
15. K.BHASKAR REDDY
S/o. Late Rajashekar Reddy,
Age: Not Known, Occ: Not Known,
R/o.6-52, Bhavanipuram,
Beeramguda, Ammenpur,
Sanga Reddy District – 502032.

NOTICE

The Plaintiffs herein had filed the Suit for Declaration and Consequential Injunction against the Defendants herein with regard to Suit Schedule Property. The Hon'ble Court had Ordered for publication of this Notice for appearance of Defendant No. 15 and the matter is posted to 16.07.2024. Therefore, you may appear before the Hon'ble VIAdditional District Judge, Ranga Reddy District at Kukatpally on 16.07.2024 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
For
M/s RESU LAW OFFICE
Advocates.

IN THE COURT OF THE HON'BLE VIII ADDL. DIST JUDGE, RANGA REDDY DIST: AT : L.B.NAGAR
AS No. 213 OF 2022

Between :

Smt. T Karuna

... Appellant

AND

Mohd. Sharifuddin and others

... Respondents

To,

1) Mohd. Sharifuddin, S/o Jahangir Shariff, Aged: 57 Yrs, Occ: Business, R/o H.No 17-2-1002, Rain Bazaar, Outside Yakutpura, Hyderabad.

2) K Pentaiah, S/o Narsimha, Aged: 57 Yrs, Occ: Agriculture, 3) M Linga Reddy, S/o Ram Reddy, Aged: 59 Yrs, Occ: Agriculture, 4) G Chandra Shekhar Reddy, S/o Satti Reddy, Aged: 41 Yrs, Occ: Agriculture, Respondents No. 2 to 4 are R/o Nadergul Village, Balapur Mandal, Ranga Reddy Dist.

... Respondents No.1, 5 to 7

Please take notice that the Appellant had filed the above Appeal aggrieved by the judgment and decree passed in OS No. 534/2020, on the file of Hon'ble II Addl. Senior Civil Judge, Ranga Reddy Dist at L.B.Nagar and the same has been posted for your appearance on 15-07-2024.

Hence, you are make it convenient to appear before the Hon'ble Court, on 15-07-2024 at 10:30 AM. Otherwise the matter will be decided against you.

**\\ By order of the court **
M/s. G. CHANDRA S HEKAR REDDY
Advocate
Plot No. 66, RTC Colony,
Champapet, Hyderabad – 79.
Cell: 9391118889

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: CUM XIV ADDL.METRPOLITAN MAGISTRATE RANGA REDDY DISTRICT : AT : HAYATHNAGAR
O.S.No. 439 of 2023

Between :

Jakka Aparna Laxmi Kanaka Durga

...Plaintiff

AND

Patthi Vedavathi &others

... Defendants

To,

1. Patthi Vedavathi W/o. late Patthi Vinod Kumar,Aged about 69 years, Occ: Housewife,C/o. Vanta Shala, SV Complex, 1-4-180/87, SBO Colony, H.T.Lane, Sainikpuri, Secunderabad - 500094.
2. Chilankuthi Swarna Laxmi W/o. C.Jayanth Mohan D/o. late Patthi Vinod Kumar,Aged about 45 years, Occ: Housewife, C/o. Vanta Shala, SV Complex, 1-4-180/87, SBO Colony, H.T.Lane, Sainikpuri, Secunderabad - 500094.

.... DEFENDANTS NO.1 & 2

NOTICE

Whereas the above named plaintiff and Defendant No.1 to 3 as Legal Heirs of Late Patthi Vinod Kumar S/o. late Patthi Siddha Murthy, who died on 09-01-2022 and the deceased Patthi Vinod Kumar was purchased and absolute owner of the suit schedule properties during his life time in the above suit and the matter is posted on 31.07.2024 for your appearance i.e Defendant No.1 & 2 are personal or through counsel before the Hon'ble Prl.Junior Civil Judge cum XIV Addl.Metropolitan, Magistrate at Hayathnagar, Ranga Reddy District, failing which the court will pass appropriate order in accordance with law.

// By Order of the court //
(J.V. RAMANA MURTHY)
Advocate
1-5-652/A, Road No.7,
New Maruthi Nagar, Kothapet
Hyderabad-500035
Mobile No.9642221152

చిన్నారులకు బుక్స్ అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా మరోసారి తన దాతృత్వం చాటుకున్నారు. మంగళవారం ఇద్దరు పేద విద్యార్థులకు అండగా నిలిచా రు. మొదటి తరగతి చదువు తున్న వేదశ్రీకి, అశిత అనే పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఈ చిన్నారులిద్దరికీ వేర్వేరుగా బుక్స్ అందజేశారు. పేదలకు సహాయం చేయడంలో చాలా ఆనందం ఉంటుందని సారా తెలిపారు.





ఏడుపాయల మనదుర్గమ్మను దర్శించుకున్న అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, చంద్రమోహన్, మిరియాల రవీందర్, సీనియర్ జర్నలిస్టు వంజరీ బాలకృష్ణ, భవాని ప్రసాద్, గంగు, సూరి, నజ్జు తదితర నాయకులు నవతెలంగాణ-అంబర్‌పేట

'బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి'



- మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు 5 మంత్రి పదవులు ఇవ్వాలి
- నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలి
- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-హిమాయత్ నగర్

అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పాలక మండలిని నియమించాలని, మొత్తం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని రాజ్య సభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ త్వరలో జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు 5 మంత్రి పదవులు కేటాయించాలని, గత మంత్రివర్గ నిర్మాణంలో బీసీలకు 2 మంత్రి పదవులు ఇచ్చి బీసీలకు అన్యాయం చేశారని, కనీ సం ఇప్పుడు జరగబోయే విస్తరణలో 5 మందికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని, దేశవ్యాప్తంగా బహిరంగ సభల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఆ హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు.కార్పొరేషన్ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీసీ కులాల జనాభా లెక్కలు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చేపట్టాలని, పంచాయతీరాజ్ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది 100 బీసీ గురుకుల పాఠశాలలు, 50 ఇంజనీరింగ్ కళాశాలలు, రెండు యూని వర్సిటీలు ఏర్పాటు చేయాలని, కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి రియంబర్స్ మెంట్, విదేశీ స్కాలర్ షిప్ లు ఇవ్వాలని, పెరిగిన ధరల ప్రకారం మెస్ ఛార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల అభివృద్ధికి ఏ ఒక చిన్న స్కీమ్ ప్రవేశ పెట్టలేదని, కనీసం ఈ పై డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.లేనియెడల ఆత్మగౌరవ పోరాటానికి బీసీలు సిద్ధం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేముల రామకృష్ణ, నంద గోపాల్, మోడీ రాందేవ్, కోటేశ్వరి, రిటైర్డ్ ఏసీపీ చీలంపల్లి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి చాటేలా బోనాలు నిర్వహించాలి

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
- అధికారులు సమన్వయం చేసుకుంటూ కంట్రోల్ రూం ద్వారా నిరంతర పర్యవేక్షణ
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమం, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బోనాలను హైదరాబాద్ సంస్కృతిని ప్రపంచానికి చాటేలా నిర్వహించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమం, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్కంపేట శ్రీ ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమైన దేవాలయాల వారీగా సమావేశాలు కొనసాగుతుండడంతో జూలై 8, 9, 10 వ తేదీల్లో జరిగే బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, ఉత్సవాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బల్కంపేట శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో జరిగే అమ్మవారి కళ్యాణం, రథోత్సవం, తదితర కార్యక్రమాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసారి మహ లక్ష్మి ద్వారా ఉచిత బస్సు ప్రయాణం ఉండడంతో గతంలో కంటే భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గుడి చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గతంలో బారీ గేట్లు ఎత్తులో ఉండడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని ఈసారి బారీగేడ్ల ఎత్తు తగ్గించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. సూచిక బోర్డులు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ గేట్లు, క్యులైన్‌లలో భక్తులకు కొంత ఫ్లేస్ ఉండేవిధంగా ఏర్పాటు చేయడంతో పాటు వారికి తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గత బోనాల సమయంలో వీవీఐపీ పాసులు అధికంగా ఇవ్వడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని పోలిసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈసారి ప్రతి గుడిలో వీవీఐపీ పాసులు తగ్గేలా దేవాదాయ శాఖ అధికారులు, సమన్వయం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యత ఇస్తుందని మహిళా భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక షీ టీమ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గుడికి చుట్టుపక్కల ఉన్న రోడ్లలో ట్రాఫిక్ డైవర్షన్ చేసుకునేలా



ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కళ్యాణం తరువాత రథోత్సవం సమయంలో ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని, చిన్న అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలని ప్రత్యేక సీపీఆర్ బృందాలకు శిక్షణ ఇచ్చి అందుబాటులో ఉంచాలన్నారు. ఫైర్ ఇంజన్లు, టూ వీలర్ ఫైర్ వెహికిల్ శిక్షణ పొందిన ఫైర్ సిబ్బంది ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఆర్టీసి బోనాల జాతర కి ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసిందని తెలిపారు. భక్తులకు సమాచారం అందించడానికి ఎల్ఈడి స్క్రీన్‌లు, దాదాపు కిలోమీటరు దూరం వరకు వినిపించే విధంగా మైక్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక దేవాలయ కమిటీ లు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఉత్సవాల సందర్భంగా డీజేకి అనుమతి ఇవ్వవద్దని కోరగా పోలీసులు బల్కంపేట ఉత్సవాలకు డిజే అనుమతి ఇవ్వడం లేదని పోలీసులు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బోనాల పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సమీక్షా సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమీషనర్ హన్మంతరావు, వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ,సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కోటా నీలిమ, స్థానిక కార్పొరేటర్ సరళ జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్ వర్క్స్, విద్యుత్, ఆర్ అండ్ బి ఇతర ముఖ్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తరణకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-అంబర్‌పేట

నగరంలో కాంగ్రెస్ పార్టీ విస్తరణకు ప్రతి కార్యకర్త , నాయకులు కృషి చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తోలుపునూరి కృష్ణ గౌడ్ మర్యాద పూర్వకంగా దానం నాగేందర్‌ను కలిసి పుష్ప గుచ్చం అంద జేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ నగరంలో పార్టీ మరింత అభివృద్ధి చెందాలం టే కార్యకర్తలు నాయకులు కొత్త పాత అనుకోకుండా సమిష్టి కృషితో ముం దుకు సాగాలని అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తీసుకెళ్లి అర్హులైన వారందరికీ అదే విధంగా ప్రతి నాయకుడు కార్యకర్త చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి లకుపతి యాదగిరి గౌడ్, మాజీ లేబర్ బోర్డు వైస్ చైర్మెన్ నాగభూషణం, ఏనుగంటి దిలీప్ నేత, శ్రీమన్ గిరీ, నరేష్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీకీ సంబంధించిన ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ ఛాంబర్‌లో ఎస్టేట్ అదనపు కమిషనర్‌లతో కలిసి మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ ఆస్తుల ద్వారా ఆదాయ వనరులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీకీ సంబంధించిన ఓపెన్ స్థలాలు, ఎన్ని ఉన్నాయి, అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తులను కేటగిరిగా చేసి వాటి వివరాలు అందజేయాలని కోరారు. నెలసరి కిరాయి సక్రమంగా వసూలు అవుతున్నాయా, లీజ్ పీరియడ్ ముగింపు అయినట్లు ముందస్తుగా సంకేతాలు వచ్చే విధంగా ఆన్‌లైన్‌లో సరి చేయాలన్నారు. కమ్యూనిటీ భవన్‌లు ఎన్ని ఉన్నాయి. వాటిని దేనికోసం ఉపయోగిస్తున్నారో వివరాలను పూర్తి నివేదిక ఇవ్వాలని అన్నారు. మోడల్ మార్కెట్, మున్సిపల్ మార్కెట్ గదుల వివరాలు, వినియోగిస్తున్న వాటి వివరాలు అందజేయాలి ఆమె అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీకీ సంబంధించిన వివిధ రకాల ఆస్తుల వివరాలన్నింటినీ సమగ్ర డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. లీజు వివరాలు, ఆస్తుల వివరాలు అన్నింటినీ సిద్ధం చేసుకొని మరొక సారి జరిగే సమావేశం వరకు పూర్తి నివేదికతో హాజరు కావాలని మేయర్ అధికారు లను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ కె.శ్రీవాత్సవ, తదితరులు పాల్గొన్నారు.

'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలి'



- విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. నీట్-2024 పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా నష్టపోయిన విద్యార్థుల పక్షాన నోరు మెదపని దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నిర్లక్ష్య వైఖరి నశించాలని, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నీట్‌కు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాని మోదీ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మోడీ దిష్టిబొమ్మను రాష్ట్ర వ్యాప్తంగా దహనం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. కేవలం ఎన్టీఏ డైరెక్టర్ ను తొలగించడం కాదని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని సమూలంగా రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పుతూ మరల పరీక్షను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అభిజిత్ యాదవ్, శ్రీకర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్ రెడ్డి, లెనిన్, పిడిఎస్ యు కార్యదర్శి శ్రీను, గౌతమ్, అనిల్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎండి.జావిద్, హష్మిబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, కళ్యాణ్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.ప్రదీప్, బి.ఎస్.కృష్ణ, వైజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డిని కలిసిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు ప్రజావాణిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూని యన్ (ఏఐటియూసీ) రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రణాళి క సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ఉద్యోగులను రెగ్యుల రైజ్ చేయాలని జీ.ఓ.510లో 4వేల మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరమన్నారు. ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2018లో జీఓ510లో కొంతమందికి అన్యాయం జరిగిందన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగికి న్యాయం చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై స్పందించిన చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేయడానికి కృషి చేస్తాననీ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఎం. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, లోకేష్, శ్రీమణి, భార్గవి, రవి, లావణ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని దక్కించుకున్న కార్తీక్

- రూ.5 లక్షల 37 వేలకు భోలక్‌పూర్ భవాని శంకర దేవాలయం వాహనాల పార్కింగ్ టెండర్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్ డివిజన్‌లోని దేవునితోటలో శ్రీ భవాని శంకర దేవాలయం ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్ స్థలం కోసం వేలం పాట నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ వేలం పాటలో నలుగురు టెండర్‌దారులు హాజరయ్యారు. గత సంవత్సరం టెండర్‌ను కైవసం చేసుకున్న శివ శంకర్, మరో వ్యక్తి టి.కార్తీక్‌లు పోటీ పడ్డారు. రూ.5 లక్షల 37 వేలకు వాహనాల పార్కింగ్ స్థల టెండర్‌ను కార్తీక్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జి.సత్యనారాయణ, దేవాలయ సిబ్బంది ఎస్.శ్రీనివాస చారి, మిక్కిలినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

- అన్ని రకాల మందులను పేషంట్‌లకు అందుబాటులో ఉంచాలి
- నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో సర్వే నిర్వహించిన ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అన్ని రకాల మందులను పేషంట్ లకు అందుబాటులో ఉండాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర అన్నారు. మంగళవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవై ఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాంపల్లి ఏరియా ఆస్పత్రిని ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం పలు అంశాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల డయాగ్నోసిస్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలను బాధ్యతతో అందించాలని వారు డిమాండ్ చేశారు. నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో గత ఐదు రోజులుగా రక్త పరీక్ష సేవలు ఆన్‌లైన్‌లో ఇబ్బందుల కారణంగా అందుబాటులో లేవని, దీని వలన పేషంట్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత ఉందని, మరుగుదొడ్లు సరిగా లేవని, మరుగుదొడ్లకు సూచిక బోర్డ్ లేవని, ఆస్పత్రి ఔట్ పేషెంట్ వార్డ్ పై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని, సత్వరమే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. నూతన భవనాన్ని నిర్మించాలని, బాలింతలకు గత ప్రభుత్వంలో ఇచ్చిన కిట్లను ఇవ్వడం లేదని బాలింతలు వాపోతున్నారని చెప్పారు. బాలాంతలకు ఇచ్చే కిట్లను మళ్లీ పంపిణీ చేయాలని కోరారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రంగా ఉన్నాయని సర్వేలో పొందుపరిచామని వారు తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ ఏజెన్సీ ఏగిల్ గ్రూప్ సిబ్బందికి మూడు నెలలుగా జీత భత్యాలు చెల్లించలేదన్నారు. వెంటనే వారందరికీ జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఏరియా ఆస్పత్రిఆర్ఎంఓ శ్రీదేవి కీ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, బాలు, విజయ్, వంశీ, సీనియర్ కార్మిక నేత చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల గంజాయి పట్టివేత

- మౌలాలిలో 12.33 కిలోలు, మల్లాపూర్‌లో 1.56 కిలోలు స్వాధీనం
- మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి రెవెన్యూ పరిధిలోని రెండు చోట్ల గంజాయిని పట్టుకున్నట్టు మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తెలిపారు. భద్రాచలం నుంచి మల్కాజిగిరికి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నట్టు తెలిపారు. ఒరిస్సా నుంచి బిజాయ్ అనే వ్యక్తి రహీమ్‌తో కలిసి గంజాయిని బస్సులో తీసుకొస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు నిందితుల కోసం మాటు వేశారు. మౌలాళి వద్ద దిగి నానక్‌గూడ ప్రాంతంలో ఆటో కోసం ఎదురుచూస్తున్న నిందితులను గంజాయితో పాటు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12.33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు నవీన్‌కుమార్ తెలిపారు. గంజాయి విలువ రూ.3 నుంచి 5 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. ఈ ఆపరేషన్‌లో సీఐ బిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు, సిబ్బంది విజయకష్ణ, మహేశ్వర్, సంజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మల్లాపూర్ 1.56 కిలోల గంజాయి పట్టివేత

ఆంధ్ర ఒరిస్సా బార్డర్‌లో ఉన్న సీలేరు నుంచి అక్రమంగా హైదారాబాద్‌లో అమ్మకానికి తీసుకొస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం పక్కా సమాచారంతో మల్కాజిగిరి పరిధిలోని మల్లాపూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బీహెచ్ఈఎల్ సర్కిల్‌లో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఒక వ్యక్తిని పట్టుకున్నారు. ఆతడి వద్ద తనిఖీ చేయగా 1.56 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో అతన్ని అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో సీఐతోపాటు నరేష్ రెడ్డి, బిక్కు, మమత ఉన్నారు.

అభినందనలు..

రెండు వేర్వేరు చోట్ల గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఈఎస్ నవీన్‌కుమార్, ఏఈఎస్ ముకుందారెడ్డి అభినందించారు. ఇదే మల్కాజిగిరి పరిధిలోని శేరిలింగంపల్లిలో 121 గ్రాముల గంజాయిని సైతం స్వాధీనం చేసుకున్నారు.

రేపటి మైదానం గోపి జీవన యానంలో మైలు రాళ్లు

నవతెలంగాణ-కల్చరల్

రేపటి మైదానం కవితా సంపుటిలోని ప్రతి కవితా గోపి అరవై దశాబ్దాల జీవన యానం లోని మైలు రాళ్ళు అని ఆంధ్ర జ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్.టీ.ఆర్ కళా మందిరం కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణ లో విఖ్యాత కవి డాక్టర్ ఎన్.గోపీ అమృతోత్సవంలో భాగంగా ఆయన రాసిన కవితా సంపుటి రేపటి మైదానం ఆవిష్కరణ సభ నిర్వహించారు.శ్రీనివాస్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. నానీలు మని కవితా సృష్టి కర్తగా గోపి ఎందరో కవులకు ప్రేరణ ఇచ్చారని వివరించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ గోపి వేమన పద్యాలు పై పరిశోధన విశ్లేషణ చేసి నేటి తరం వారికి మార్గ నిర్దేశం చేశారనీ ఆయన సాహిత్య వివరించి అని ప్రశంసించారు. గోపి తన సంపుటిని లాంచనంగా సుప్రసిద్ధ విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి కి అంకితం ఇచ్చారు. వేదికపై సాహితీవేత్తలు ఆచార్య సూర్య ధనంజయ జాతీన్ కుమార్, వంశీ ధర్ తదితరులు పాల్గొనగా కిన్నెర రఘురాం స్వాగతం పలికారు.



రంగు మారకుండా!


వంకాయ, యాపిల్ వంటివి కోసిన కొంతసేపటికే రంగు మారిపోతాయి. అలా కాకుండా ఎక్కువ సేపు తాజాగా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించండి. నీటి కొళాయిని తిప్పి వేగంగా వస్తున్న నీటి మధ్యలో యాపిల్‌ను ఉంచి కోసినట్లయితే ఆక్సిడేషన్ ప్రక్రియను ఆపవచ్చు. దీనివల్ల కోసిన తర్వాత యాపిల్ ముక్కలు రంగు మారవు.

▸▸ అల్లంలో ఉండే సిట్రిక్ యాసిడ్ ఆక్సిడేషన్ ప్రక్రియను నిలిపివేస్తుంది. కాబట్టి ఏవైనా పండ్లను కోసిన వెంటనే అల్లం ద్రావణంలో వేస్తే రంగు మారకుండా ఉంటాయి. వంకాయలను కోసేటప్పుడు ముక్కల్ని ఉప్పు కలిపిన నీటిలో వేస్తే రంగు మారకుండా ఉంటాయి.



▸▸ ఒక గాజు గ్లాస్‌లో నీళ్ల తీసుకుని అందులో టేబుల్ స్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. అనంతరం అందులో పండ్ల ముక్కలు వేసి కలిపితే పండ్ల ముక్కలు రంగు మారకుండా ఉంటాయి. నిమ్మరసం అందుబాటులో లేకపోతే పైనాపిల్ రసం, ఆరెంజ్ జ్యూస్ కూడా కలపవచ్చు.

నేను పుట్టి పెరిగింది తమిళనాడులోని తిరుచునాపల్లి. మా అమ్మ మాలతీ కన్నన్, మ్యూచవల్ ఫండ్ ఇండస్ట్రీలో పని చేస్తోంది. నాన్న ఎస్.కన్నన్, ఎయిర్‌కండీషన్ డిజైనర్. ఆయనకు ఎక్కడ మంచి జాబ్ వస్తే మేమంతా అక్కడికి వెళు తుండేవాళ్ళం. అలా నేను చెన్నై, ఢిల్లీ, ముంబయిలో చదువుకున్నాను. నాకు ఓ తమ్ముడు కూడా ఉన్నాడు. పదో తరగతి తర్వాత సీఏ చేద్దామనుకుని ఇంటర్ చేరాను. అయితే అంకెలు రివర్స్‌లో కనిపిస్తుండేవి. రాయడం కూడా ఇబ్బందిగా ఉండేది. తొమ్మిదిని ఆరులా ఆరుని తొమ్మిదిలా రాసేదాన్ని. పేర్లు కూడా తప్పుగా రాస్తుండేదాన్ని.



కె.వైశాలి... కాలేజీ చదివే రోజుల్లో తాను డైస్లెక్సిక్‌తో బాధపడుతున్నట్టు గుర్తించింది. అదే సమయంలో తన శరీరంలో అనేక మార్పులు గమనించింది. చివరకు తానొక లెస్బియన్ అని గుర్తించింది. సమాజానికి విరుద్ధంగా ఉన్న కూతురి కోర్కెలను తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఇక తన దారి వెదుక్కుంటూ అడుగుబయట పెట్టింది. ప్రేమించడం, విడిపోవడం, కోలుకోవడం, విద్యా వైఫల్యం, ఒంటరితనం, స్వలింగ సంపర్కం, అనారోగ్యం, ఆందోళన, నిరాశ ఇలా ఎన్నో సమస్యలతో ఆమె జీవితం మొదలయ్యింది. తన అనుభవాలన్నింటినీ 'హోమ్‌లెస్'గా ముద్రించింది. అదే ఇటీవల కేంద్ర సాహిత్య యువపురస్కారానికి ఎంపికయింది. బతికేందుకు సమాజంతో పోరాడి అక్షరాల్లో ఓదార్పు వెదుక్కొంటున్న ఆమెతో మానవి సంభాషణ...



నా అనుభవాలే 'హోమ్‌లెస్'

కొన్ని మార్పులు గమనించాను

చదువు మానేసి ముంబయిలో చిన్న చిన్న ఉద్యోగాలు చేయడం మొదలుపెట్టాను. అయితే 19, 20 ఏండ్లు వచ్చేటప్పటికి నాలో నేను కొన్ని మార్పులు గమనించాను. అబ్బాయిలంటే అస్సలు ఇష్టముండేది కాదు. కాలేజీలో చేరినప్పుడు ఓ అమ్మాయిని ఇష్టపడ్డాను. నేను ఒక లెస్బియన్ అని తెలిసింది. ఆ అమ్మాయితో మూడేండ్లు రిలేషన్‌షిప్‌లో ఉన్నాను. నాకు 23 ఏండ్లు వచ్చిన తర్వాత ఈ విషయం మా అమ్మకు చెప్పాను. అస్సలు ఒప్పుకోలేదు. నాప్రవర్తన ఇంట్లో వాళ్ళకు నచ్చలేదు. నాతో మాట్లాడటం మానేశారు. ఇక వాళ్ళతో కలిసి ఉండలేక అహ్మదాబాద్ వెళ్లిపోయాను. నాతో పాటు రిలేషన్‌లో ఉన్న అమ్మాయి కూడా నాతో వచ్చింది. కానీ అక్కడికి వెళ్ళిన తర్వాత మా ఇద్దరి మధ్య బ్రేకప్ అయ్యింది. ఆ టైంలో ఉద్యోగం లేక చాలా ఇబ్బందులు పడ్డాను. బతకడం కోసం ఆఫీస్‌బాయ్‌గా పని చేశాను. ఇలాంటి పరిస్థితుల్లో మాస్టర్స్ చేద్దామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కమ్యూనికేషన్ కోర్సు కోసం అప్లయ్ చేశాను.

ఎవ్వరూ సపోర్ట్ చేయలేదు

నా సమస్య ఏంటని గూగుల్లో కొంత సర్చ్ చేశాను. ఓ గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్ళి చెకప్ చేయించుకున్నా. నాకు డైస్లెక్సిక్ అనే సమస్య ఉందని బయటపడింది. అంటే 'తారే జమీన్ పర్' సినిమాలోని అబ్బాయికి ఉన్న సమస్య అన్నమాట. ఇంటర్ మంచి మార్కులతోనే పాసయ్యాను. కానీ నాకున్న సమస్యతో సీఏ ఫీల్డ్‌లో కొనసాగడం కష్టం. అందుకే బీకాం చేసి ఎమ్మె ఎకనామిక్స్ తీసుకున్నాను. అయితే అక్కడ కూడా గ్రాఫ్ గీయడం, చదవడం చాలా సమస్య అయ్యింది. నాలాంటి సమస్య ఉన్న వారికి పరీక్షలు రాయడానికి సహాయం చేయానికి ప్రత్యామ్నాయం గురించి యూజీసీ నుండి ఎలాంటి గైడ్‌లైన్స్ లేవు. కాలేజీలో ఎవ్వరూ సపోర్ట్ చేయలేదు. దాంతో ఫస్ట్ సెమిస్టర్ ఫెయిల్ అయ్యి ఆ కోర్సు కూడా మానేయాల్సి వచ్చింది.



గందర గోళంగా మారింది

హైదరాబాద్‌లో సీటు రావడంతో ఇక్కడే హాస్టల్లో చేరాను. నాకున్న డైస్లెక్సిక్ సమస్య గురించి చెప్పినప్పుడు యూనివర్సిటీ వాళ్లు బాగా అర్థం చేసుకున్నారు. కానీ నేను ఒక లెస్బియన్ అని ఎవరికి చెప్పలేకపోయాను. నా గురించి మిగిలిన వారు ఏమనుకుంటారో అనే భయం ఉండేది. ఒక పక్క ఇంట్లో పెండ్లి చేసుకోమని గొడవ మొదలుపెట్టేవాళ్లు. ఓ సాధారణ అమ్మాయిలా పెండ్లి చేసుకోవడం నా వల్ల కాదు. నా పరిస్థితి చాలా గందర గోళంగా మారింది. నేను ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం నా ఒక్క దానివే కావని తెలుసుకున్నాను. నాలా చాలా మంది సాధారణ జీవితం గడపలేక, కుటుంబంతో ఇమడలేక, సమాజంతో మసలలేక మానసికంగా కుంగిపోతున్నారు.

> నా బతుకు నేను బతుకుతున్నాను. కనుక ఎవరి జీవితం వారిని జీవించనిస్తే చాలు. ఎలాంటి సమస్యలూ ఉండవు. యువత కూడా తమ చేతుల్లో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి సమాజ మార్పు కోసం ప్రయత్నించాలి. ఇతరులకు సాయం చేయడం అలవర్చుకోవాలి.

నా ఉనికిని దాచుకున్నాను

నా తప్పులేకుండానే జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. చాలా కాలం నా ఉనికిని దాచుకోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో నేను రాసిన హోమ్‌లెస్ పుస్తకానికి మంచి స్పందన వచ్చింది. నాలాంటి వారే కాకుండా అనేక మంది దీన్ని చదివి తమ అభిప్రాయాలు చెబుతున్నారు. అంతే జాతీయ స్థాయిలో ఓ పురస్కారం వస్తుందని అస్సలు ఊహించలేదు. ఇప్పుడు ఈ పుస్తకం మరింత మందికి చేరువవుతుంది. నాలాంటి వారి జీవితాల గురించి ప్రజలు అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎనిమిదేండ్ల నుండి హైదరాబాద్‌లోనే నా పార్టనర్‌తో కలిసి జీవిస్తున్నా. ప్రస్తుతం టెక్నికల్ రైటర్‌గా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తున్నాను. ఆఫీస్‌లో నా గురించి అందరికీ తెలుసు. అయినా ఎలాంటి సమస్యా లేదు. ఇప్పుడు జీవితం చాలా బాగుంది. మాస్టర్స్ పూర్తి చేశాను. సొంత ఇల్లు కూడా కొనుక్కున్నాను.

ఇంకా చాలా రాయాలి

పుస్తకం రాసేటప్పుడు అమ్మ వాళ్లకు అస్సలు ఇష్టం లేదు. ఎందుకంటే ఇది నా జీవితం. వాస్తవాలు రాస్తున్నాను. అందే మా అమ్మానాన్నలు గురించి కూడా ఇందులో ఉంటుంది. అందుకే నేను ఈ పుస్తకం రాస్తున్నానంటే ఒప్పుకోలేదు. ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉన్నారు. ఇది రావడం అంత సులభం కాదని వాళ్లకు తెలుసు.

ఇప్పుడు నా పుస్తకం ఎంతో మందికి అవగాహన కల్పిస్తుందని వాళ్లు కూడా అనుకుంటున్నారు. ఇంకా పుస్తకాలు రాయాలనుకుంటున్నాను. నాతో పాటు ఇంకా రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఎందరో ఉన్నారు. అలాంటి వారి జీవితాలను ఓ పుస్తకంగా తీసుకొస్తాను. వాళ్ల బాధలు, కష్టాలు, పోరాటాలు సమాజానికి తెలియజేస్తాను. అలాగే ఒక నవల కూడా రాయాలనుంది. ఇలా ఎన్నో ఆలోచనలు ఉన్నాయి.



మా సమస్యలు తెలియాలని

యూనివర్సిటీకి వచ్చిన తర్వాత ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాను. తన ప్రోత్సాహంతోనే రాయడం మొదలుపెట్టాను. మొదట్లో 'హోట్ అఫ్ యు', 'ఫ్లో' వంటి కొన్ని చిన్న కథలు రాశాను. ఓ నవల కూడా రాశాను కాని దానికి పెద్ద గుర్తింపు రాలేదు. మాలాంటి వారి సమస్యలు సమాజానికి తెలియజేయాలని నా జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలన్నింటినీ కలిపి 2023లో 'హోమ్‌లెస్' అనే పేరుతో పుస్తకంగా రాశాను. ఇది గత ఏడాది పబ్లిష్ అయ్యింది. దీనికి కేంద్ర సాహిత్య యువ పురస్కారం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

ఎవరి జీవితం వారిది

మేము కూడా మనుషులమే అని అందరూ గుర్తించాలి. అవకాశాలు ఇవ్వకుండా అంటరాని వాళ్లలా చూడడం కరెక్ట్ కాదు. ఒక అమ్మాయికి పెండ్లి చేసుకోవడం ఇష్టం లేకపోతే ఆమె ఆలోచనలు వేరుగా ఉన్నాయని అనుకోవద్దు. ఆమె జీవితం ఆమెకు నచ్చినట్టు జీవించనివ్వాలి. ఒక అమ్మాయి, మరో అమ్మాయిని ఇష్టపడితే అది ఇష్టం. నావరకు నేను వేరే వాళ్ల జీవితాన్ని నాశనం చేయడం లేదు. నా బతుకు నేను బతుకుతున్నాను. కనుక ఎవరి జీవితం వారిని జీవించనిస్తే చాలు. ఎలాంటి సమస్యలూ ఉండవు. యువత కూడా తమ చేతుల్లో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి సమాజ మార్పు కోసం ప్రయత్నించాలి. ఇతరులకు సాయం చేయడం అలవర్చుకోవాలి. అందరినీ సమానంగా గౌరవించాలి. దీనికి అధ్యయనం ఎంతగానో ఉపయోగపడుతుందని నేను నమ్ముతున్నాను.

\- సలీమ

అటూ ఇటూ కాక..

(మొదటిపేజీ తరువాయి)

కలిపి కాంగ్రెస్‌కు ఐదుగురు సభ్యులుండగా, ఎంఐఎంకు ఇద్దరు, బీజేపీకి ఒక్క ఎమ్మెల్సీ ఉన్నారు. వీరుగాక ఇద్దరు స్వతంత్ర సభ్యులు (యూటీఎఫ్ నుంచి ఒకరు, పీఆర్‌టీయూ నుంచి ఒకరు) ఉన్నారు. గవర్నర్ కోటాలో ఇద్దరు సభ్యులను నామినేట్ చేయాల్సి ఉండగా... మాజీ గవర్నర్ తమిళిసై తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదం కావటంతో ఆ రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇవిపోను మొత్తం 38 మంది సభ్యుల్లో బీఆర్ఎస్ 28 మందితో పెద్ద పార్టీగా ఉంది. ఇది అధికార పార్టీకి తీవ్ర తలనొప్పిగా మారనుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలను లాక్కుంటున్న తరహాలోనే ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలను పెద్ద సంఖ్యలో చేర్చుకోవాలనే తలంపుతో అధికార పార్టీ ఉంది. అందుకనుగుణంగా సీఎం రేవంత్ వడివడిగా అడుగులేస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్సీల 'చేరిక'ల బాధ్యతను శాసనమండలి సభ్యుడైన ఓ సీనియర్‌కు ఆయన ఇప్పటికే అప్పగించినట్టు తెలుస్తోంది. ఆ మేరకు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్సీలతో చర్చలు కూడా పూర్తి కావటంతో వారు త్వరలోనే హస్తం గూటికి చేరనున్నారని సమాచారం. సాంకేతిక పరమైన సమస్యలు, కోర్టు గొడవలు లేకుండా ఒక్కో సభ్యుణ్ని కాకుండా ఏకంగా శాసనమండలి బీఆర్ఎస్ పక్షాన్నే కాంగ్రెస్‌లో కలిపేసుకుంటే సరిపోతుందనే భావనలో అధికార పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది.

వాస్తవానికి శాసన మండలిలో పెద్దగా బలం లేకున్నా అధికార పార్టీకి వచ్చే ముప్పేమీ లేదు. కానీ బిల్లుల రూపంలో కాంగ్రెస్‌కు... బీఆర్ఎస్ నుంచి అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. గత డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే శాసనసభను ప్రభుత్వం సమావేశపరిచింది. ఆ సందర్భంగా అసెంబ్లీలో ఆమోదించిన పలు బిల్లులు మండలి ముందుకు వచ్చాయి. వాటన్నింటినీ పెద్దల సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, మధుసూదనాచారి తదితరులు మాట్లాడుతూ... 'సంఖ్యాబలం రీత్యా మేం పెద్దగా ఉన్నా, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. కొన్ని బిల్లులపై మాకు భిన్నాభిప్రాయాలున్నా సభ హుందాతనాన్ని కాపాడేందుకు వాటికి అడ్డుపడకుండా ఆమోదిస్తున్నాం...' అని చెప్పారు. కానీ ఆనాటి పరిస్థితి ఇప్పుడు లేదు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌ను అడుగడుగునా ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అందుకు మండలిని ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ వ్యూహం పన్నారు. గత డిసెంబరులో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం... జులైలో పూర్తి స్థాయి పద్దును ప్రవేశపెట్టాల్సి ఉంది. అప్పుడు అనేక రకాల బిల్లులను ఉభయ సభలూ ఆమోదించాల్సి ఉంటుంది. ఆ సందర్భంలో ప్రధాన ప్రతిపక్షం నుంచి తలనొప్పులు ఎదురవుతాయని ముందుగానే అంచనా వేసిన అధికార పార్టీ... ఎమ్మెల్యేలతోపాటు పనిలో పనిగా ఎమ్మెల్సీలపైనా 'ఆకర్ష'ను ప్రయోగించబోతోంది.

ఈ ఆకర్షణ మంత్రాన్ని తట్టుకోవడానికి, తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కాపాడుకోవటానికి వీలుగా మాజీ సీఎం కేసీఆర్ గత రెండు మూడు రోజులుగా సీనియర్లతో మంతనాలు జరుపుతున్నారు. ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన వారితో భేటీ అయ్యారు. సోమవారం మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు నేతలతో ఆయన సమావేశమయ్యారు. తాజాగా మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, అరికెపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, టి.ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, దండె విఠల్, తదితరులతో భేటీ అయ్యారు. మాజీ స్పీకర్ పోచారంతోపాటు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీ మారిన విషయంపై కేసీఆర్ ఈ సందర్భంగా ప్రధానంగా చర్చించినట్టు సమాచారం. 'ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రాన ఎలాంటి నష్టమూ లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమల్లో పూర్తిగా విఫలమైంది. అందువల్ల భవిష్యత్ అంతా మనదే...' అంటూ ఆయన వారిలో ధైర్యం నింపేందుకు ప్రయత్నించారు. తద్వారా వారు పార్టీ ఫిరాయించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు వినికిడి.

ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. జులై నాలుగు నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల ఆరో తేదీ నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. ఆరోనెల ఎనిమిది నుంచి 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ఆదేనెల 19న తొలివిడత సీట్లు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆదేనెల 19 నుంచి 23 వరకు ఫీజు చెల్లించాలని, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని అభ్యర్థులకు సూచించారు.

వచ్చేనెల 26 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని బుర్రా వెంకటేశం తెలిపారు. ఆరోజు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియను చేపట్టేందుకు అవకాశముందని వివరించారు. ఆదేనెల 27న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. వచ్చేనెల 27, 28 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని కోరారు. ఆదేనెల 31న రెండో విడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఆదేనెల 31 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఆగస్టు మూడో తేదీన విద్యార్థులు ప్రవేశ వివరాలను కాలేజీ యాజమాన్యాలకు అందజేయాలని కోరారు.

ఆగస్టు 8 నుంచి తుదివిడత కౌన్సెలింగ్

ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఆగస్టు ఎనిమిదో తేదీ నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామని బుర్రా వెంకటేశం తెలిపారు. ఆరోజు ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందని, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. ఆదేనెల తొమ్మిదిన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఆదేనెల తొమ్మిది, పది తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని తెలిపారు. ఆగస్టు 13న తుదివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఆదేనెల 13 నుంచి 15 వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. 16, 17 తేదీల్లో అభ్యర్థులకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఆదేనెల 21, 22 తేదీల్లో కేంద్రీకృత అంతర్గత స్లైడింగ్ (కాలేజీల్లో కోర్సులు మార్చుకునే) అవకాశం కల్పిస్తామని తెలిపారు. 26 సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. 27,28 తేదీల్లో వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి ఆయా కాలేజీల్లో చేరాలని సూచించారు. ఆగస్టు 28న స్పాట్ అడ్మిషన్ల కోసం మార్గదర్శకాలను విడుదల చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఎ.ఎ.ఏ://టిజిఈఏపీసెట్.ఏఐ.ఏఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత అభ్యర్థులకు కేటాయించిన కాలేజీలో భౌతికంగా రిపోర్టు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒక సెట్ జిరాక్స్ ధ్రువపత్రాలను, ఒరిజినల్ టీసీని కాలేజీల్లో సమర్పించాలని సూచించారు. రెండో విడతలో రిపోర్టు చేయడంతోపాటు మూడో విడతలో వెబ్‌ఆప్షన్ల నమోదు చేసేందుకు అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్)కు జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణంపై నిజ నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డి ఏకసభ్య విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈనెల 27వ తేదీలోపు కమిషన్ లేవనెత్తిన అంశాలపై వివరణ ఇవ్వాలని ఆ లేఖలో కోరారు. అయితే గతంలోనే మాజీ సీఎం కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు ఇవ్వగా, ఆయన వివరణ ఇచ్చేందుకు జులై 30వ తేదీ వరకు గడువు కోరారు. దీన్ని తిరస్కరించిన కమిషన్ జూన్ 15లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీనితో ఆయన కమిషన్ ఏర్పాటే చట్ట విరుద్ధమని, జస్టిస్ నర్సింహారెడ్డి స్వచ్ఛందంగా విచారణ నుంచి తప్పుకోవాలంటూ సమాధానం ఇచ్చారు. దానిలోని ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణాలపైనా పాక్షిక వివరణ ఇచ్చారు. కేసీఆర్ ఇచ్చిన వివరణపై కమిషన్ విద్యుత్‌రంగ నిపుణులతో పలుమార్లు చర్చలు జరిపింది. విచారణలో భాగంగా వారి వివరణను కూడా తీసుకుంది. విద్యుత్‌రంగ నిపుణులు లేవనెత్తిన పలు అభ్యంతరాలపై మరింత విస్తృతమైన వివరణ అవసరమని పేర్కొంటూ, ఆయా అంశాలను కమిషన్ లేఖలో పేర్కొని, మాజీ సీఎం కేసీఆర్‌ను వివరణ కోరింది. ఈ లేఖను ఈనెల 19వ తేదీనే జేసీఆర్‌కు పంపారు. దీనిపై న్యాయనిపుణులతో సుదీర్ఘ చర్చల అనంతరం కేసీఆర్ సోమవారం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. అసలు కమిషన్ నియామకమే చెల్లదని, అది చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొన్నారు.

అయితే ఈ పిటీషన్‌పై హైకోర్టు రిజిస్ట్రీ పలు అభ్యంతరాలు లేవనెత్తినట్టు సమాచారం. ఆ అభ్యంతరాలను సరిచేసి మంగళవారం మరోసారి పిటీషన్‌ను దాఖలు చేసినట్టు తెలిసింది. అయితే దీనికి కూడా హైకోర్టు రిజిస్ట్రీ పిటీషన్ నెంబర్ ఇవ్వలేదని తెలిసింది. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్ జడ్ అంశంపై మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్ రెడ్డితోపాటు మరికొంత మందికి కూడా నోటీసులు జారీ చేసింది. మరో రెండ్రోజుల్లో కమిషన్ ఇచ్చిన గడువు ముగుస్తుండటంతో మాజీ సీఎం కేసీఆర్ వివరణ ఇస్తారా? లేక న్యాయస్థానం నుంచి అందుకు భిన్నంగా ఏవైనా ఉత్తర్వులు తెచ్చుకుంటారా అనే అంశంపై ఆసక్తి నెలకొనింది.

పత్తి మళ్లీ విత్తాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

సాగయ్యే పంట పత్తి. రాష్ట్రంలో 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా. దీనిలో 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని లెక్కలు వేశారు. ఖమ్మం జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 2,01,834 ఎకరాలు కాగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటి వరకు 1,18,286 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. దీనిలోనూ సగం విస్తీర్ణంలో విత్తనాలు సరిగా పడును లేక దెబ్బతింటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల ఎకరాలకు గాను 40 లక్షల ఎకరాల వరకు నాటిన కోసం 10-15 లక్షల ఎకరాల్లో మళ్లీ విత్తనాలు నాటాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు.

ఒక్కో రైతుపై రూ.8వేల అదనపు భారం..

విత్తనాలు దెబ్బతిన్న రైతులు ఎకరానికి రూ.8వేలకు పైగా అదనపు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పంట చేతికి వచ్చేనాటికి ఎటా ఎకరానికి రూ.20వేల వరకు అదనపు పెట్టుబడులు తప్పడం లేదని పత్తి రైతాంగం ఆవేదన చెందుతోంది. ఎకరానికి ఒక్కో ప్యాకెట్‌పత్తి విత్తనాలు రూ.864 చొప్పున కొనుగోలు చేశారు. అంటే ఎకరాకి రెండు ప్యాకెట్లకు రూ.1,728 విత్తనాలకు వెచ్చించారు. డిమాండ్ ఉన్న విత్తనాలను ఒక్కో ప్యాకెట్ రూ.1500కు పైగా వెచ్చించి బ్లాక్‌లో కొనుగోలు చేశారు. విత్తనాలు నాటేందుకు దుక్కిని సిద్ధం చేయడం కోసం.. ఫ్లవ్ వేయడానికి రూ.3,000, కల్టివేటర్‌కు రూ.3,000, రొటోవేటర్‌కు రూ.2,000, అచ్చుతోలకానికి రూ.1,000, విత్తనాలు నాటేందుకు రూ.600 చొప్పున మొత్తం రూ.11,328 వరకు ఎకరాలో విత్తనాలు నాటేందుకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ మొత్తం వెచ్చించి నాటిన విత్తనాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే 80శాతం వరకు మొలకెత్తుతాయి. గింజలు నాటిన ఐదారు భూమిపై మొలకలు కనిపిస్తాయి. కానీ ఈ ఏడాది విత్తనాలు నాటాక పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కూడా పడలేదు. కాబట్టి విత్తనాలు మొలకెత్తని రైతులు మొదటిసారి పెట్టిన పెట్టుబడిలో ఒక ఫ్లవ్ ఖర్చు రూ.3,000 మినహా మిగిలిన అన్ని పెట్టుబడులు మళ్లీ వెచ్చించక తప్పదు. అంటే సుమారు రూ.8వేల వరకు ఒక్కో ఎకరానికి రైతు అదనపు ఖర్చు భరించాల్సి ఉంటుంది. నెలలు ఏ రకమైనా వర్షాలు లేకపోతే మాత్రం విత్తనాలు మొలకెత్తే అవకాశం లేదు. వీదరీకరణ ఎండకాస్తుండటం, పూర్తి పొడివాతావరణంతో విత్తనాలు మొలకెత్తడం లేదని రైతులు వాపోతున్నారు.

హస్తినలో సీఎం బిజీబిజీ...

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో ఆయన ఛాంబర్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద మూడు, నాలుగు త్రైమాసికాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి రూ.323.73 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు. ఈ నిధుల్ని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్‌హెచ్ఎంలో 2024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.231.40 కోట్లు మంజూరు చేయాలని కోరారు. కేంద్రం నుంచి ఈ నిధులు సకాలంలో అందకపోవడం, ఆత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు ఎదురుకాకుండా రాష్ట్ర ప్రభుత్వమే తగు చర్యలు తీసుకుంటుందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో భాగంగా 2023 అక్టోబరు నుంచి రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన వాటా మొత్తాన్ని తామే విడుదల చేస్తున్నామని సీఎం వివరించారు. ఇప్పటికైనా ఎన్ హెచ్ ఎం కింద తెలంగాణకు రావాల్సిన పెండింగ్ నిధులు సత్వరమే రిలీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

4 గంటలు పార్లమెంట్ లోనే

రెండో రోజు పర్యటనలో దాదాపు నాలుగు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్‌లోనే గడిపారు. ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి నడ్డాతో భేటీలో భాగంగా ఆయన పార్లమెంట్‌కు చేరుకున్నారు. అనంతరం కాంగ్రెస్, ఇతర పార్టీ ఎంపీలతో కాసేపు ముచ్చటించారు. మరోసారి ఎంపీలుగా ఎన్నికైన సుప్రియా సూలే, ఇతర సీనియర్లకు అభినందనలు తెలిపారు. తరువాత లంచ్ కోసం తుగ్లక్ రోడ్ వెళ్లారు. తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు మధ్యాహ్నం 1:40 నిమిషాలకు మళ్లీ పార్లమెంట్‌కు చేరుకున్నారు. కాగా, రాహుల్ ప్రమాణ స్వీకారం కోసం సోనియా వచ్చారన్న సమాచారంతో ఛాంబర్ దగ్గర ఆమె కోసం వెయిట్ చేశారు. తరువాత సోనియా, ప్రియాంక గాంధీ, మాజీ ఎంపీలు మల్లు రవి, సీతక్క, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వివేక్‌తో కలిసి రాష్ట్ర ఎంపీలు, రాహుల్ ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వివేక్ వెంకట స్వామి, ఇతర నేతలతో కలిసి పార్లమెంట్ ద్వారా వద్ద ఫోటోలు దిగారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాండి...

ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి గెలుపొందినా, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా లోక్‌సభలో పోరాడాలని ఎంపీలకు సూచించారు. ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు వేరు, రాష్ట్ర ప్రయోజనాలు వేరు అని గుర్తించి ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల సాధనకు పార్లమెంట్‌ను వేదికగా చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపీలకు సూచించారు.

సోనియాతో మాటామంతి

పార్లమెంట్‌లో దాదాపు 50 నిమిషాలు పైగా అగ్రనేత సోనియా గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. పార్లమెంట్‌కు చేరుకున్న సోనియా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం సోనియా, ప్రియాంక గాంధీలతో కలిసి తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారానికి వీక్షించేందుకు వీవీఐపీ గ్యాలరీలకు వెళ్లారు. అప్పటికి తెలంగాణ ఎంపీల ప్రమాణం స్వీకారం ప్రారంభమైంది. అనంతరం యూపీలోని రాయ్‌బరేలీ నుంచి ఎన్నికైన రాహుల్ గాంధీ ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. ఆ సమయంలో... తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకార సమయంలో సోనియా, రేవంత్ రెడ్డి మధ్య రాష్ట్రానికి చెందిన అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఆ సమయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల విజయంపై సంతృప్తి వ్యక్తం చేసిన సోనియా... రేవంత్, సోనియాలకు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఎమ్మెల్సీల చేరికలు, మంత్రి వర్గ విస్తరణ పై కూడా చర్చించినట్టు సమాచారం.

పార్టీ ఎంపీలకు దీపా మున్షీ విందు

కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దీపా మున్షీ విందు ఇచ్చారు. ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసం తుగ్లక్ రోడ్‌లో ఈ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సీఎంతో పాటు, తెలంగాణ నుంచి గెలుపొందిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, ఢిల్లీలో అందుబాటులో ఉన్న రాష్ట్రానికి చెందిన పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

14 ఏండ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత, వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే సోమవారం ఉదయం ఇంగ్లాండ్ లోని బెల్మార్ష్ జైలు నుంచి విడుదలయ్యారు. అమెరికా న్యాయ శాఖతో చేసిన అభ్యర్థన ఒప్పందంలో భాగంగా విముక్తి పొందాడు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ ప్రకారం, పసిఫిక్‌లోని అమెరికా భూభాగమైన నార్తర్న్ మరియానా దీవుల్లోని కోర్టులో నేరాన్ని అంగీకరించ డానికి అసాంజే అంగీకరించాడు. అతను ఇప్పటికే బ్రిటీష్ జైలులో గడిపిన సమయానికి సమానమైన ఐదేండ్ల శిక్ష విధిస్తారని భావిస్తున్నారు. కోర్టు విచారణల తర్వాత, అసాంజే తనకు పౌరసత్వం కలిగిన ఆస్ట్రేలియాకు వెళ్లాలని భావిస్తున్నాడు.

అభ్యర్థనా ఒప్పందంతో అసాంజే విడుదల

- స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు



వాషింగ్టన్ : వికీలీక్స్ వ్యవస్థాపకుడు అసాంజే ఎట్టకేలకు స్వేచ్ఛావాయువులుపీల్చుకున్నారు. గతచరిత్ర తిరగేస్తే..ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో వాషింగ్టన్ యుద్ధాలపై వందల వేల అమెరికా రహస్య సైనిక పత్రాలను 2010లో వికీలీక్స్ విడుదల చేసింది. ఇది అమెరికా సైనిక చరిత్రలో అతిపెద్ద భద్రతా ఉల్లంఘన కిందకు వస్తుంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనలో వికీలీక్స్ ఈ పత్రాలను భారీగా విడుదల చేయడంపై అసాంజేపై నేరారోపణ వేశారు. వీటిని గూఢచర్య చట్టం కింద కూడా విచారించబడిన అమెరికా మిలిటరీ ఇంటెలిజెన్స్ మాజీ విశ్లేషకురాలు చెల్సియా మానింగ్ లీక్ చేసింది. 2010లో వికీలీక్స్ ప్రచురించిన దౌత్యపరమైన కేబుల్స్, మిలిటరీ ఫైళ్లను దొంగిలించడానికి ఆమెను అస్సాంజే ప్రోత్సహిస్తున్నారని, సహాయం చేశారని 2019లో న్యాయ శాఖ నేరారోపణ చేసింది. అమెరికా, దాని మిత్రదేశాలకు హాని కలిగించే పత్రాలను ప్రచురించడం ద్వారా అసాంజే జాతీయ భద్రతను దెబ్బతీస్తున్నాడని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. దేశ రక్షణకు సంబంధించిన పత్రాలు, గమనికలు, ఇతర రచనలను స్వీకరించడానికి, పొందేందుకు, ఆ రికార్డులను "ఉద్దేశపూర్వకంగా కమ్యూనికేట్ చేయడానికి" మన్నింగ్‌తో అసాంజే కుట్ర పన్నాడని అభ్యర్థన ఒప్పందానికి సంబంధించి దాఖలు చేసిన ఛార్జింగ్ డాక్యుమెంట్‌లో ప్రాసిక్యూటర్లు తెలిపారు. అసాంజే "అమెరికా పౌరుడు కాదు, ఆయన అమెరికా సెక్యూరిటీ క్లియరెన్స్ కలిగి లేడు. అమెరికా జాతీయ రక్షణకు సంబంధించిన పత్రాలు, రచనలు లేదా గమనికలను కలిగి ఉండటానికి, యాక్సెస్ చేయడానికి లేదా నియంత్రించడానికి అధికారం లేదు" అని అమెరికా న్యాయ శాఖ స్పష్టం చేసింది.

ఈ కేసును పత్రికా న్యాయవాదులు, అసాంజే మద్దతుదారులు తీవ్రంగా ఖండించారు. ఫెడరల్ ప్రాసిక్యూటర్లు దీనిని ఒక జర్నలిస్టు సమాచారాన్ని సేకరించే లక్ష్యానికి మించి, వర్గీకృత ప్రభుత్వ పత్రాలను అభ్యర్థించడం, దొంగిలించడం, విచక్షణా రహితంగా ప్రచురించే ప్రయత్నమేనని సమర్థించారు. అసాంజేను ప్రాసిక్యూట్ చేయడానికి అమెరికా ఒత్తిడిని విరమించుకోవాలని ఆస్ట్రేలియా చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నట్లు అధ్యక్షుడు జో బైడెన్ చెప్పిన కొన్ని నెలల తర్వాత ఈ అభ్యర్థన ఒప్పందం వచ్చింది. అసాంజే కేసును పరిష్కరించే నిర్ణయంలో వైట్‌హౌస్ ప్రమేయం లేదు, ఈ కేసు గురించి బహిరంగంగా మాట్లాడటానికి అధికారం లేని వైట్‌హౌస్ అధికారి, అజ్ఞాత పరిస్థితిపై అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడారు.

వికీలీక్స్‌కు రహస్య ప్రభుత్వ, సైనిక పత్రాలను లీక్ చేసినందుకు గూఢచర్య చట్టం, ఇతర నేరాలను ఉల్లంఘించినందుకు దోషిగా నిర్ధారించబడిన తర్వాత మానింగ్‌కు 35 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది. ప్రెసిడెంట్ బరాక్ ఒబామా 2017లో ఆమె శిక్షను మార్చారు, దాదాపు ఏడేళ్ల తర్వాత ఆమెను విడుదల చేయడానికి అనుమతించారు. రష్యన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్స్ దొంగిలించారని ప్రాసిక్యూటర్లు చెబుతున్న డెమోక్రటిక్ ఇ మెయిల్‌లను తన వెబ్‌సైట్ ప్రచురించిన తర్వాత 2016లో అస్సాంజే ముఖ్యాంశాలుగా నిలిచాడు. ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లెర్ చేసిన రష్యా దర్యాప్తులో అతనిపై ఎప్పుడూ అభియోగాలు లేవు. 7,00,000 కంటే ఎక్కువ డాక్యుమెంట్‌లలో దౌత్యపరమైన తంతులు, అమెరికా అపాచీ హెలికాప్టర్ ఇరాక్‌లోని అనుమానిత తిరుగుబాటుదారులపై కాల్పులు జరిపిన 2007 వీడియో, ఇద్దరు రాయిటర్స్ వార్తా సిబ్బందితో సహా డజను మందిని చంపడం వంటి యుద్ధభూమి దృశ్యాలుగల ఆ వీడియో 2010లో విడుదలైంది. సమాచారాన్ని దొంగిలించే లేదా లీక్ చేసే ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగులపై సాధారణంగా మోపే అభియోగాలు వికీలీక్స్ ప్రచురణకర్తగా అసాంజే పై మోపకూడదని చాలాకాలంగా వాదించిన అతని ప్రపంచ మద్దతుదారుల్లో ఆగ్రహాన్ని రేకెత్తించాయి. చాలా మంది పత్రికా స్వేచ్ఛ న్యాయవాదులు అసాంజేపై నేరారోపణలు చేయడం వాక్ స్వాతంత్ర్యానికి ముప్పు అని వాదించారు.

"ప్లీజ్ డీల్ పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన చెత్త దృష్టాంతాన్ని నివారిస్తుంది, అయితే జర్నలిస్టులు ప్రతిరోజూ చేసే కార్యకలాపాలకు అసాంజే ఐదేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఈ ఒప్పందం భావిస్తోంది" అని కొలంబియా విశ్వవిద్యాలయంలోని ఫ్రీ స్పీచ్ ఆర్గనైజేషన్ నైట్ ఫస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జమీల్ జాఫర్ అన్నారు. "ఇది ఈ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతి ముఖ్యమైన జర్నలిజంపై సుదీర్ఘ నీడను చూపుతుంది" అని ఆయన అన్నాడు.

సుదీర్ఘ సాహస యాత్ర

2010లో మొదటిసారిగా బ్రిటన్‌లో అస్సాంజ్‌ని యూరోపియన్ అరెస్ట్ వారెంట్‌పై అరెస్టు చేశారు. స్వీడిష్ అధికారులు సెక్స్ నేరారోపణలపై అతన్ని ప్రశ్నించాలని కోరినట్లు చెప్పారు. అతను ఈక్వెడార్ రాయబార కార్యాలయానికి పారిపోయాడు. స్వీడన్‌కు అప్పగించబడకుండా ఉండటానికి ఏడేండ్లు అస్సాంజే అక్కడే ఉన్నాడు. 2019లో బెయిల్ షరతులను ఉల్లంఘించినందుకు లండన్‌లోని ఈక్వడార్ రాయబార కార్యాలయం నుంచి బయటకు లాగి జైలులో పడేశారు. అప్పటి నుంచి అతను లండన్‌లోని బెల్మార్ష్ టాప్ సెక్యూరిటీ జైలులో ఉన్నాడు. అక్కడ నుంచి అమెరికాకు అప్పగించకుండా ఉండాలని అతను దాదాపు ఐదేండ్లుగా పోరాడుతున్నాడు.

చరిత్రసృష్టించిన ఆఫ్ఘనిస్తాన్

నిర్ణయాత్మక మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 8పరుగుల తేడాతో గెలుపు

తొలిసారి టి20 ప్రపంచకప్ సెమీస్ బెర్త్



కింగ్‌స్‌టౌన్: టి20 ప్రపంచకప్ సెమీస్‌కు చేరి ఆఫ్ఘనిస్తాన్ జట్టు చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీ చరిత్రలో ఆఫ్ఘన్ జట్టు సెమీస్‌కు చేరడం ఇదే ప్రథమం. సెమీస్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 8పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై సంచలన విజయం సాధించింది. సూపర్-8 మ్యాచుల్లో భాగంగా తొలుత ఆస్ట్రేలియాకు ఝలక్ ఇచ్చిన ఆఫ్ఘన్ జట్టు మంగళవారం బంగ్లాదేశ్‌ను ఓడించి దర్జాగా సెమీస్‌కు చేరింది. దీంతో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియాతోపాటు బంగ్లాదేశ్ సూపర్-8కే పరిమితమయ్యాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘన్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 115పరుగులే చేసింది. గుర్బాజ్ (43) టాప్ స్కోరర్. ఇబ్రహీం జద్రాన్(18), రషీద్ ఖాన్(19నాటౌట్) విలువైన పరుగులు సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాను 17.5 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌట్ చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించారు. టార్గెట్‌ను 114 పరుగులుగా నిర్ణయించారు. ఆఫ్గాన్ 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.





దీంతో సూపర్-8 గ్రూప్-1 నుంచి భారత్‌తో పాటు ఆఫ్గాన్ సగర్వంగా నాకౌట్ స్టేజ్‌కు వెళ్లింది. గురువారం ఉదయం 6 గంటలకు దక్షిణాఫ్రికాతో తొలి సెమీస్‌లో ఆఫ్గాన్ తలపడనుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు భారతజట్టు ఇంగ్లాండ్‌తో రెండో సెమీస్‌లో తలపడనుంది. సూపర్-8లో మూడు జట్ల భవితవ్యం తేల్చే చివరి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ టోర్నమెంట్‌లో సంచలన విజయాలు నమోదు చేస్తున్న ఆఫ్గాన్ ఈసారి కూడా పట్టు వదల్లేదు. లక్ష్యం చిన్నదైనా సరే బంగ్లాను కట్టడి చేసి విజయం సాధించింది.

రషీద్, నవీనుల్ అద్భుతం..

బంగ్లా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ లిటన్ దాస్ (54) చివరి వరకూ క్రీజ్‌లో ఉన్నా తన జట్టును గెలిపించలేకపోయాడు. బంగ్లాదేశ్ నిష్క్రమణ 13 ఓవర్లప్పుడే తేలినా.. ఆఫ్గాన్ ఆశలకు గండి కొట్టేలా అనిపించింది. అయితే, కెప్టెన్ రషీద్ ఖాన్ (4/23), నవీనుల్ హక్ (4/26), ఫరూఖి (1/15), గుల్బాదిన్ (1/5) కీలక సమయంలో చెలరేగిపోయారు. బంగ్లాను ఒత్తిడికి గురి చేస్తూ వికెట్లు పడగొట్టారు. లిటన్‌తోపాటు సౌమ్యా సర్కార్ (10), తౌహిద్ (14) మినహా ఎవరూ రెండంకెల స్కోరు చేయలేదు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నవీనుల్ హక్‌కు లభించింది. ఈ టోర్నీలోనే ఆఫ్ఘన్ జట్టు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలను ఓడించిన సంగతి తెలిసిందే.

ఆఫ్ఘనిస్తాన్‌లో అంబరాన్నంటిన సంబరాలు

ఆఫ్ఘనిస్తాన్ జట్టు టి20 ప్రపంచకప్ సెమీస్‌కు చేరడంతో అక్కడి క్రికెట్ అభిమానులు అంబరాన్నంటేలా సంబరాలు చేసుకుంటున్నారు. వేల సంఖ్యలో వీధుల్లో ర్యాలీ తీశారు. టి20 వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్‌పై నెగ్గిన ఆ జట్టు.. సెమీస్‌లోకి ప్రవేశించింది. ఆ అద్భుత సందర్భాన్ని ఆఫ్ఘన్ క్రీడాభిమానులు ఫుల్ ఎంజాయ్ చేశారు. జనం భారీ సంఖ్యలో ర్యాలీ తీస్తున్న ఫోటోలు, వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. మ్యాచ్ ముగిసిన తర్వాత టీమ్ బస్సులో వెళ్తున్న ఆఫ్ఘన్ క్రికెటర్లు కూడా పార్టీ చేసుకున్నట్లు కొన్ని వీడియోలు వచ్చాయి. నాన్‌గర్హర్ పట్టణంలో భారీ సంఖ్యలో క్రికెట్ ప్రేమికులు ర్యాలీ తీశారు. జీవిత కల నెరవేరినట్లు ఆఫ్ఘన్ కెప్టెన్ రషీద్ ఖాన్ పేర్కొన్నాడు. టోర్నీలో స్టార్ట్ చేసిన తీరు బాగుందని, న్యూజిలాండ్‌ను ఓడించిన తర్వాత తమకు నమ్మకం పెరిగిందన్నాడు. ఆ ఫీలింగ్‌ను వర్ణించే మాటలు లేవన్నాడు. ఈ వికెట్‌పై 135 స్కోరు పర్వాలేదనుకున్నామని, 20 రన్స్ తక్కువే అయినా, ఇదంతా మైండ్‌సెట్‌కు సంబంధించిన ఆట అని రషీద్ తెలిపాడు. ఆఫ్ఘన్ జట్టు సభ్యులపై కెప్టెన్ ప్రశంసలు కురిపించాడు. టీ20 లైనప్ చాలా బలంగా ఉందన్నాడు.

స్కోర్‌బోర్డు...

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)సౌమ్య సర్కార్ (బి)రిషాద్ హొస్సైన్ 43, ఇబ్రహీం జద్రాన్ (సి)తంజిమ్ హసన్ (బి)రిషాద్ హొస్సైన్ 18, అజ్మతుల్లా (సి)లింటన్ దాస్ (బి)ముస్తాఫిజుర్ 10, గులాబుద్దిన్ (సి)సౌమ్య సర్కార్ (బి)రిషాద్ హొస్సైన్ 4, నబి (సి)శాంటో (బి)తస్కిన్ అహ్మద్ 1, కరీమ్ జనత్ (నాటౌట్) 7, రషీద్ ఖాన్ (నాటౌట్) 19, అదనం 13. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 115పరుగులు.

వికెట్ల పతనం: 1/59, 2/81, 3/88, 4/89, 5/93

బౌలింగ్: తంజిమ్ హసన్ 4-0-36-0, తస్కిన్ అహ్మద్ 4-1-12-1, షకీబ్ 4-0-19-0, ముస్తాఫిజుర్ 4-0-17-1, రిషాద్ హొస్సైన్ 4-0-26-3,

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: లింటన్ దాస్ (నాటౌట్) 54, తంజిద్ హసన్ (ఎల్‌బి)ఫారుఖీ 0, నజ్ముల్ (సి)నబి (బి)నవీన్-ఉల్-హక్ 5, షకీబ్ (సి అండ్ బి)నవీన్-ఉల్-హక్ 0, సౌమ్య సర్కార్ (బి)రషీద్ ఖాన్ 10, తౌహిద్ హృదయ్ (సి)ఇబ్రహీం జద్రాన్ (బి)రషీద్ ఖాన్ 14, మహ్మదుల్లా (సి)మహ్మద్ (బి)రిషాద్ ఖాన్ 6, రిషాద్ హొస్సైన్ (బి)రషీద్ ఖాన్ 0, తంజిమ్ హసన్ (సి)నబి (బి)గులాబుద్దిన్ 3, తస్కిన్ అహ్మద్ (బి)నవీన్-ఉల్-హక్ 2, ముస్తాఫిజుర్ (ఎల్‌బి)నవీన్-ఉల్-హక్ 0, అదనం 11. (17.5ఓవర్లలో ఆలౌట్) 105పరుగులు.

వికెట్ల పతనం: 1/16, 2/23, 3/23, 4/48, 5/64, 6/80, 7/80, 8/92, 9/105, 10/105

బౌలింగ్: నవీన్-ఉల్-హక్ 3.5-0-26-4, ఫారుఖీ 2-0-15-1, మహమ్మద్ నబి 2-0-15-0, రషీద్ ఖాన్ 4-0-23-4, నూర్ అహ్మద్ 4-0-13-0, గులాబుద్దిన్ 2-0-5-1.

మంధానాకు 4వ ర్యాంక్

ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్లు సత్తా చాటారు. మహిళలజట్టు వైస్ కెప్టెన్ స్మృ తి మంధాన 4వ ర్యాంక్‌లో నిలువగా.. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకొని 9వ స్థానంలో నిలిచింది. దక్షిణాఫ్రికా మహిళలతో స్వదేశంలో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం, ఆ సిరీస్‌లో వీరిద్దరూ బ్యాటింగ్‌లో రాణించడంతో వారిద్దరి ర్యాంకులు మెరుగయ్యాయి. మంధాన దక్షిణాఫ్రికాపై 117, 136, 90పరుగులతో రాణించగా.. హర్మన్‌ప్రీత్ రెండో వన్డేలో 103పరుగులతో కదం తొక్కిన సంగతి తెలిసిందే. ఐసిసి మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో మంధాన 738రేటింగ్ పాయింట్లతో, హర్మన్ ప్రీత్ కౌర్ 648రేటింగ్ పాయింట్లతో ఆయా స్థానాల్లో నిలిచారు. వీరిద్దరూ బ్యాటర్ల జాబితాలో టాప్-10లో చోటు దక్కించుకోవడం విశేషం.

నవచిత్రం

ఇది చిన్న కథ కాదు



భాగ్య రాజ్

సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా చిత్రం '35- చిన్న కథ కాదు'. సురేష్‌ప్రొడక్షన్స్‌తోపాటు ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో నివేతా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమని రైటర్, డైరెక్టర్. మంగళవారం మేకర్స్ ప్లజెంట్‌గా డిజైన్ చేసిన పోస్టర్ ద్వారా టైటిల్‌ని రివీల్ చేశారు. గుడి మెట్లపై కూర్చున్న ఫ్యామిలీని ప్రజెంట్ చేస్తూ క్యారికేచర్‌గా దీన్ని రూపొందించారు. థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా సిద్ధమైంది. బ్లాక్ బస్టర్ హిట్ కొట్టడం ఖాయమని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

'పెళ్లి చూపులు, సమ్మోహనం, అంటే సుందరానికీ' తదితర చిత్రాలకు అద్భుతమైన సంగీతం అందించిన వివేక్ సాగర్ ఈ చిత్రానికి మ్యూజిక్ సమకూరుస్తున్నారు. 'ఆకాశం నీ హద్దు రా, అంటే సుందరానికి, సర్ఫిరా, కుబేర' తదితర చిత్రాలకు గ్రేట్ విజువల్స్‌తో మంచి పేరు తెచ్చుకున్న నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. విజువల్ అప్పీల్‌ని యాడ్ చేస్తూ ప్రొడక్షన్ డిజైన్‌ను లతా నాయుడు నిర్వహిస్తున్నారు. ఈ మూవీ తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: టి సి ప్రసన్న, డైలాగ్స్: నంద కిషోర్ ఈమాని, ప్రశాంత్ విఘ్నేష్ అమరావతి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్ సౌమిత్రి, క్రియేటివ్ ప్రొడ్యూసర్: శివాని దోభాల్.

ఆద్యంతం వినోదభరితంగా ఆయ్



ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాలను అందించిన ప్రతిష్టాత్మక సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'ఆయ్'. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్నారు. అంజి కె.మణిపుత్ర ఈ చిత్రంతో దర్శకుడిగా బాధ్యతలను నిర్వహి స్తున్నారు. బన్నీ, విద్యా కొప్పినీడి ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్బ్ రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి. సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్ రూపంలో బాగా వైరల్ అయ్యాయి. దీంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ ఫన్ ఎంటర్‌టైనర్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న విడుదల చేస్తున్నారు.

"ఆయ్'ను విడుదల చేయటానికి ఇండిపెండెన్స్ డే పర్‌ఫెక్ట్ డేట్. ఎందుకంటే ఆగస్ట్ 15న గురువారం, తర్వాత రోజు నుంచి వీకెండ్ ప్రారంభం అవుతుంది. ఇక సోమవారం రోజున రక్షా బంధన్ కావడంతో ఆ రోజు కూడా కలిసొస్తుంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే క్యారెక్టర్ టీజర్, పాటలను మేకర్స్ విడుదల చేశారు. రెగ్యులర్‌గా మూవీ అప్‌డేట్స్‌ను ఇస్తున్నారు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా రూపొందింది. ఈ ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో నార్నే నితిన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతోన్న ఈ సినిమాకు సహ నిర్మాతలు - భాను ప్రతాప్, రియాజ్ చౌదరి, ఎడిటర్ - కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్ డైరెక్టర్ - కిరణ్ కుమార్ మన్నె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - అజయ్ గద్దె, కాస్ట్యూమ్స్ - సుష్మిత, శిల్ప.



హవీష్

ఎస్..బాస్ పక్కా కమర్షియల్


నిర్మాత, విద్యావేత్త, కె.ఎల్.యూనివర్సిటీ ఛైర్మన్ కోనేరు సత్యనారాయణ సినీ రంగంలోనూ రాణిస్తున్నారు. కె స్టూడియోస్ బ్యానర్‌పై 'రాక్షసుడు', 'ఖిలాడి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను నిర్మించిన ఆయన ఇప్పుడు తన తదుపరి చిత్రం 'ఎస్ బాస్'ను రూపొందిస్తున్నారు. కాంచన కోనేరు సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మిస్టరీ థ్రిల్లర్ 'సెవన్' తర్వాత హవీష్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. 'నువ్విలా' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన హవీష్, 'రామ్ లీల', 'జీనియస్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే.

'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు అశోక్ 'ఎస్ బాస్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇది పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లా అన్నీ అంశాలతో రూపొందుతోంది. మంగళవారం హవీష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి హవీష్ స్టైలిష్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమా షూటింగ్ పూర్తయ్యింది.

డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. ఆకుల శివ ఈ చిత్రానికి కథ, మాటలు అందించారు. బ్రహ్మానందం ఈ చిత్రంలో కీలక పాత్రను పోషించారు. ఆయన ఈ చిత్రంలో నటిస్తుండటంతో ఎంటర్‌టైన్‌మెంట్ నెక్స్ట్ రేంజ్‌లో ఉంటుందనటంలో సందేహం లేదు. కబీర్ లాల్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

'భిన్న కంటెంట్ చిత్రాలను ఎంచుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయకుడు హవీష్‌కు ఈ సినిమా సైతం మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ తెలిపారు.

సేనాపతి విశ్వరూపం



కమల్‌హాసన్

కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌తో పాటు రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. జీరో టాలరెన్స్ ట్యాగ్ లైన్. ఈ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న ఈ చిత్రం గ్రాండ్ లెవల్లో రిలీజ్ కానుంది. చిత్ర యూనిట్ ప్రమోషనల్ ప్లానింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో 'భారతీయుడు 2' ట్రైలర్‌ను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేశారు..

సేనాపతిగా కమల్‌హాసన్ తనొక ఫ్రీడమ్ ఫైటర్‌గా తన గురించి చెబుతూ ఇది రెండో స్వాతంత్ర్య పోరాటం. గాంధీజీ మార్గంలో మీరు.. నేతాజీ మార్గంలో నేను అనే పవర్‌ఫుల్, ఎమోషనల్ డైలాగ్స్ 'భారతీయుడు 2' ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక ట్రైలర్‌లో సేనాపతి పాత్రలో కమల్ హాసన్ యాక్షన్ సన్నివేశాలు, వాటిని అత్యద్భుతంగా తెరకెక్కించిన శంకర్ మేకింగ్ స్టైల్ నెక్స్ట్ రేంజ్‌లో ఉన్నాయి. సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆసక్తిని ట్రైలర్ రేకెత్తిస్తోంది. ఈ ట్రైలర్‌లో సేనాపతి పాత్రతో పాటు డిఫరెంట్ లుక్స్‌లో కమల్ హాసన్ తనదైన అభినయాన్ని ప్రదర్శించారు. ఇక మర్మకళతో విలన్స్ భరతం పట్టడాన్ని కూడా ఈ సినిమాలో మరింత విస్తృతంగా చూపించినట్లు స్పష్టమవుతుంది. రవివర్మన్ సినిమాటోగ్రఫీ, అనిరుద్ సంగీతం, నేపథ్య సంగీతం సన్నివేశాలను మరో లెవల్‌లో ఆవిష్కరించాయి. దీంతో సేనాపతిగా మరోసారి కమల్ హాసన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయబోతున్నారంటూ ట్రైలర్ చూస్తుంటేనే అర్థమవుతోందని చిత్ర యూనిట్ తెలిపింది.

రొటీన్‌కి భిన్నంగా ..



గాయత్రి భరద్వాజ్, అల్లు శిరీష్, ప్రిషా రాజేశ్ సింగ్

అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కింది. జూలై 26న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ, 'గీతా ఆర్ట్స్, స్టూడియో గ్రీన్ కలిసి శామ్ ఆంటోన్ దర్శకత్వంలో 'ప్రేమకథా చిత్రమ్' సినిమాను తమిళంలో రీమేక్ చేశాం. ఆ సినిమాలో జీవీ ప్రకాష్‌ను హీరోగా ఇంట్రడ్యూస్ చేశాం. సంక్రాంతికి రిలీజైన ఆ సినిమా తమిళంలో మంచి హిట్ అయ్యింది. ఇప్పుడు బడ్డీ మూవీ చేస్తున్నాం. ఈ చిత్రంలో అలీ, అజ్మల్ బాగా సపోర్ట్ చేశారు. శామ్ మా సంస్థకు మరో మంచి సినిమా ఇస్తున్నారు' అని తెలిపారు. హీరోయిన్ గాయత్రి భరద్వాజ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కథను దర్శకుడు శామ్ చెప్పినప్పుడే ఇదొక స్పెషల్ ఫిల్మ్ అవుతుందని నమ్మాను. ఈ కథ వైడ్ రేంజ్ ఆఫ్ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యేలా ఉంటుంది' అని అన్నారు. 'స్టూడియో గ్రీన్ లాంటి బిగ్ ప్రొడక్షన్‌లో ఫస్ట్ మూవీ హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని హీరోయిన్ ప్రిషా రాజేశ్ సింగ్ చెప్పారు.

దర్శకుడు శామ్ ఆంటోన్ మాట్లాడుతూ,'జ్ఞానవేల్ రాజా ఈ సినిమా కోసం డిస్కషన్ జరిగినప్పుడు నన్ను స్క్రిప్ట్ కూడా అడగలేదు. కేవలం నా మీద నమ్మకంతో ఈ మూవీ ఇచ్చారు. సీజీ అయ్యాక ఫైనల్ వెర్షన్ సినిమా చూశారు. ఆయనకు సినిమా బాగా నచ్చింది. ఆయన తర్వాత నా మీద నమ్మకం ఉంచిన మరో పర్సన్ శిరీష్' అని తెలిపారు. 'టెడ్డీ బేర్‌తో ఎడ్వెంచర్ యాక్షన్ మూవీని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారు అనుకున్నా. కానీ ఇవాళ ట్రైలర్ చూశాక నాకు చాలా కాన్ఫిడెన్స్ వచ్చింది. కొత్త తరహా సినిమా ఎప్పుడు వచ్చినా మన ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారు. ఇది రెగ్యులర్ టైప్ మూవీ కాదు. కొత్తగా ఉంటుంది' అని హీరో అల్లు శిరీష్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.